గురువారం 6-6-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 75



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



ఆడుతూ పాడుతూ..

టి20 వరల్డ్‌కప్‌లో భారత్ శుభారంభం.. ఐర్లాండ్‌పై 8 వికెట్ల తేడాతో గెలుపు -14లో



మళ్లీ మార్కెట్ పరుగు

74,300 దాటేసిన సెన్సెక్స్.. 2,303 పాయింట్ల ర్యాలీ - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



కేజ్రీవాల్‌కు చుక్కెదురు

మధ్యంతర బెయిల్‌ను అనారోగ్య కారణాల రీత్యా పొడిగించాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది.

వివరాలు 6లో ▸



9 మంది దుర్మరణం

ఉత్తరాఖండ్‌లో పర్వతారోహణకు వెళ్లిన 9 మంది తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▸



నవీన్ పట్నాయక్ రాజీనామా

24 ఏళ్లుగా ఒడిశా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన నవీన్ పట్నాయక్ బుధవారం రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా

మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పేలవ మైన పనితీరుకు బాధ్యత వహిస్తూ డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸

ఎన్డీఏ నేతగా మోదీ

ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేతలు.. మోదీ సారథ్యంపై ప్రశంసలు

కూటమి తొలి భేటీలో తీర్మానం.. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఏర్పాటు

- నితీశ్ సహా 16 పార్టీల నేతల హాజరు
- రేపు ఎన్డీఏ ఎంపీల కీలక సమావేశం
- మోదీని నాయకునిగా ఎన్నుకోనున్న ఎంపీలు.. అనంతరం రాష్ట్రపతికి మద్దతు లేఖల సమర్పణ



బుధవారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఎన్డీఏ సమావేశంలో కుమారస్వామి, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా, చంద్రబాబు, నితీశ్‌కుమార్, ఏక్‌నాథ్ షిండే, ప్రఫుల్‌పటేల్, పవన్ కళ్యాణ్ తదితరులతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ప్రధానమంత్రి మోదీ

- బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ కూటమి నేతగా ప్రధాని నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వెలువడ్డ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ మెజారిటీ స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ప్రధాని నివాసంలో ఎన్డీఏ కీలక సమావేశం జరిగింది. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు ఎన్డీఏ పక్షాల అగ్ర నేతలంతా పాల్గొన్నారు.

6లో

8 లేదా 9న ప్రమాణ స్వీకారం

మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న మోదీ

6లో

ప్రభుత్వం ఏర్పాటు చేద్దాం రండి

- కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై విపక్ష ఇండియా కూటమి మల్లగుల్లాలు పడుతోంది. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఇండియా కూటమిలో చేరాల్సిందిగా పార్టీలన్నింటినీ ఆహ్వానిస్తున్నట్టు ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు.

6లో

రాష్ట్రానికి నాలుగు కేంద్ర మంత్రి పదవులు!

- ఎన్డీఏలో కీలకంగా మారిన టీడీపీ
- కీలక శాఖలు కోరుతున్న చంద్రబాబు
- జనసేన, ఏపీ బీజేపీ నేతలకూ ఛాన్స్

- వివరాలు 3లో

ఇలాంటి పోరు ఇదే తొలిసారి

కూటమి సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం: చంద్రబాబు

- చరిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా
- మాకు అధికారంతో పాటు ఉన్నత బాధ్యత అప్పగించారు
- మేం ఎన్డీఏతోనే ఉన్నాం..

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. కూటమి నేతలు, కార్యకర్తల సమష్టి కృషి వల్లే ఈ విజయం దక్కిందన్నారు. బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు ఇచ్చింది అధికారం మాత్రమే కాదని, ఒక ఉన్నతమైన బాధ్యత అప్పగించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని రంగాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ వైఎస్ జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. భూమి మీద ఎవరూ శాశ్వతం కాదని, దేశం, ప్రజాస్వామ్యం, పార్టీలే శాశ్వతమన్నారు. ఈ తీర్పుతో రాష్ట్రంలో అందరికీ స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇంత చరిత్రాత్మక ఎన్నికలను తన జీవితంలో చూడలేదని వ్యాఖ్యానించారు. విదేశాల్లో ఉండే వ్యక్తులు రూ.లక్షలు ఖర్చు పెట్టుకుని వచ్చి మరీ ఓటు వేశారన్నారు. టీడీపీ, ఏపీ చరిత్రలో ఈ విజయం



సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. టీడీపీని స్థాపించినప్పుడు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి రాష్ట్రంలో 200 సీట్లు వచ్చాయని, 1994లో ప్రతిపక్షానికి కొన్ని చోట్ల డిపాజిట్లు కూడా రాలేదని, వాటన్నింటినీ అధిగమించి ఇప్పుడు ఇంత విజయం చేకూరడానికి ప్రజలు అనుభవించిన బాధలే కారణమన్నారు.

గతంలో కుప్పం, సిద్దిపేట పోటాపోటీ

ఈ ఎన్నికల్లో కూటమికి 55.38 శాతం ఓట్లు లభించగా ఇందులో టీడీపీకి 45.60 శాతం

మిగతా 3వ పేజీలో ▶



గుంటూరు జిల్లా ఈమనిలో నిర్మించిన ఆర్బీకేను ధ్వంసం చేస్తున్న కూటమి కార్యకర్త

టీడీపీ, జనసేన విధ్వంసం

- స్వైరవిహారం చేసిన నేతలు, కార్యకర్తలు
- విగ్రహాలు, శిలాఫలకాల ధ్వంసం, వాహనాల దహనం
- సచివాలయ బోర్డుల తొలగింపు
- పలుచోట్ల కూటమి జెండాల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు

11లో



వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

కొడవలితో నరికిన టీడీపీ కార్యకర్త

శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన

11లో

టీడీపీ వేధింపులకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ బలి

ఏలూరు జిల్లా పెదవేగి మండలంలో ఆత్మహత్య చేసుకున్న ప్రవీణ్

11లో

మంత్రుల రేసులో..

ఆశావహుల జాబితాపై చంద్రబాబు ప్రాథమిక కసరత్తు

పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవిపై అస్పష్టత

- విపక్షంగా సభలో అడుగు పెట్టి ప్రభుత్వంలో చేరతామంటున్న జనసేన అధ్యక్షుడు
- ఒకేసారి రెండు పాత్రలు పోషించడం సాంకేతికంగా ఎలా సాధ్యం?




సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు దక్కుతుందనే అంశంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కూటమి నుంచి 164 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందడంతో మంత్రి పదవులకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే కొందరికి మంత్రి పదవులు ఇస్తామని హామీ ఇవ్వడం, చాలామంది సీనియర్లు గెలుపొందడం, బీజేపీ, జనసేనకు అవకాశం ఇవ్వాల్సినందున మంత్రివర్గ కూర్పు కత్తిమీద సాములా మారనుంది. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కి ఉప ముఖ్యమంత్రి పదవి లభిస్తుందని ఎన్నికలకు ముందు నుంచే ప్రచారం సాగుతుండగా బుధవారం పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రధాన ప్రతిపక్షంగా అసెంబ్లీలోకి అడుగుపెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించడం గమనార్హం. మరోవైపు ప్రభుత్వంలోనూ భాగస్వాములుగా ఉంటామని చెప్పుకొచ్చారు. అయితే ఈ రెండు ఎలా సాధ్యమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలని నిర్ణయించుకుంటే మంత్రివర్గంలో జనసేన చేరడం కుదరదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ పవన్ కళ్యాణ్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటూ తన పార్టీకి చెందిన వారికి మంత్రి పదవులు

మిగతా 3వ పేజీలో ▶

ఎంబీబీఎస్‌లో ఏ ర్యాంక్‌కు ఎక్కడ సీటొస్తుంది?

నీట్ యూజీ 2024 ఫలితాలు వెల్లడించిన ఎన్టీఏ

- గత ఏడాదితో పోలిస్తే ఈ సారి 1.70 లక్షల మేర పెరిగిన అర్హుల సంఖ్య
- రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేటు, 2 మైనారిటీ, పద్మావతి మహిళా వైద్య కళాశాలలు
- ప్రభుత్వ కళాశాలల్లో మొత్తం సీట్లు 2,935
- ఆలిండియా కోటా 15 శాతం పోను మిగిలినవి భర్తీ



సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ–2024 ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది జాతీయ స్థాయిలో 23.33 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయగా 13.16 లక్షల మంది అర్హత సాధించారు. గత ఏడాదితో పోలిస్తే అర్హులైన విద్యార్థుల సంఖ్య 1.70 లక్షలు పెరిగింది. రాష్ట్రంలో 64,931 మంది పరీక్ష రాయగా, 43,858 మంది అర్హత సాధించారు. కాగా, జాతీయ స్థాయిలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా రాష్ట్ర స్థాయిలో ఏ ర్యాంక్ వస్తుంది? గత ఏడాది ఏ ర్యాంకుకు ఏ కళాశాలలో సీటు వచ్చిందో పోల్చుకొని, ఈసారి ఏ కళాశాలలో సీటు వచ్చే అవకాశాలున్నాయో

మిగతా 12వ పేజీలో ▶



దేశంలో ఐఐటీ బాంబే టాప్

- క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తాచాటిన భారతీయ ఐఐటీలు
- 61% భారతీయ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్స్ మెరుగుదల
- భారతీయ వర్సిటీల్లో ఐఐటీ బాంబేకు అగ్రస్థానం.. ఐఐటీ ఢిల్లీకి రెండో స్థానం.. బెంగళూరు ఐఐఎస్సీకి మూడో స్థానం
- ప్రపంచంలోనే అత్యుత్తమ వర్సిటీగా మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
- 13వసారి కూడా అగ్రస్థానంలో కొనసాగిన అమెరికా సంస్థ

3లో



గుంటూరులో జనసేన కార్యకర్తల దాష్టీకం

- హాస్టల్ యజమానిపై దాడి
- మోకాళ్లపై కూర్చోబెట్టి, కాళ్లు పట్టించుకున్న వైనం

3లో

నాగార్జున యాదవ్‌పై దాడికి యత్నం

చంపుతామని బెదిరించిన టీడీపీ వర్గీయులు

3లో

ఇదం జగత్



మా ఓట్లు ఏమయ్యాయి?

టీడీపీ ఓడిపోతుందనుకున్న చోట భారీ మెజారిటీలా..!

- వైఎస్సార్‌సీపీకి బాగా పట్టున్న గ్రామాల్లోనూ టీడీపీకి మెజారిటీ ఎలా?
- రాష్ట్రంలో కూటమి గెలుపుపై ప్రజల్లో అనేక సందేహాలు
- వైఎస్సార్‌సీపీని ఇంతలా ఓడించేంత వ్యతిరేకత లేదని స్పష్టీకరణ.. ఈవీఎంల సాంకేతికత, హ్యాకింగ్‌పై అనుమానాలు
- ఏ ఇద్దరు మాట్లాడుకున్నా దీనిపైనే చర్చ



సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: ''మేం జగన్‌కే ఓటేశాం.. మా ఓట్లన్నీ ఏమైపోయాయి.. ఏదో జరిగింది.. లేకపోతే అధికార పార్టీకి ఇంత దారుణంగా సీట్లు రావడమేంటి? బంపర్ మెజారిటీతో గెలుపొందుతాం అనుకున్న చోట టీడీపీకి మెజారిటీ రావడం ఏమిటి? వైఎస్సార్‌సీపీ ఓట్లు పక్కాగా 90 శాతం పైగా ఉన్న ఒక బూత్ పరిధిలో టీడీపీకి మెజారిటీ రావడాన్ని ఏమనుకోవాలి? ఏదో జరిగింది.. ఆ ఓటింగ్ మిషన్లను ఏదో చేశారు.. లేకపోతే ఇంత దారుణంగా ఫలితాలెలా వస్తాయి?'' అని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఈ చర్చే నడుస్తోంది. ఇంతలా

మిగతా 10వ పేజీలో ▶

ఈ ఫలితాలపై ఎన్నో అనుమానాలు



"ఈ ఫలితాలపై ఎవ్వరికీ నమ్మకం కలగడం లేదు. మా గ్రామంలో అత్యధిక శాతం మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారు. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత చూస్తే తారుమారైనట్లు కనిపించింది. సంక్షేమ పథకాలు అందుకున్న అనేక కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశాయి. కానీ ప్రతిరౌండులోనూ మెజార్టీ ఓట్లు ఏకపక్షంగా టీడీపీకి వచ్చాయి. జగన్‌ను అధికంగా అభిమానించే గ్రామాల్లోనే ఇలా టీడీపీకి ఓట్లు పడటం చూస్తుంటే ఎన్నో అనుమానాలున్నాయి.

- దుంపల ఉమ (రైతు), కమలనాభపురం, కోటబొమ్మాళి మండలం, శ్రీకాకుళం జిల్లా



వెలుగులోకి మరో 'కౌంటింగ్' మాయ

- పెదకూరపాడు నియోజకవర్గంలో 737 ఓట్లున్న ఈవీఎంను లెక్కించని అధికారులు
- 56వ పోలింగ్ బూత్ ఈవీఎంలో సాంకేతిక లోపమంటూ పక్కన పెట్టిన వైనం
- అచ్చంపేట మండలంలో 2019లో వైఎస్సార్‌సీపీకి 7,597 ఓట్ల మెజార్టీ
- ఈసారి ఈవీఎం లెక్కించకుండానే టీడీపీకి ఆధిక్యమని చెప్పిన అధికారులు
- ఇలాంటి దారుణాలు ఇంకెన్ని జరిగాయోనని అనుమానాలు

12లో

ఐఐటీ బాంబే టాప్

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తాచాటిన భారతీయ ఐఐటీలు



సాక్షి, అమరావతి: భారతీయ విశ్వవిద్యాలయాలు అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నాయి. ప్రతిష్టాత్మక క్యూఎస్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్–2025లో భారతీయ వర్సిటీలు మెరుగైన ర్యాంకింగ్స్ దక్కించుకున్నాయి. గతేడాదితో పోలిస్తే 61 శాతం భారతీయ వర్సిటీలు తమ ర్యాంకులను మెరుగుపర్చుకోగా.. 24 శాతం వర్సిటీలు పాత ర్యాంకులనే పొందాయి. కేవలం 9 శాతం వర్సిటీల ర్యాంకులు క్షీణించాయి. అలాగే మూడు కొత్త విశ్వవిద్యాయాలకు క్యూఎస్ ర్యాంకింగ్స్ జాబితాలో చోటు దక్కింది. జాతీయ స్థాయిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) బాంబే అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఐఐటీ ఢిల్లీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ)–బెంగళూరు, ఐఐటీ ఖరగ్‌పూర్ నిలిచాయి.

మెరుగైన ర్యాంకింగ్స్..

ప్రపంచ ర్యాంకింగ్స్ జాబితాలో ఐఐటీ బాంబే గతేడాది 149వ స్థానంలో ఉండగా.. ఈసారి 118వ ర్యాంక్ దక్కించుకుంది. ఐఐటీ ఢిల్లీ 197వ స్థానం నుంచి 150కి చేరుకుంది. ఐఐఎస్సీ 225 నుంచి 211వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఐఐటీ ఖరగ్‌పూర్ 271 నుంచి 222కు, ఐఐటీ మద్రాస్ 278 నుంచి 263వ ర్యాంకులకు చేరుకున్నాయి. ఐఐటీ కాన్పూర్ ర్యాంకు గతేడాది కంటే స్వల్పంగా తగ్గి 227వ స్థానంలో నిలిచింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం గణనీయమైన పురోగతి కనబర్చింది. ఈ వర్సిటీ 407వ ర్యాంక్ నుంచి 328వ ర్యాంకుకు చేరుకొని దేశంలోనే 7వ స్థానంలో నిలిచింది. ఐఐటీ రూర్కీకి 335, ఐఐటీ గౌహతికి 477, అన్నా వర్సిటీలకు 383వ ర్యాంక్ వచ్చింది. ఐఐటీ ఇండోర్ 454 నుంచి 477వ ర్యాంక్‌కు పడిపోయింది. జాతీయ స్థాయిలో మొదటి 15 స్థానాల్లో ఐఐటీ వారణాసి (ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 531వ స్థానం), జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ(580), శూలినీ వర్సిటీ ఆఫ్ బయో టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (587) వర్సిటీలున్నాయి. ఈ ఏడాది కొత్తగా సింబయాసిస్ ఇంటర్నేషనల్(డీమ్డ్) వర్సిటీ 641–650 ర్యాంకు పరిధిలో.. అలాగే దేశంలో 16వ స్థానం దక్కించుకుంది. టాప్–20లో ఐఐటీ హైదరాబాద్ (681–690), చండీగఢ్ వర్సిటీ (691–700), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుచిరాపల్లి (701–710), యూనివర్సిటీ ఆఫ్ ముంబై (711–720) ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–వెల్లూరు (791–800), ఎస్ఆర్ఎం చెన్నై (1,000–1,200) చోటు దక్కించుకున్నాయి.

క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్ -10 కళాశాలలు/విశ్వవిద్యాలయాలు



- మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)
- ఇంపీరియల్ కాలేజ్ లండన్
- ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం
- హార్వర్డ్ విశ్వవిద్యాలయం
- కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం
- స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం
- ఈటీహెచ్ జూరిచ్
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జూరిచ్
- యూనివర్సిటీ కాలేజ్ లండన్
- కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

13 ఏళ్లుగా వరల్డ్ నంబర్ వన్‌గా ఎంఐటీ

ప్రపంచవ్యాప్తంగా క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో అమెరికాకు చెందిన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా అగ్రస్థానంలో కొనసాగుతోంది. వరుసగా 13వసారి ఎంఐటీ అత్యుత్తమ ఇన్‌స్టిట్యూట్‌గా టైటిల్‌ను నిలుపుకుంది. మొత్తం 1,500 విశ్వవిద్యాలయాలకు ర్యాంకులను కేటాయించగా.. అమెరికా నుంచి అత్యధికంగా 197, బ్రిటన్ నుంచి 90, మెయిన్‌ల్యాండ్ చైనా నుంచి 71 వర్సిటీలు జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

గుంటూరులో జనసేన కార్యకర్తల దాష్టీకం

- హాస్టల్ యజమానిపై దాడి
- మోకాళ్లపై కూర్చోబెట్టి, కాళ్లు పట్టించుకున్న వైనం


హాస్టల్ యజమానిపై దాడి చేస్తున్న జనసేన కార్యకర్తలు

గుంటూరు ఈస్ట్: గుంటూరు లక్ష్మీపురంలో జనసేన కార్యకర్తల దాష్టీకమిది. ప్రైవేటు హాస్టల్ బోర్డుపై కులం పేరు ఉందన్న కారణంతో జనసేన కార్యకర్తలు ఆ హాస్టల్ యజమానిని కొట్టి మోకాళ్ల మీద కూర్చోబెట్టారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. జనసేన కార్యకర్తల దురాగతాన్ని ప్రజలు ఖండిస్తున్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు హాస్టల్‌లోకి మంగళవారం కొందరు జనసేన కార్యకర్తలు కర్రలతో ప్రవేశించారు. హాస్టల్ యజమానిని బయటకు పిలిచి బోర్డు పైన ఉన్న ఓ సామాజికవర్గం పేరును తొలగించాలని బెదిరించారు. హాస్టల్ యజమాని అందుకు నిరాకరించాడు. దీంతో కోపోద్రిక్తులైన జనసేన కార్యకర్తలు మూకుమ్మడిగా హాస్టల్ యజమానిపై దాడి చేశారు. వదిలిపెట్టాలని హాస్టల్ యజమాని ప్రాధేయపడినా వదల్లేదు. పైగా జనసేన కార్యకర్తలు హాస్టల్ యజమానిని మోకాళ్ల మీద కూర్చోబెట్టి, వారి కాళ్ళు పట్టించుకున్నారు. అయితే జనసేన కార్యకర్తలకు భయపడిన హాస్టల్ యజమాని ఈ ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెనకడుగు వేశాడు.

నాగార్జున యాదవ్‌పై దాడికి యత్నం

చంపుతామని బెదిరించిన టీడీపీ వర్గీయులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌పై టీడీపీ వర్గీయులు దాడికి యత్నించారు. బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో టిఫిన్ చేస్తున్న నాగార్జున యాదవ్‌ను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. లోకేశ్ గురించి మాట్లాడే స్థాయి నీకుందా? అంటూ ఫోర్కుతో పొడిచే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడున్న హోటల్ సిబ్బంది అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం కూడా సదరు వ్యక్తులు అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు చంపుతామంటూ హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి ట్రోల్ చేయడం గమనార్హం.

సింహాద్రిలో విద్యుదుత్పత్తికి అంతరాయం

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో నాల్గవ యూనిట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా బుధవారం తెల్లవారు జామున విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సంస్థలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాల్గవ యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడిన కారణంగా విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. సమస్యను గుర్తించిన సాంకేతిక నిపుణులు రంగంలోకి దిగి యూనిట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను సరిచేయడానికి సన్నాహాలు ప్రారంభించారు.

క్లుప్తంగా...

15వ రాష్ట్ర శాసనసభ రద్దు

- గెజిట్ నోటిఫికేషన్ జారీ

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ మంత్రివర్గం రాజీనామా చేయడంతో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఏర్పాటుకు వీలుగా 15వ రాష్ట్ర అసెంబ్లీని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. సీఎం పదవికి వైఎస్ జగన్ చేసిన రాజీనామాను ఆమోదించిన గవర్నర్.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ప్రస్తుత మంత్రివర్గం కొనసాగాల్సిందిగా ఆదేశించిన విషయం తెలిసిందే.

రెవెన్యూ కీలక ఫైళ్లను ప్రాసెస్ చేయవద్దు

- రెవెన్యూ ప్రత్యేక సీఎస్ ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: రెవెన్యూ శాఖలో కీలక ఫైళ్లను ప్రాసెస్ చేయవద్దని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతున్న తరుణంలో రెవెన్యూ శాఖకు సంబంధించి కాంట్రాక్టర్లకు నిధుల విడుదల, భూ కేటాయింపులకు చెందిన ఫైళ్లను ప్రాసెస్ చేయవద్దని ఆయన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే అధికారుల బదిలీలకు చెందిన ఫైళ్లను కూడా ప్రాసెస్ చేయవద్దని రెవెన్యూ శాఖలోని అన్ని సెక్షన్లను ఆదేశించారు. రెవెన్యూ శాఖ మంత్రి పేషీలోని రికార్డులు, ఫైళ్లు, ఎలక్ట్రానిక్ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాల్సిందిగా రెవెన్యూ మంత్రి పేషీ సిబ్బందికి ఆయన సూచించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు రజత్ భార్గవ స్పష్టం చేశారు.

ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులతో టీడీపీ నేతల వాగ్వాదం

గన్నవరం: టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన సమయంలో టీడీపీ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఎన్డీఏ పక్షాల సమావేశానికి గాను ఢిల్లీ వెళ్లేందుకు ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన చంద్రబాబును కలిసేందుకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వచ్చారు. భద్రతా కారణాల దృష్ట్యా ఏర్పాటు చేసిన బారికేడ్లు, రోప్‌ను నెట్టుకుని కొంతమంది బాబు వద్దకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఆగ్రహానికి గురైన టీడీపీ నేతలు పోలీసులతో గొడవ పడి దూషణలకు దిగారు. వీరి మధ్య మాటమాట పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. సీఐ వరప్రసాద్, పలువురు ఎస్ఐలు జోక్యం చేసుకుని సిబ్బందికి, టీడీపీ నేతలకు నచ్చజెప్పడంతో గొడవ సర్దుమణిగింది.

అభివృద్ధి చెందుతున్న మడ అడవులు

ప్రకటించిన కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్

సాక్షి, అమరావతి: పర్యావరణ పరిరక్షణలో కీలకమైన మడ అడవులు రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని వేదాంత గ్రూపునకు చెందిన కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ ప్రకటించింది. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా యానాం సమీపంలోని రవ్వ క్షేత్రం వద్ద విస్తరించి ఉన్న 86 ఎకరాల మడ అడవుల అభివృద్ధిని తాము స్వీకరించినప్పటి నుంచి అవి వేగంగా విస్తరిస్తూ సజీవమైన చిత్తడి నేలగా రూపాంతరం చెందుతున్నాయని కెయిర్న్ తెలిపింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా 458 ఎకరాల మడ అడవులతోపాటు, థార్ ఎడారిలో 15 వేల జమ్మి మొక్కలు, రాజస్తాన్‌లోని బార్మర్‌లో 20వేల మొక్కలను నాటినట్లు పేర్కొంది.

అటు అధికారం.. ఇటు విపక్ష హోదా

- రెండూ టెక్నికల్‌గా ఎలా సాధ్యమో చూడాలి: పవన్
- గెలుపొందిన పార్టీ అభ్యర్థులతో సమావేశంలో వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏర్పాటయ్యే నూతన ప్రభుత్వంలో ఖచ్చితంగా జనసేన భాగస్వామ్యం ఉంటుందని పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. అయితే అదే సమయంలో జనసేన ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా అసెంబ్లీలోకి అడుగు పెడుతోందని, ఈ రెండింటి మధ్య టెక్నికల్‌గా ఎలా సాధ్యమో చూడాలంటూ వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో విజయం సాధించిన జనసేన అభ్యర్థులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి నాగబాబు తదితరులు ఇందులో పాల్గొన్నారు. ప్రతి ఓటును బాధ్యతగా భావించి జవాబుదారీతనంతో పని చేయాలని జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఈ సందర్భంగా పవన్ సూచించారు. ఇప్పటి వరకు దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకీ లభించని గెలుపును రాష్ట్ర ప్రజలు జనసేనకు అందించారన్నారు. జనసేన నుంచి గెలిచిన ఇద్దరు ఎంపీలు రాష్ట్ర సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించాలన్నారు.

రూపాయి జీతం మాటలు చెప్పను..

కేవలం రూపాయి జీతం తీసుకుంటాననే ఆర్భాటపు మాటలు కాకుండా ఓ ప్రజా ప్రతినిధిగా ఖజానా నుంచి సంపూర్ణ జీతం తీసుకుంటా. దీనివల్ల తాము చెల్లించే పన్నుల నుంచి జీతం తీసుకుంటున్నందున పనులు ఎందుకు చేయవనే అధికారం ప్రజలకు ఉంటుంది. అందుకే సంపూర్ణంగా జీతం తీసుకొని అంతే సంపూర్ణంగా ప్రజల కోసం కష్టపడతా. ప్రజల కోసం ఎంత జీతం తీసుకున్నా దానికి వెయ్యి రెట్లు వారు కష్టాల్లో ఉన్నప్పుడు ఇస్తా. యువతకు ప్రజాప్రతినిధులు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా జనసేన ప్రయాణం ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించి ఎన్నో సమస్యలున్నాయి. వ్యక్తిగత దూషణలు లేకుండా కొత్త ఒరవడిని తెద్దాం. కొత్తగా నిర్మిస్తున్న జనసేన కార్యాలయం తలుపులు ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచేందుకు నిరంతరం తెరిచే ఉంటాయి.

ఇలాంటి పోరు ఇదే తొలిసారి

▶ మొదటి పేజీ తరువాయి

ఓట్లు వచ్చాయని చంద్రబాబు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి 39.37 శాతం ఓట్లు దక్కాయన్నారు. గతంలో కుప్పం, సిద్ధిపేట మెజారిటీల్లో పోటీ పడేవని, ఇప్పుడు గాజువాక, భీమిలి, మంగళగిరిలో 90 వేల మెజారిటీలు దాటాయన్నారు.

పాలకులు కాదు సేవకులం

తాము పాలకులం అని కాకుండా సేవకులం అనే నినాదానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. సూపర్ 6, ప్రజాగళం మేనిఫెస్టో అంశాలు ప్రజల్లోకి బాగా వెళ్లాయని తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని పవన్ కళ్యాణ్ ముందుకు వచ్చి కూటమికి బీజం వేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీలో తనను, తన కుటుంబ సభ్యులను అవమానించారని, కౌరవసభలో ఉండబోనని నాడు చెప్పానన్నారు. గౌరవ సభగా మార్చిన తర్వాతే మళ్లీ సభకు వస్తానని చెప్పానని, తన ప్రతిజ్ఞను ప్రజలు నిజం చేశారని తెలిపారు.

బలమైన తీర్పు

అహంకారం, నియంతృత్వం, విచ్చలవిడితనాన్ని ప్రజలు క్షమించరనేందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. పాలకుడు ఎలా ఉండకూడదో... ఎలాంటి వ్యక్తి రాజకీయాలకు అనర్హుడో జగన్ చరిత్ర ఒక కేస్ స్టడీ అని విమర్శించారు. ప్రజలు చాలా సందర్భాల్లో చాలా మందిని ఓడించారని, జగన్ విషయంలో ఇక నువ్వు వద్దే వద్దు అని బలమైన తీర్పు ఇచ్చారన్నారు. తాము జాతీయ స్థాయిలో ఎన్డీయేతోనే ఉన్నామని, ఉంటామన్నారు. ఏమైనా మార్పు ఉంటే చెబుతానన్నారు.



రాష్ట్రానికి నాలుగు కేంద్ర మంత్రి పదవులు!

సాక్షి, అమరావతి: మారిన రాజకీయ పరిణామాలతో కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి సముచిత ప్రాధాన్యం దక్కనుంది. ఎన్డీఏలో టీడీపీ మద్దతు కీలకం కావడంతో జాతీయ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషించే అవకాశం లభించింది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ఎన్డీఏ కన్వీనర్‌గా నియమించేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. బీజేపీ పెద్దల ప్రతిపాదనపై చంద్రబాబు ఇంకా నిర్ణయం తీసుకోలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి చంద్రబాబు హాజరు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబుకు ఎన్డీఏ కన్వీనర్‌గా అవకాశం వచ్చినా, రాకపోయినా టీడీపీ మద్దతు కీలకంగా మారినట్లు స్పష్టమవుతోంది. ఇకపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల్లో టీడీపీ మాట చెల్లుబాటవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేంద్రంలో తమకు ప్రాధాన్యత కలిగిన మంత్రిత్వ శాఖలు కేటాయించాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరుతున్నట్లు సమాచారం. ఏపీ నుంచి నలుగురు లేదా ఐదుగురికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి కనీసం ఇద్దరు ముగ్గురికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు. ఏపీ బీజేపీ, జనసేన నుంచి ఒక్కరికైనా ఛాన్స్ ఉండవచ్చనే భావిస్తున్నారు. టీడీపీ తరఫున గెలిచిన ఎంపీల్లో కింజరపు రామ్మోహన్‌నాయుడి పేరు కేంద్ర మంత్రి పదవికి గట్టిగా వినిపిస్తోంది. అమలాపురం ఎంపీగా గెలిచిన గంటి హరీష్ మాథూర్, నెల్లూరు నుంచి గెలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బాపట్ల నుంచి గెలిచిన టి.కృష్ణప్రసాద్ పేర్లు కూడా కేంద్ర మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి. బీజేపీ తరఫున గెలిచిన సీఎం రమేష్, దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర మంత్రివర్గంలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. సీఎం రమేష్ అటు బీజేపీ పెద్దలకు, ఇటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తి కావడంతో ఆయనకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. జనసేన నుంచి గెలిచిన ఇద్దరు ఎంపీల్లో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి మంత్రి పదవి కోసం గట్టి లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జల్ శక్తి, రవాణా, వ్యవసాయం, ఆరోగ్య మంత్రిత్వ శాఖలను చంద్రబాబు అడుగుతున్నట్లు చెబుతున్నారు. లోక్‌సభ స్పీకర్ లాంటి కీలక పదవులను కూడా టీడీపీ ఆశిస్తున్నట్లు పేర్కొంటున్నారు. రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

మంత్రుల రేసులో..

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పించాలనుకున్నా సాంకేతికంగా అది సాధ్యం కాదనే వాదన వినిపిస్తోంది. దీంతో ఎలా ముందుకు వెళతారనే అంశం ఆసక్తికరంగా మారింది. జనసేన మంత్రివర్గంలో చేరితే నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్‌కు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలనే విషయంపై వెనక్కి తగ్గితే పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునే అవకాశం ఉంది. ఇక బీజేపీ నుంచి అసెంబ్లీకి గెలిచిన వారిలో చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్ పేర్లు వినిపిస్తున్నాయి. సత్యకుమార్, విష్ణుకుమార్‌రాజుకు కూడా అవకాశం దక్కవచ్చని చెబుతున్నారు.

టీడీపీలో మంత్రి పదవుల ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. 135 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి గెలుపొందడంతో ఎవరికి అవకాశం దక్కుతుందోననే చర్చ జరుగుతోంది. సామాజిక సమీకరణలు, సీనియారిటీ ప్రాతిపదికన పలువురు నేతలు తమకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందని గట్టిగా నమ్ముతున్నారు. చంద్రబాబు ఇప్పటికే దీనిపై ప్రాథమికంగా కొంత కసరత్తు చేసినట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ధూళిపాళ్ల నరేంద్రకు కచ్చితంగా మంత్రివర్గంలో స్థానం లభిస్తుందని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఆశావహుల జాబితా

శ్రీకాకుళం: కింజరపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, బెందాళం అశోక్

విజయనగరం: కళా వెంకట్రావు, అదితి గజపతిరాజు

విశాఖపట్నం: గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత

తూర్పు గోదావరి: జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్యచౌదరి

పశ్చిమ గోదావరి: నిమ్మల రామానాయుడు, చింతమనేని ప్రభాకర్, పితాని సత్యనారాయణ, కనుమూరి రఘురామకృష్ణరాజు

కృష్ణా: కొల్లు రవీంద్ర, బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, వసంత కృష్ణప్రసాద్, కేపీ సారథి

గుంటూరు: నారా లోకేశ్, ధూళిపాళ్ల నరేంద్ర, ప్రత్తిపాటి పుల్లారావు, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు

ప్రకాశం: దామచర్ల జనార్దన్, గొట్టిపాటి రవికుమార్

నెల్లూరు: పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కర్నూలు: కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఎన్ఎండీ ఫరూఖ్

అనంతపురం: పయ్యావుల కేశవ్, పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు

చిత్తూరు: పులివర్తి నాని, అమర్‌నాథ్‌రెడ్డి, బొజ్జల సుధీర్

కడప: రెడ్డప్పగారి మాధవి, వరదరాజులరెడ్డి

సాక్షి
గురువారం, 6 జూన్ 2024

సమస్యలపై 'సమష్టి' దృష్టి

అక్కున చేర్చుకున్నవారిని మెచ్చుకోవటం, అయిష్టత చూపినవారికి దూరం జరగటం సర్వసాధారణం. ప్రధాని మోదీ కూడా దానికి భిన్నంగా ఉండలేకపోయారు గనుకే మంగళవారం నాటి తన విజయోత్సవ ప్రసంగ ప్రారంభంలో ఎప్పటిలా 'జైశ్రీరాం' అనడానికి బదులు 'జై జగన్నాథ్' అని వుండొచ్చు. ఆశించిన సీట్లు ఇవ్వని ఉత్తరప్రదేశ్ ప్రస్తావన కన్నా ఆదరాభిమానాలు చూపి ఏకంగా 21 ఎంపీ స్థానాల్లో 20 కట్టబెట్టడంతో పాటు రాష్ట్ర పాలనాపగ్గాలను సైతం అందించిన ఒడిశా ప్రధానికి స్ఫురించటంలో వింతేముంది? ఈ ఎన్నికల్లో బీజేపీకి మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అందువల్ల పదేళ్లనాడే 282 స్థానాలు, అటుపై 303 స్థానాలు గెలిచిన బీజేపీ ఈసారి 240తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. ఇది సాధారణ మెజారిటీ కన్నా 32 తక్కువ. ఎన్‌డీఏ కూటమిగా ఇప్పటికీ 292 స్థానాలున్నా నితీశ్ కుమార్, చంద్రబాబు వంటి ఊగిసలాట మనస్తత్వం గల భాగస్వాములున్న చోట ఏదైనా జరగొచ్చన్న భయాందోళనలు బీజేపీకి ఉండటం సహజమే. అందులోనూ నితీశ్ ఎప్పటి నుంచో కోరుకుంటున్న ప్రత్యేక హోదా డిమాండ్ తెరపైకొచ్చినా ఆశ్చర్యం లేదు. బాబు చరిత్ర గమనిస్తే ఆయన హోదా కోసం పట్టుబట్టే అవకాశం అంతంత మాత్రమే. మొత్తానికి 'అబ్ కీ బార్ మోదీ సర్కార్' అన్న నినాదాన్ని సవరించుకుని 'అబ్ కీ బార్ కూటమి సర్కార్' అనక తప్పట్లేదు.

సంప్రదాయానికి భిన్నంగా తక్కువ స్థానాలిచ్చిన ఉత్తరాదితో పోలిస్తే... సగానికిపైగా స్థానాలిచ్చిన తూర్పు జోన్, ఆశించినదానికి మించి ఇచ్చిన దక్షిణాది బీజేపీకి భుజాలు కాశాయి. పశ్చిమ జోన్‌లోని మహారాష్ట్రలో ఫిరాయింపులను ప్రోత్సహించి రెండు ప్రధాన పార్టీల్లో చీలిక తెచ్చిన పర్యవసానంగా ఎన్‌డీఏ దెబ్బతింది. సగం స్థానాలు కూడా సాధించలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ ఇది బీజేపీని వణికిస్తోంది. మహారాష్ట్రలో 2019లో శివసేనతో పొత్తు పెట్టుకుని అక్కడున్న 48 స్థానాల్లో బీజేపీ సొంతంగా 23, కూటమిగా 41 గెల్చుకుంది. ఈసారి 28 చోట్ల పోటీ చేస్తే అందులో సగం కూడా దక్కలేదు. బీజేపీ 9తో సరిపెట్టుకోగా... దాని మిత్రపక్షాల్లో ఒకటైన శివసేన (షిండే) వర్గం పోటీచేసిన 15లో ఆరు, ఎన్సీపీ(అజిత్) పోటీచేసిన అయిదింటిలో రెండు గెల్చుకున్నాయి. ఈసారి కనీసం 45 రాబట్టాలన్న ఆశ కొట్టుకుపోయింది. ఈ జోన్‌లోని గుజరాత్‌లో ఎన్‌డీఏకు 25 లభించినా చాన్నాళ్ల తర్వాత ఒకస్థానం విపక్షాలకు దక్కటం అది జీర్ణించుకోలేని అంశం. ఇక రాజస్తాన్‌లోవున్న మొత్తం 25 స్థానాలూ గతంలో ఎన్‌డీఏ గెల్చుకోగా ఈసారి 14తో సరిపెట్టుకుంది. ఇండియాకు 11 దక్కాయి. పశ్చిమజోన్‌లో మొత్తం 103 స్థానాలుంటే ఎన్డీయేకు 59, ఇండియాకి 42 వచ్చాయి. ఉత్తరాదిన ఏడు రాష్ట్రాలతోపాటు కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూ–కశ్మీర్, ఢిల్లీ, చండీగఢ్, లద్దాఖ్‌లున్నాయి. ఈ ప్రాంతంలో మొత్తంగా 195 స్థానాలుండగా ఎన్డీయేకు 117 దక్కాయి. అంకె ఘనంగానే కనబడుతున్నా ఇండియా కూటమి 71 స్థానాలు ఎగరేసుకుపోవటం అసాధారణం. ఇక్కడి యూపీ, పంజాబ్, హరియాణా, బిహార్, మధ్యప్రదేశ్, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ఇండియా కూటమి పక్షాలకు పెద్దగా రాకపోవచ్చని బీజేపీ అంచనా వేసుకుంది. కానీ ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో 2019లో 62 గెల్చుకున్న ఎన్‌డీఏకు ఈసారి కేవలం 36 వస్తే, విపక్ష కూటమి 43 గెల్చుకుంది. పైగా ఆ కూటమిలోని సమాజ్‌వాదీ 33 సాధించి బలం పుంజుకుంది. ఇక బిహార్‌లో 40 స్థానాలకూ ఎన్డీయే 30 గెల్చుకుంది. తొమ్మిది విపక్ష కూటమికి వచ్చాయి. కానీ రైతు ఉద్యమ ప్రభావంగల హరియాణాలోని 10 స్థానాల్లో అయిదు స్థానాలే లభించాయి. ఇండియా కూటమికి మరో అయిదు వచ్చాయి. పంజాబ్‌లోని 13 స్థానాల్లో బీజేపీకి ఒక్కటంటే ఒక్కటి రాలేదు. ఇండియా కూటమికి 10 లభించాయి. గతంలోని వోటింగ్ శాతం గల్లంతైనా ఢిల్లీ మాత్రం మాట దక్కించింది. అక్కడి ఏడు స్థానాలూ బీజేపీ ఖాతాలో పడ్డాయి. కేజ్రీవాల్ అరెస్టు ప్రభావం ఏమాత్రం లేదు. మధ్యప్రదేశ్ (29), హిమాచల్ (4), ఉత్తరాఖండ్ (5) గంపగుత్తగా ఎన్‌డీఏ వైపే మొగ్గాయి. ఇక దక్షిణాదిలో నిరుడు ఎన్నికల్లో అసెంబ్లీని చేజార్చుకున్న కర్ణాటకలో ఎన్‌డీఏకు 19 సీట్లు రావటం, 'ఇండియా' కేవలం 9కి పరిమితం కావటం బీజేపీకి ఊరటనిచ్చింది. అలాగే ఏపీలో ఎన్‌డీఏకు 21, తెలంగాణలో 8, కేరళలో ఒకటి లభించటం అంచనాకు మించినవే. దక్షిణాదిన గల 131 స్థానాల్లో 'ఇండియా' కూటమికి లభించిన 77తో పోలిస్తే ఎన్డీయేకు వచ్చిన 49 తక్కువే కావొచ్చుగానీ... ఇప్పుడున్న పరిస్థితుల్లో అదే ఎక్కువ. 114 స్థానాలున్న తూర్పు జోన్‌లో ఎన్డీయేకు 67 లభించాయి. ఇందులో ఒడిశా గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. 24 ఏళ్లపాటు ఆ రాష్ట్రాన్ని పాలించి సిల్వర్ జూబ్లీలోకి అడుగుపెడదామనుకున్న బిజూ జనతాదళ్ అధినేత, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను నిరోధించి అధికారం దక్కించుకోవటంతోపాటు ఒకటి మినహా ఎంపీ స్థానాలన్నీ బీజేపీ గెల్చుకుంది. ఇదే జోన్‌లోని బెంగాల్ కేవలం 12 ఎంపీ స్థానాలకే బీజేపీని పరిమితం చేయటం గమనించదగ్గది.

మొత్తానికి ఉత్తరాదిలో భావోద్వేగాల కన్నా నిరుద్యోగం, అధిక ధరలు, పడిపోయిన జీవనప్రమాణాలు వగైరా అంశాలు చర్చలోకొచ్చాయి. వోటింగ్‌లోనూ వాటి ప్రభావం కనబడింది. ఇది మెచ్చదగ్గ విషయం. వచ్చే ఏడాది రాబోయే 16 ఫైనాన్స్ కమిషన్ నివేదిక, ఆ మరుసటేడు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన, ఫెడరల్ వ్యవస్థపై సాగే చర్చ కీలకమైనవి. ఈ అంశాల విషయంలో ఏకపక్ష నిర్ణయాలకు బదులు అందరినీ సంప్రదించక తప్పని స్థితి ఏర్పడటం హర్షించదగింది. దేశ ప్రజానీకం ప్రదర్శించిన విజ్ఞతనూ, దానివెనకున్న స్ఫూర్తినీ రాజకీయ పక్షాలన్నీ గ్రహిస్తే జటిల సమస్యల పరిష్కారం కష్టం కాదు.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** అమావాస్య సా.5.49 వరకు, తదుపరి జ్యేష్ఠ శుద్ధ పాడ్యమి, **నక్షత్రం:** రోహిణి రా.8.25 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ప.12.38 నుండి 2.11 వరకు, తదుపరి రా.2.00 నుండి, 3.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.48 నుండి 10.40 వరకు, తదుపరి ప.3.01 నుండి 3.53 వరకు, **అమృతఘడియలు:** సా.5.27 నుండి 6.18 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సంకీర్ణంతో సామరస్యం నెలకొనేనా?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

'ఇండియా' కూటమి కుల జనగణనను అంగీకరిస్తూ, బీజేపీ 400 సీట్లతో గెలిచి ఏకంగా రాజ్యాంగాన్ని మార్చెయ్యాలని చూస్తున్నదనీ, మొత్తం రిజర్వేషన్లను రద్దు చెయ్యాలనుకుంటోందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఇది కచ్చితంగా ఓటర్ల మీద ప్రభావాన్ని చూపించింది. దాంతో ఫలితాలు బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి. మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని వారి సిద్ధాంతంతోనైనా వాజ్‌పేయిలా నడిపే వ్యక్తి కాదు. మోదీని ముస్లిం దేశాలు బద్ధశత్రువుగా చూసే అవకాశముంది. ఆరెస్సెస్/బీజేపీ ఆయనను కాక మరో వ్యక్తిని ప్రధానిగా ప్రతిపాదించి కాస్త సామరస్య వాతావరణంలో దేశాన్ని నడవనిచ్చే అవకాశమున్నది. కానీ మోదీ తప్పుకొనే అవకాశం కనబడటం లేదు. అందుకు ప్రత్యర్థి కూటమి ప్రత్యామ్నాయంగా బలపడటం తప్ప మార్గం లేదు.

2024 ఎన్నికలు దేశ చరిత్రలో చాలా విచిత్రమైనవి. దేశస్థాయిలో మోదీ నాయకత్వంలోని బీజేపీని సంకీర్ణంలోకి నెట్టాయి. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సాల్లో పరిపాలిస్తున్న రెండు పార్టీలూ ఓడిపోయాయి. ముఖ్యంగా వైసీపీ ఓటమి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే దేశం ఒక పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డ ఎన్నిక కూడా ఇది. బీజేపీ 240కి పడిపోవడం ఒక రక్షణ కవచం.

ఈ ఎన్నికతో చాలా ఘోరంగా పతనమైపోతుందనుకున్న కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు దేశాన్ని ఒక పెద్ద ప్రమాదం నుంచి కాపాడాయి. ఉత్తరప్రదేశ్‌లో బుల్‌డోజర్ వ్యవస్థకు చెక్ పడింది. మొత్తం బీజేపీ శక్తులు 'పప్పు, పప్పు' అని ఎద్దేవా చేసిన రాహుల్ గాంధీ... ఒక దళిత మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఎవరూ ఊహించనట్టు మ్యానిఫెస్టోను దేశం ముందు పెట్టి మోదీ, అమిత్‌షాల 400 సీట్లు తెస్తారన్న బీజేపీని 240 సీట్లకు పడేసి దేశాన్ని చాలా పెద్ద ప్రమాదం నుంచి కాపాడారు.

'ఇండియా' కూటమి కాంగ్రెస్ మ్యానిఫెస్టోను సొంతం చేసుకొని దేశమంతటా ప్రచారం చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ఈ ఎన్నికల 'హీరో' అన్నారు. 'ఇండియా' కూటమి కుల జనగణనను అంగీకరిస్తూ, బీజేపీ 400 సీట్లతో గెలిచి ఏకంగా రాజ్యాంగాన్ని మార్చెయ్యాలని చూస్తున్నదనీ, మొత్తం రిజర్వేషన్లను రద్దు చెయ్యాలనుకుంటోందనీ పెద్దఎత్తున ప్రచారం చేసింది. ఈ ప్రచారం కచ్చితంగా చాలామంది ఓటర్ల మీద ప్రభావాన్ని చూపించింది. నరేంద్ర మోదీ దీన్ని తట్టుకోవడానికి ముస్లింల రిజర్వేషన్లు ఎత్తేసి బీసీలకు ఇస్తామని పదేపదే మాట్లాడారు. కానీ చంద్రబాబు, నితీష్ కుమార్ వంటివారు దాన్ని అంగీకరించలేదు. ఇప్పుడు ఈ ఇద్దరు లేకుండా బీజేపీ ప్రభుత్వం నిలబడదు. అయితే అటు నితీష్ గానీ, ఇటు చంద్రబాబు గానీ మోదీకి మంచి మిత్రులు కారు. ఇద్దరూ మోదీని, షాని వ్యతిరేకించి శత్రుస్థానంలో పెట్టి, వారితో పోరాడిన వాళ్లే. అయితే ఆ ఇద్దరు ఇప్పుడు 'ఇండియా' కూటమి దేశానికి, రాజ్యాంగానికి ప్రమాదకరమైనదని ప్రచారం చేస్తున్న మోదీని ప్రధానమంత్రిని, షాను మళ్లీ హోంమంత్రిని చేసి దేశ అభద్రతకు బాధ్యులవుతారా? లేక బీజేపీలోని మరో వ్యక్తిని ప్రధానమంత్రిని చెయ్యమని సలహా ఇస్తారా? చూడాలి.

మోదీ ప్రభుత్వం చంద్రబాబుకు దూరమైన గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు ఎన్నో తీవ్ర నష్టాలను చేసింది. ఆంధ్ర పెట్టుబడిదారులనెవ్వరినీ నిర్మాణం రంగంలో గానీ, పెద్ద బిజినెస్‌లలో గానీ నిలువనివ్వలేదు. బ్యాంకుల విలీనం చేసినప్పుడు బరోడా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్ వంటి వాటిని ఆ పేర్లతోనే ఉంచి ఆంధ్రా బ్యాంక్‌ను మాత్రం యూనియన్ బ్యాంక్‌లో విలీనం చేశారు. మొదటి నుండి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాకు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ



అన్నింటి రీత్యా ఇప్పుడు చంద్రబాబుపై ఆధారపడే కేంద్ర ప్రభుత్వానికి బాబు ఎటువంటి కండిషన్లు పెడతారు?

అటు కాంగ్రెస్‌తో 2019లో తెలంగాణలో పొత్తులో పోటీ చేసింది టీడీపీ. కాంగ్రెస్ తమ ప్రభుత్వం వస్తే ప్రత్యేక హోదా తప్పకుండా ఇస్తామంటోంది. చంద్రబాబు, నితీష్‌కుమార్ ఒక నిర్ణయం తీసుకుంటే, మోదీ, అమిత్ షాలను ఇంటికి పంపగలరు. అయితే చంద్రబాబుకు ఇప్పుడున్న స్థితిలో అది చిన్న నిర్ణయం కాదు. మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని వారి సిద్ధాంతంతోనైనా వాజ్‌పేయిలా నడిపే వ్యక్తి కాదు. ఎన్నికల ప్రచారంలో ఆయన దేశంలోని మొత్తం ముస్లింల మీద అక్కసు కక్కారు.

గుజరాత్‌లోని 2002 మత కల్లోలం తరువాత జరిగిన ఈ ముస్లింల వ్యతిరేక ప్రచారం ఆయన్ని ఇంకా పెద్ద ముస్లిం వ్యతిరేకిగా నిలబెడుతుంది. ప్రపంచ పత్రికలన్నీ ఆయన్ని 'గ్రేట్ డివైడర్' అని రాశాయి. ముస్లిం దేశాలు ఈ ఎన్నికల తరువాత ఆయన్ని బద్ధశత్రువుగా చూసే అవకాశముంది. ఆరెస్సెస్/బీజేపీ ఆయన్ని కాక మరో వ్యక్తిని ప్రధానిగా ప్రతిపాదించి కాస్త సామరస్య వాతావరణంలో దేశాన్ని నడవనిచ్చే అవకాశమున్నది. కానీ ఆరెస్సెస్/బీజేపీ క్యాడర్ మోదీ, అమిత్ షాల పరిపాలనలో సుఖాలను అనుభవించడం నేర్చుకున్నారు. వారికి ఈ భోగం మరో నాయకుల నేతృత్వంలో దొరకదు. అందువల్ల ఆరెస్సెస్‌లో కూడా వారు చెప్పిందే నడుస్తుంది.

గుజరాత్ పెట్టుబడి దేశాన్ని మొత్తం తన గుత్తాధిపత్యంలోకి తీసుకుంది. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న ఏ రాష్ట్రం నుండి కూడా గుజరాత్ పెట్టుబడిదారులకు ధీటుగా పోటీపడే పరిస్థితి లేదు. తెలుగు రాష్ట్రాల నుండి నిర్మాణ రంగంలో గుజరాతీ పెట్టుబడిదారులకు ధీటుగా ఎదిగిన జీవీకే కంపెనీని బొంబాయి ఎయిర్‌పోర్ట్ నుండి తప్పించి మోదీ, షాలు అదానీకి అప్పజెప్పారు. తమకు ఎదురు తిరిగిన రాజకీయ నాయకులపై సీబీఐ, ఈడీలను ప్రయోగించి జైలుపాలు చేశారు. ఈ పరిస్థితి నుండి దేశం బయట పడాలంటే మోదీ, షాలు అధికారం నుండి పోవడమొక్కటే మార్గం. అందుకు ప్రత్యర్థి కూటమి ప్రత్యామ్నాయంగా బలపడటం తప్ప మరో మార్గం లేదు. అందుకు 'ఇండియా' కాస్త దారి చూపింది. ఈ స్థితిలో 'ఏ కూటమితోనూ ఉండను' లాంటి నిర్ణయాలు నష్టం చేస్తాయి. ఎప్పుడైనా ప్రాంతీయ పార్టీలు జాతీయ స్థాయి వ్యవస్థల్ని శాసించలేవు. నిజానికి, ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో – బీజేపీ చేరి ఎన్నికల కమిషన్‌ను అటు తిప్పింది అనేది స్పష్టంగా కనిపిస్తోంది. కీలక స్థలాల్లో వైసీపీ కీళ్లు విరిచే ప్రయత్నం చేసింది.

రాహుల్ గాంధీ దేశంలో అన్ని సభల్లో ఎన్నికల సంఘం నిష్పక్ష పాత్రను ప్రశ్నిస్తూ వచ్చారు. సీబీఐ, ఈడీ, ఎలెక్టోరల్ బాండ్స్, ఇతర పార్టీల ఆదాయాలను అడ్డుకోవడం, ఉన్న పార్టీ డబ్బును ఎన్నికల్లో వాడకుండా చూడటం, ఇన్‌కమ్‌టాక్స్ వంటి సంస్థల ద్వారా బంధించడం... ఈ స్థితిలో అన్ని ప్రాంతీయ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవాలంటే ఒక జాతీయ కూటమిలో చేరి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే నిర్ణయాల్లో, పోరాటాల్లో భాగం కాకపోతే ముందు ముందు బీజేపీ ప్రాంతీయ పార్టీలను తమ బందీలను చేస్తుంది.

కాంగ్రెస్ ముఖ్యంగా రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ యాత్ర తరువాత ఆరెస్సెస్/బీజేపీలను నిలువరించే ప్రయత్నం చేశారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలు డీఎంకే లాగ ఒక ప్రత్యామ్నాయ తాత్విక పునాదితో నిర్మించినవి కావు. అందుకే డీఎంకేని బీజేపీ సనాతన ధర్మం చుట్టూ రాద్ధాంతం చేసి ఓడించాలని చూసింది. కానీ దాని ద్రావిడ, శూద్ర సిద్ధాంతరంగం కాపాడింది. బీజేపీ అక్కడ ఒక్క సీటు కూడా గెలవలేదు.

ఇప్పుడు పార్లమెంట్ పోరాటం... రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను కాపాడాలనే 'ఇండియా' కూటమికీ, ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని దేశంలో నాటి, మత సమస్యను ముందు పెట్టి దేశంలో ఉత్పత్తి కులాలను అణగదొక్కే ఎన్డీఏలోని ఆధిపత్య బీజేపీకీ మధ్య జరుగుతుంది.

ఎన్డీయే కూటమిలోని నితీష్ కుమార్, చంద్రబాబుకు బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలకు చెక్ పెట్టే అవకాశమొచ్చింది. ఈ ఇద్దరు నాయకులు ఏం చేస్తారనేది చూడాలి. చంద్రబాబు 2002లో మోదీని ముఖ్యమంత్రి పదవి నుండి దింపే స్థితిలో ఉండి కూడా ఆయన్ని కొనసాగించే బీజేపీ నిర్ణయానికి మద్దతిచ్చారు. మళ్లీ ఈ కీలకదశలో ఆయనకు ఒక అవకాశమొచ్చింది. 'ఇండియా' కూటమి దేశంలోని మొత్తం ప్రతిపక్ష పార్టీలను తమ పక్కన చేర్చుకోవాల్సిన అవసరముంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎన్నికల చిత్రం



గెలిచినవాళ్ల కంటే (బీజేపీ) ఓడిపోయిన వాళ్లు (ఇండియా కూటమి) ఎక్కువ సంతోషంగా ఉన్నట్టు కనబడిన ఎన్నికలను మీరు చివరిసారి ఎప్పుడు చూశారు?

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

స్నేహం పెరగాలి!



మూడోసారి విజయం సాధించిన ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక శుభాభినందనలు. ఇండియా, ఇజ్రాయెల్ దేశాల స్నేహం కొత్త ఎత్తులకు చేరుకోవాలి. 'బధాయీ హో' (కంగ్రాట్స్)!

– బెంజమిన్ నెతన్యాహూ, ఇజ్రాయెల్ ప్రధాని

మరిచిపోలేని తేదీ



నిరంకుశత్వం ఎలా ఉంటుందో ఆచరణలో చూశారా? తియనాన్మెన్ స్క్వేర్ ఊచకోత జరిగి 35 ఏళ్లు అవుతున్న సందర్భంగా, కళాకారుడు సన్నీ చెన్ '8964' అంకెలను గాలిలో రాశాడని హాంకాంగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ అంకెలను రాస్తున్నట్టుగా వేలు ఆడిస్తుండగా అరెస్టయ్యారు. (అది జరిగిన 1989 జూన్ 4ను ఆయన సంకేతించారు.)

– డ్రూ పావ్‌లో, యాక్టివిస్ట్

సహకరించుకుందాం!



నూతన ఎన్నికల విజయం పట్ల నరేంద్ర మోదీకి శుభాభినందనలు. ఇటలీ, ఇండియాలను ఏకం చేసే స్నేహాన్ని బలోపేతం చేసేలా మనం కలిసి పనిచేద్దాం. మన దేశాలు, మన ప్రజల సంక్షేమం కోసం మనల్ని కలిపే విభిన్న అంశాలపై సహకారాన్ని పెంపొందించుకుందాం.

– జార్జియో మెలోనీ, ఇటలీ ప్రధాని

మర్యాద రాముడు



అక్కడ జరిగినదానికి హిందువులనో, అయోధ్య జనాన్నో నిందించొద్దు. దానిక్కారణం రామ్ లల్లా. భయోత్పాతాన్ని పుట్టించడానికి తన పేరును వాడటానికి ఆయన ఇష్టపడలేదు. 'జై శ్రీ రామ్' అనేది భయపెట్టే ఒక యుద్ధ నినాదంలా మారిపోయింది. రాముడు నిలబడింది దీనికి కాదు. 'జై శ్రీ రామ్' అని గౌరవంగా చెప్పండి. (అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు.)

– అంగ్రీస్ జైదీ, రచయిత్రి

ఎందుకలా అన్నారు?



సంకీర్ణ ప్రభుత్వం నడపడం తనకేమీ కష్టం కాదనీ, ఇప్పుడు నడుపుతున్నది కూడా సంకీర్ణమేననీ రాజీనామా చేయడానికి ముందు ప్రధాని మోదీ తన మంత్రివర్గ సహచరులతో జరిగిన సమావేశంలో వ్యాఖ్యానించినట్టు నా సోర్సులు తెలిపాయి. అసలు తన సహచరులకు ఆయన ఆ విధంగా పునర్నిర్ధారించాల్సిన అవసరం ఏముందన్నదే ఇక్కడ ప్రశ్న

– మనీష్ చిబ్బర్, జర్నలిస్ట్

చెప్పుకోవాల్సిన విజయం



పార్లమెంటులో అత్యంత పిన్న వయస్కురాలు ఇద్దరు పిల్లలకు తల్లి అయిన ఒక దళిత మహిళ. ఇది చాలా స్థాయిల్లో సాధించిన విజయం. (రాజస్థాన్‌లోని భరత్‌పూర్ నియోజకవర్గం నుంచి 25 ఏళ్ల సంజనా జాటవ్ కాంగ్రెస్ నుంచి గెలుపొందారు.)

– అర్పితా ఛటర్జీ, సినిమా రచయిత్రి

ఇన్ బాక్స్

సోషల్ మీడియా దన్నుగా...

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో జరిగిన ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో అని ప్రపంచం మొత్తం ఎదురు చూసింది. 18వ లోక్ సభకు జరిగిన ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 64.2 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని చరిత్ర సృష్టించారు. సుదీర్ఘంగా 81 రోజులు సాగిన ఈ ఎన్నికల ప్రక్రియ, కేంద్రంలో మళ్లీ కమల వికాసమా లేక హస్త ప్రభంజనమా అనే ఉత్కంఠకు తెర లేపింది. భారత ప్రజల చైతన్యస్ఫూర్తి ఈ ఎన్నికల్లో మరోసారి రుజువయ్యింది.

'అబ్ కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదంతో మూడోసారి అత్యధిక మెజార్టీతో అధికారంలోకి రావాలనుకున్న ఎన్డీఏ కూటమికి ఈ ఎన్నికల్లో వారు ఊహించిన ఫలితాలు రాలేదు. గత పదేండ్ల కాలంలో మోదీ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుదల వంటి అంశాలు ప్రజల్లో ఆ పార్టీపై నమ్మకం తగ్గేలా చేశాయి. కుల మతాలనూ, అయోధ్య రాముణ్ణీ ఎన్నికల్లో వాడుకొని లబ్ధి పొందాలని భావించినా ఆశించిన స్థాయిలో లబ్ధి చేకూరలేదు.

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మోదీ ప్రభుత్వ వ్యతిరేక ప్రజా ఉద్యమం నడపడంలో కొంత వరకు సఫలం అయిందని చెప్పవచ్చు. 'మోదీ 3.0 మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారు' అనే అంశం ప్రజల్లోకి బాగా వెళ్ళి, బీజేపీ ఓటు బ్యాంక్‌కు గండి కొట్టింది. ఓటర్లు ప్రతిపక్షానికి కావలసినంత బలాన్ని ఇచ్చారు. విధానపరమైన నిర్ణయాలలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఈ సారి ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం... ముఖ్యంగా యూట్యూబర్లు ధ్రువ్ రాఠీ, రవీష్ కుమార్ వంటి వారు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడంలో కీలకమైన పాత్ర పోషించారు. కేవలం ధ్రువ్ వీడియోలను 69 కోట్ల మంది ప్రజలు వీక్షించారంటే వారి ప్రభావాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఉత్తర భారత దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రొజెక్టర్లు పెట్టి మరీ ఈ వీడియోలను ప్రజలు వీక్షించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా పాలకులు నిర్ణయాలు తీసుకుని, ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందిస్తూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ, కార్మిక– కర్షక సంక్షేమానికి పాటుపడుతూ, మహిళా సాధికారత సాధిస్తూ, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

– పాకాల శంకర్ గౌడ్, ఉపాధ్యాయుడు

కాంగ్రెస్ ఆలోచనా విధానం మారాలి!

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

పాకిస్తాన్ వద్ద అణు బాంబు ఉందనీ, ఆ దేశాన్ని సరిగా గౌరవించకపోతే, మన దేశంపైన అణు బాంబులు వేసి, మనకు నష్టాన్ని కలిగిస్తుందనీ కొంతమంది కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు ప్రపంచ రాజకీయ విశ్లేషకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఈ దేశం నాది అని భావించే ప్రజా సమూహానికి, జాతి హితైషులకు మాత్రం వారి వ్యాఖ్యలు కోపాన్నీ, చిరాకునూ తెప్పించాయి. అయినప్పటికీ ఏమీ చేయలేని పరిస్థితి. కాంగ్రెస్ నాయకుల మైండ్ సెట్ ఇంతేనని ప్రజలు సరిపెట్టుకుంటున్నారు. 1947లో ఈ దేశాన్ని మతం ఆధారంగా విడగొట్టి ముస్లిం లీగ్ నాయకులను సంతృప్తి పరిచారు. భారత్‌ను సెక్యులర్ దేశం అంటూ 1947 నుంచి దాదాపు 60 సంవత్సరాలు పాలించారు. వారి పరిపాలన కాలంలో పాకిస్తాన్‌తో 1948, 1965, 1971ల్లో మన సైన్యం యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ యుద్ధాల్లో అపారమైన రక్షణ వ్యయాన్ని దేశం భరించవలసి వచ్చింది.



పాకిస్తాన్‌ను ఎందుకు గౌరవించాలి అనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఈ దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పలేక పోతున్నారు. దేశంలో ముస్లింలను ప్రత్యేక పౌరులుగా ట్రీట్ చేశారు. దేశంలో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపించినందుకేనా? లేక ఈ దేశంలో తిండి తింటూ, 'పాకిస్తాన్ జిందాబాద్' అని నినాదాలు చేసే దేశద్రోహులను ఈ దేశానికి ఎగుమతి చేసినందుకా? లేక పాకిస్తాన్ పై ప్రేమ వలకబోస్తే– ఈ దేశంలోని ముస్లిం సమాజం గంపగుత్తగా ఓట్లు వేసి, తమకు అధికారాన్ని కట్టబెడుతుందని ఆశతోనా? ఏమో మరి! వారి ఆలోచనలు ఈ దేశ సామాన్య ప్రజలకు అర్థం కావడం లేదు.

స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానాన్ని విశ్లేషిస్తే –ఇస్లాం మత అనుకూల పరిపాలనను సాగించిందని చెబితే అవాస్తవికత ఏమీ ఉండదు. షాబానో కేసు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును కాలరాచి, ముస్లిం స్త్రీల హక్కులను బొంద పెట్టి, ఇస్లామిక్ మత అనుకూల చట్టాన్ని కాంగ్రెస్ నాయకులు చేశారు. ప్రపంచంలో ఏ సెక్యులర్ దేశం లేక ఇస్లామిక్ దేశం హజ్ యాత్రకు సబ్సిడీలను ఇవ్వదు. కానీ కాంగ్రెస్ పాలకులు ఆ ఘనకార్యాన్ని సాధించారు. రాష్ట్రపతి భవన్‌ను ఇఫ్తార్ విందులకు కేంద్రంగా మార్చారు.


ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఆలోచనా విధానం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపించే పాకిస్తాన్ పీచ మణచాలనీ, రక్షణ పరంగా, ఆర్థికపరంగా, దౌత్య పరంగా దెబ్బతీసి, చచ్చిన పాముగా మార్చాలని బీజేపీ వ్యూహం. ఈ దేశ భద్రత, సమైక్యత, సమగ్రతల విషయంలో బీజేపీ నాయకుల ఆలోచనా విధానం స్పష్టంగా ఉంటుంది. కుహనా లౌకికవాద ఆలోచనలకు, ముస్లిం సంతుష్టీకరణలకు వారు చాలా దూరం. అందుకే లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ రాజకీయ నాయకులు బీజేపీ ప్రభుత్వాన్ని తిట్టకుండా ఉండలేరు.

ఇక చివరగా ఈ దేశ ఉత్థాన పతనాలలో భాగస్వామిగా మారిన కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన జాతీయ విధానంతో ముందుకు వెళ్లకపోతే– ఆ పార్టీ నాయకులకు భవిష్యత్తు అంధకారంగానే ఉంటుందని చెప్పక తప్పదు. వాస్తవం మాట్లాడితే, ఈ దేశం పట్ల ఆ పార్టీ నాయకులు చేసిన పొరపాట్లే (కుహనా లౌకికవాద ఆలోచనలు) భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏని అందలమెక్కించాయని చెబితే అతిశయోక్తి ఏమీ ఉండదు.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

దైవానుభవానికి మార్గం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

దైవత్వం ఒక అనుభవం. దీనిని హృదయంలో ప్రతిబింబింప జేసుకోవాలి. అద్దం కదులుతూ ఉన్నా లేదా దానిని పొగ కప్పివేసినా లేదా వస్తువుల నుండి చాలా దూరంగా ఉన్నా... అద్దం దేనినీ సరిగా ప్రతిబింబింప చేయలేదు. మనస్సు (అద్దం) నిశ్చలంగా (కదలకుండా) ఉండడమే ఏకాగ్రత. అద్దాన్ని కప్పి ఉంచే పొగ (అహం)ను తొలగించాలి. అదే 'దైవ సాక్షాత్కారం'. జ్ఞానానికి రెండు స్థాయిలు ఉన్నాయి. ఒకటి కిందిస్థాయి, మరొకటి పైస్థాయి. ఇంద్రియాలను ఉపయోగించుకొని, హేతుబద్ధంగా విచారించి తెలుసుకొనేది కిందిస్థాయి జ్ఞానం. చాలామంది కిందిస్థాయి జ్ఞానంతోనే జీవితాన్ని గడుపుతున్నారు. దైవానికి సంబంధించిన జ్ఞానమే పైస్థాయికి చెందింది. ఇది సాధారణమైన జ్ఞానాన్ని మించింది. అంటే సర్వోత్కృష్టమైనదన్నమాట. కొద్దిమంది భాగ్యవంతులు మాత్రమే ఇటువంటి జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నిస్తారు. ఈ విధమైన జ్ఞానాన్ని సద్గురువు మాత్రమే అనుగ్రహిస్తారు.

మానవ జన్మ ఉన్నత లక్ష్యం భగవంతునిలో ఐక్యం చెందటమే. మనిషి తన జన్మకు కారణం ఏమిటో మరచిపోయి 'కామ– కర్మ– అవిద్య' అనే చక్రంలో చిక్కుకున్నాడు. స్వార్థబుద్ధిని పోనీయక, సొంతలాభం కోసం ఇతరులకు నష్టం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాడు. అలాంటి వారికి ఎన్నటికీ విమోచన ఉండదు. కాబట్టి ఆత్మ వివేక మార్గంలో నడచి, భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చిన ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. ఇతరుల దోషాలనూ, తన చుట్టూ గల వాతావరణంలోని లోపాలను ఎంచుట మనిషికి గల సాధారణ లక్షణం. ఈ విధంగా తప్పులను ఎంచుటం వలన ఏ ప్రయోజనమూ లేదు. వాస్తవంగా ఈ లక్షణం మనిషి మానసిక ప్రశాంతతను భంగపరుస్తుంది. ఇందువలన సమతాస్థితిని పొందలేడు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరించదలచిన భక్తుడు చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి. ఆ విధంగా ఉన్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక జీవితం సాధ్యమవుతుంది. ఇతరుల దోషాలను ఎంచటం మానివేసి, ఎవరికి వారు తమను తాము సరిచేసుకొని అభివృద్ధి అవ్వడానికి ప్రయత్నించాలి.

క్లుప్తంగా...

20 రోజుల్లోనే పెన్షన్ మంజూరు

- ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ రాజేశ్వర్ రాజేశ్

నెహ్రూనగర్: నెలవారీ సక్రమ చెల్లింపులతో పాటు తగిన పత్రాలు అందజేస్తే 58 ఏళ్లు నిండిన సభ్యులకు కేవలం 20 రోజుల్లోనే పెన్షన్ మంజూరు చేస్తామని ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ రాజేశ్వర్ రాజేశ్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 58 ఏళ్ల వయసు లోపు కనీసం 120 నెలల పాటు సంస్థ యజమాని, సభ్యుని షేరు ధనం చెల్లింపులు జరిగి ఉంటే పెన్షన్‌కు అర్హులవుతారని తెలిపారు. కనీసం 12 నెలల చెల్లింపులు జరిగి సర్వీసులో ఉంటూ అకాల మరణానికి గురైన సభ్యునికి రూ.7లక్షల బీమా సొమ్ము, పీఎఫ్ సభ్యత్వం కలిగి కనీసం రెండు మాసాల పాటు చెల్లింపులు జరిగి ఉంటే రూ.2.5 లక్షల వరకు బీమా సొమ్ము లభిస్తుందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ మాధవ శంకర్ మాట్లాడుతూ 20 లక్షలమంది పీఎఫ్ సభ్యత్వం కలిగిన సభ్యులకు తాము విశేష సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

టీడీపీ గెలుపు సంబరాల్లో అపశ్రుతి

- ట్రాక్టర్ వెనుక చక్రాల కిందపడి యువకుడికి తీవ్రగాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లాలో ఘటన



తణుకు: తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం ఓ యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెలుపు సంబరాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువకులు గ్రామంలోని ప్రధాన కూడలిలో సంబరాలు చేపట్టారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌తో విన్యాసాలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు వెనుక చక్రాల కిందపడి నలిగిపోయాడు. దీంతో బాధితుడిని తణుకు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

తెలంగాణ గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

- విభజన అంశాలపై శబరి బ్లాక్‌లో చర్చలు
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నివాసానికి వెళ్లిన బాబు
- తమిళనాడు సీఎం స్టాలిన్‌తోనూ మంతనాలు



తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

సాక్షి, న్యూఢిల్లీ/అమరావతి: దేశ రాజధానిలో బుధవారం ఎన్డీఏ పక్ష నేతల సమావేశం సందర్భంగా తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణను శబరి బ్లాక్‌లో కలుసుకున్న టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు దాదాపు 40 నిమిషాల పాటు చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ పదేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో విభజనకు సంబంధించి పలు పెండింగ్ అంశాలను ఆయన గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. ఎన్డీఏ పక్ష నేతల సమావేశం అనంతరం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కూడా ఆయన నివాసంలో చంద్రబాబు కలిశారు. ఎన్డీఏ పక్ష భేటీలో ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ చంద్రబాబు లేఖను అందజేశారు. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని మోదీని ఈ సందర్భంగా చంద్రబాబు ఆహ్వానించినట్లు తెలిసింది. టీడీపీ మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులతోపాటు స్పీకర్ పదవిని కూడా చంద్రబాబు కోరినట్లు జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అనంతరం విజయవాడ వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబు అక్కడ తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కొద్దిసేపు సమావేశమయ్యారు.

12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం!

టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జూన్ 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. తొలుత 9వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని భావించినా ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో ముహూర్తాన్ని మార్చినట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.

విశాఖపట్నంలో కూటమి నేతల హంగామా

వైఎస్సార్ వ్యూపాయింట్ వద్ద నేమ్ బోర్డు ధ్వంసం

విశాఖ సిటీ/ ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ నగరంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోయారు. రుషికొండ పర్యాటక భవనాలపై టీడీపీ జెండా ఎగురవేశారు. బీచ్‌రోడ్డులో అభివృద్ధి చేసిన వైఎస్సార్ వ్యూపాయింట్ వద్ద ఉన్న వైఎస్సార్ నేమ్ బోర్డును కాళ్లతో తన్నుతూ తొలగించారు. వీఐపీ రోడ్డు జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఏర్పాటు చేసిన స్టాపర్లను తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు వారిస్తున్నా.. జేసీబీతో కొన్ని స్టాపర్లను తీసేశారు. బుధవారం టీడీపీ విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీతో పాటు మరికొందరు నాయకులు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ స్టాపర్లను తొలగించారు. సాయంత్రానికి పోలీసులు మళ్లీ వాటిని ఏర్పాటు చేశారు. విశాలాక్షినగర్ సమీపంలో బీచ్‌రోడ్డులో సీతకొండ వద్ద వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ బోర్డును కొందరు ధ్వంసం చేశారు. ఇక్కడ వై.ఎస్.ఆర్. అనే అక్షరాలపై మంగళవారం రాత్రి అబ్దుల్ కలాం పేరుతో ఉన్న సిక్కర్‌ను అంటించారు. బుధవారం ముగ్గురు వ్యక్తులు అబ్దుల్ కలాం స్టిక్కర్‌ను తొలగించారు. బోర్డుపై ఉన్న వై.ఎస్.ఆర్. అక్షరాలను రాడ్డులతో కొట్టి తీసేశారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్



వైఎస్ఆర్ పేరుతో ఉన్న అక్షరాలు తొలగిస్తున్న వ్యక్తులు



విశాఖపట్నం నగరంలోని వీఐపీ రోడ్డు జంక్షన్ వద్ద టీడీపీ నేతల హైడ్రామా

మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి ఇంటిపై టీడీపీ దాడి

సుబ్బారెడ్డి సోదరుడికి తీవ్ర గాయాలు • ఎమ్మెల్యేగా ఎన్నికైన రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే దాడి

రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి రూరల్ మండలం మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఇంటిపై టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దీంతో ప్రశాంతంగా ఉన్న ఎండపల్లి గ్రామంలో అలజడి మొదలైంది. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సిద్దార్థ గౌడ్, అతని అనుచరులు ఈ దాడికి పాల్పడినట్లు సుబ్బారెడ్డి కుటుంబీకులు చెబుతున్నారు. టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన రాంప్రసాద్ రెడ్డి సమక్షంలోనే ఈ దాడి జరిగింది. ఆ సమయంలో అనారోగ్యం కారణంగా సుబ్బారెడ్డి ఇంటిలో లేరని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఎండపల్లి గ్రామం బోయపల్లెలో సుబ్బారెడ్డి ఇంటిపైకి సిద్దార్థ గౌడ్, అతని అనుచరులు ఒక్కసారిగా దాడికి దిగారు. రాళ్లు రువ్వుతూ దాడికి తెగబడ్డారు. ఇంటి బయట ఉన్న సుబ్బారెడ్డి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దాడిని అడ్డుకోబోయిన సుబ్బారెడ్డి సోదరుడు వెంకటరామిరెడ్డి పైనా దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. వెంకటరామిరెడ్డి ఇంట్లోకి చొరబడి, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి హుటాహుటిన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దాడికి పాల్పడుతున్న వారిని చెదరగొట్టడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి చెప్పారు.



టీడీపీ దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

ఆరోగ్యశ్రీలో 134 చికిత్సలకు కోత

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇక వీటికి చోటులేదు
- ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓకు డీఎంఈ ప్రతిపాదన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆరోగ్యశ్రీ చికిత్సలకు అప్పుడే కోత మొదలైంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న 134 చికిత్సలను ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే చేయాలని వైద్య విద్యా సంచాలకులు నిర్ణయించారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు ప్రతిపాదనలు పంపించారు. వీటిలో మెజారిటీ చికిత్సలు జనరల్ సర్జరీకి సంబంధించినవే. గతంలో 171 చికిత్సలు మాత్రమే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసేవారు. ఇప్పుడు వీటికి అదనంగా 134 చికిత్సలను చేరుస్తూ ఆరోగ్యశ్రీ సీఈఓకు ప్రతిపాదన పంపించారు. తీవ్ర గాయాలై ఆపరేషన్లు చేయాల్సి రావడం, కడుపునొప్పి, హెర్నియా వంటి జనరల్ సర్జరీలు ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ జరిగేవి. ఈ చికిత్సలన్నీ ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రమే చేయాలని ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ మేరకు బుధవారం అన్ని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరించినట్టు తెలిసింది. తాజాగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయాలని నిర్ణయించిన చికిత్సల్లో జనరల్ సర్జరీకి సంబంధించి 129, గైనకాలజీకి సంబంధించి 5 చికిత్సలు ఉన్నాయి. తాజా ప్రతిపాదనతో కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసే చికిత్సల సంఖ్య 305కు చేరింది. తాజాగా ప్రతిపాదించిన 134 చికిత్సలను రెండు, మూడు రోజుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి తొలగించనున్నారు. ఈ విషయాన్ని డీఎంఈ తమకు వివరించారని అనంతపురం వైద్య కళాశాలకు సంబంధించిన ఓ అధికారి పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో ప్రభుత్వ ఆస్పత్రులపై తీవ్ర ఒత్తిడి పడనుంది.

ఏం జరిగినా.. వైఎస్ కుటుంబంతోనే..

- ఎంతో అభివృద్ధి చేశా.. నిత్యం ప్రజలతోనే ఉన్నా..
- అయినా ఓటమికి కారణం అంతు చిక్కడం లేదు
- కూటమి హామీలకు ప్రజలు మోసపోయారా?
- వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా




రాజమహేంద్రవరం సిటీ: 'రాజానగరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో అభివృద్ధి చేశాం. పథకాల లబ్ధి నేరుగా అర్హుల ఖాతాల్లో జమ చేయించాం. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్నాం. చివరకు నా కన్నతల్లికి ఒంట్లో బాగోలేక ఆస్పత్రిలో ఉన్నా సరే, పజల కోసం పనిచేశా. అయినా ప్రజలు ఇంత దారుణంగా ఎందుకు ఓడించారో అంతుబట్టడం లేదు..' అని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోను గతంతో పోలిస్తే గడచిన ఐదేళ్లలో 20 నుంచి 30 రెట్ల అభివృద్ధి చేశామన్నారు. '20 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఇళ్ల నిర్మాణాలకు లోన్లు కూడా మంజూరు చేయించాం. రూ.1,773 కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. రూ.1,377 కోట్లతో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేశాం. రాజానగరం మండలం కలవలచర్లలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. నవరత్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించాం. కోరుకొండ సీతానగరం మండలాల్లో రెండు పంటలకు సాగునీరిచ్చి, వ్యవసాయం చక్కగా చేసుకునేందుకు అనువైన పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, పురుగుమందులు, గోడౌన్లు, యంత్రపరికరాలు ఇలా అన్నీ అందించాం. బొబ్బిలంక వద్ద రూ.91 కోట్లతో తొర్రిగెడ్డ రివర్స్ పంపింగ్ స్కీమ్ నిర్మాణానికి చర్యలు తీసుకుని, రూ.25 కోట్లతో తొర్రిగెడ్డ పంపిణీ స్కీమ్‌ను ఆధునికీకరించాం..' అని వివరించారు. ప్రతి చిన్న ఫిర్యాదుకు స్పందించి, జవాబుదారీతనంతో పనిచేశామని చెప్పారు. నియోజకవర్గంలో లక్ష కుటుంబాలుంటే 80 వేల కుటుంబాల వద్దకు తానే వెళ్లానని, తన కుటుంబ సభ్యులందరూ నియోజకవర్గంలో ఎన్నో సహాయ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.

కాపులను పట్టించుకోనివారు హీరోలైపోయారు

కాపు రిజర్వేషన్ల కోసం శ్రమించిన ముద్రగడ వంటి నాయకుడు అనేక మాటలు పడ్డారని, కాపుల కష్టాలను ఏనాడూ పట్టించుకోని నాయకులు హీరోలు అయిపోయారని చెప్పారు. గతంలో ఇదే కూటమి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇచ్చిన 650 హామీలు నెరవేర్చకపోయినా, ప్రజలు ఇప్పుడు అదే కూటమికి పట్టం కట్టారని, కూటమి హామీలు చూసి ప్రజలు మోసపోయారనుకోవాలా అని అన్నారు. ప్రజల కోసం అనునిత్యం తపిస్తూ, వారికి మంచిచేయాలని చూడటమే తమ తప్పా అనేది తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల గురించి పట్టించుకోనివారు, తరచు అమెరికా వెళ్లి వచ్చేవారు వేల మెజార్టీతో నెగ్గేశారని, ఇది చూస్తుంటే ఇంతవరకు భ్రమలో బతికామా అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. 'మీకు మంచి చేసి ఉంటేనే నాకు ఓటు వేయండి..' అని అడిగిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని, దేశంలో ఏ ముఖ్యమంత్రికి ఇలాంటి దమ్ములేదని చెప్పారు. గెలిచినా, ఓడినా రియల్ హీరో జగనన్న మాత్రమేనన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తామని, ఏదేమైనా ప్రజల కోసమే పనిచేస్తామని, ప్రాణం ఉన్నంత వరకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతోనే కలిసి నడుస్తామని స్పష్టం చేశారు. ఓటమికి కారణాలన్నీ విశ్లేషించుకుని ప్రజలతో మమేకమవుతామన్నారు. ఆరునెలలు గడిస్తే ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేస్తుందో ప్రజలే గమనిస్తారని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా నెగ్గినవారికి ఆయన అభినందనలు తెలిపారు.

నా నడక వైఎస్ జగన్‌తోనే

- పేదలకు ఎంతో మేలు చేసిన వైఎస్ జగన్‌ను ప్రజలు ఓడించడం బాధగా ఉంది
- సవాల్ మేరకు నా పేరును మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్నా
- కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం



మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

కిర్లంపూడి: 'కోట్లాది రూపాయలు అందజేసి పేద వారికి ఆక్సిజన్ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఓడించడం బాధగా ఉంది. నా నడక వైఎస్ జగన్‌తోనే. ఆయన వెనకాలే నేను నడుస్తా' అని కాపు ఉద్యమ నాయకుడు, వైఎస్సార్‌సీపీ నేత ముద్రగడ పద్మనాభం చెప్పారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటమి రావడం చాలా బాధాకరం. పేదలకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందజేశారు. అయినా ఆయనను ఓడించడం బాధగా ఉంది. దేశంలో ఏ ముఖ్యమంత్రీ కూడా ఈ స్థాయిలో సంక్షేమ పథకాల అమలుకు సాహసం చేయలేదు. కానీ, ప్రజలు ఎందుకు ఓడించారనేదే నా ప్రశ్న? సంక్షేమం కన్నా అభివృద్ధి మీద ఆసక్తి చూపించారా? లేకపోతే ఎదుటి పార్టీ వాళ్లు ప్రకటించిన సంక్షేమ పథకాలకు మొగ్గు చూపారా? రాబోయే ఏ ముఖ్యమంత్రి కూడా సంక్షేమ పథకాల జోలికి వెళ్లకుండా ప్రజలు ఇలా చేశారనుకుంటున్నా. ప్రజల కోసమే నిరంతరం కష్టపడిన జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవించుకోలేకపోవడం బాధగా ఉంది. పిఠాపురంలో పవన్‌కళ్యాణ్‌ను ఓడించకపోతే నా పేరు పద్మనాభంరెడ్డిగా మార్చుకుంటానని గతంలో సవాల్ చేశా. ఆ మాటకు కట్టుబడి పేరు మార్పు కోసం దరఖాస్తు చేస్తున్నా. గెజిట్ పబ్లికేషన్‌లో మార్పుతో కూడిన పేరు చేర్చిన తర్వాత మీడియా సమావేశం పెట్టి ప్రకటిస్తా. నేను మాట్లాడితే చాలు.. ఉప్మా పద్మనాభం అంటూ అవమానించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మా ఇంటికి వచ్చిన వారికి ఉప్మా, కాఫీ ఇవ్వడం మీకు చీప్‌గా ఉందా? మా తాత, తండ్రి నుంచి కూడా మా ఇంటికి ఎవరు వచ్చినా మర్యాద చేయడం అలవాటు. అదేదో నేరమన్నట్లు మీరంతా భూతద్దంలో చూపిస్తున్నారు. మీ ఇళ్లకు ఎవరైనా వస్తే వారికి మర్యాద చేయరా?' అని ముద్రగడ ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి నేతలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో బాబు దిట్ట

- ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారనే అనుమానం ఉంది
- దీనిపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తాం
- కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్: వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబును మించినవారు లేరని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు జరిగిన సరళి, కౌంటింగ్ తర్వాత జరిగిన సంఘటనలు పరిశీలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారనే అనుమానం అందరిలోను కలుగుతోందని చెప్పారు. ఎంపిక చేసుకున్న బూత్‌లలో ఈ ట్యాంపరింగ్ జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కుల మతాలు, పార్టీలకతీతంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి గడప వద్దకే అందించారని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల ఫలితాలు చూస్తే ఎన్నికల హామీలు ఏవీ అమలు చేయనందునే ఈ తరహా ఫలితాలు వచ్చాయని భావించే అవకాశం ఉందన్నారు. ఎన్నికల తర్వాత చంద్రబాబు, లోకేశ్ 15 రోజులు మాయమయ్యారని, ఎక్కడికిపోయారో ఎవరికీ తెలియదని చెప్పారు. బార్‌కోడ్ తెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చని, సింగపూర్‌లో కూర్చొని వీరు ఈవీఎంల బార్‌కోడ్‌లు సంపాదించి వాటిద్వారా ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అతిపెద్ద స్కాం అని చెప్పారు. తాము ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేశామని, తమ ఓట్లు ఎక్కడిపోయాయో తెలియడంలేదని ప్రజలు వాపోతున్నారన్నారు. 2014లో 680 హామీలిచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని, ఇప్పుడు సూపర్‌సిక్స్ అంటూ కొత్త హామీలు ఇచ్చి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను అటుఇటు మార్చి హామీలిచ్చారని చెప్పారు. ఇవి అమలు చేయడం సాధ్యం కాదని చంద్రబాబుకు తెలుసని, అయినా అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టారని తెలిపారు.

ఎన్నికల అధికారులకు అభినందనలు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని శాంతియుతంగా పూర్తిచేసినందుకు, మొత్తం ఎన్నికల ప్రక్రియను అత్యంత ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించినందుకు జిల్లాల ఎన్నికల అధికారులకు, ఆర్వోలకు, ఎన్నికల సిబ్బందికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అభినందనలు తెలిపారు. ఇటువంటి ప్రతిభావంతులైన అధికారుల బృందానికి నాయకత్వం వహించినందుకు ఎంతో గర్వపడుతున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్య పండుగను రాష్ట్రంలో ఎంతో విజయవంతంగా నిర్వహించడంతోపాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా అనుసరించిన మంచి పద్ధతులను భవిష్యత్తు తరాలవారికి ఎంతో ఆదర్శంగా, మార్గదర్శకంగా ఉండే విధంగా ఒక కరదీపిక రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా అనుసరించిన వినూత్న పద్ధతులను భారత ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు మూడు రోజుల్లో తమ కార్యాలయానికి నివేదికలు పంపాలని కోరారు. అన్ని జిల్లాల నివేదికల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించి భారత ఎన్నికల సంఘానికి పంపుతామని చెప్పారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ప్రజాస్వామ్య పండుగను రాష్ట్రంలో ఎంతో విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. విమర్శలకు ఆస్కారం లేకుండా రూపొందించిన శుద్ధమైన ఓటర్ల జాబితా మొత్తం ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు నాందిపలికిందని చెప్పారు. ఈ జాబితా రూపొందించేందుకు కృషిచేసిన అధికారులకు, సిబ్బందికి, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారత ఎన్నికల సంఘం 2024 మార్చి 16న ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసేంతవరకు రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, మండలస్థాయి వరకు ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించినట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం అవిరళ కృషిచేసిందన్నారు. కొన్నిచోట్ల చెదురుమదురు సంఘటనలు మినహా మొత్తం ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన రాజకీయపక్షాల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

• పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జనసేన జెడ్పీటీసీ గుండా జయప్రకాశ్ నాయుడుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ తెలిపారు. ఈ నెల 4న వీరవాసరం పెదపేటలో లింగంపల్లి సాల్మన్‌రాజు అనే యువకుడిపై జయప్రకాశ్‌నాయుడు, మరో ముగ్గురు దాడి చేసి గాయపర్చారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ హత్యాయత్నం

- చంద్రగిరిలో గంజాయి మత్తులో టీడీపీ కార్యకర్తల దారుణం
- వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిపై కత్తితో దాడి
- అడ్డొచ్చిన కుటుంబ సభ్యులు, బంధువు పైనా దాడి
- మరో చోట ధాబా ధ్వంసం, వార్డు సభ్యుడిపై దాడి

చంద్రగిరి (తిరుపతి జిల్లా)/తిరుపతి క్రైమ్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మత్తులో టీడీపీ కార్యకర్తలు రాష్ట్రంలో విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ఈ దాడులు బుధవారమూ కొనసాగాయి. తిరుపతి జిల్లా చంద్రగిరిలో టీడీపీ కార్యకర్తలు కొందరు గంజాయి మత్తులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. అడ్డొచ్చిన మరో వ్యక్తిని కూడా గాయపరిచారు. మరో చోట వార్డు సభ్యుడిపై దాడి చేసి, గాయపరిచారు. తిరుపతి నగరంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు.

కత్తులు, రాడ్లతో దాడి

బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, పార్టీ మండల కన్వీనర్ మస్తాన్‌పై టీడీపీ కార్యకర్తలు చంద్రగిరిలో హత్యాయత్నానికి పాల్పడ్డారు. గంజాయి మత్తులో ఉన్న టీడీపీ కార్యకర్తలు కొందరు బుధవారం రాత్రి మస్తాన్ ఇంటి వద్దకు వచ్చారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంతో ఇంటి నుంచి బయటకు వస్తున్న ఆయనపై కత్తులు, రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఓ వ్యక్తి కత్తితో మస్తాన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకొన్నప్పటికీ వారు ఆగలేదు. టీడీపీ వారిని అడ్డుకోబోయిన మస్తాన్ బంధువైన సాదిక్‌ను కూడా గాయపరిచారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు అక్కడికి చేరుకోవడంతో టీడీపీ వారు జారుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో ధాబా ధ్వంసం

అదే విధంగా చంద్రగిరి మండలం పరిధిలోని ఐతేపల్లి వద్ద ఉన్న ధాబాను టీడీపీ కార్యకర్తలు కొందరు ధ్వంసం చేశారు. బుధవారం మద్యం సేవించిన కొందరు టీడీపీ కార్యకర్తలు ధాబా వద్దకు వెళ్లి గొడవకు దిగారు. సమాచారం అందుకున్న వార్డు సభ్యుడు సక్కూరు వంశీ అక్కడి వెళ్లారు. అదే సమయంలో పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. మాపైనే పోలీసులకు చెప్తావా అంటూ వార్డు సభ్యుడు వంశీపై టీడీపీ వారు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ధాబాలోని కుర్చీలు, టేబుళ్లు ధ్వంసం చేశారు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం

తిరుపతి నగరం 8వ డివిజన్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూటమి కార్యకర్తలు ధ్వంసం చేశారు. సంజయ్ కాలనీలో ఉన్న ఈ కార్యాలయాన్ని మురళి నిర్వహిస్తున్నారు. షట్టర్ ఓపెన్ చేసి గ్లాస్ డోర్‌కు తాళం వేసుకుని వెళ్లిన సమయంలో కూటమి మూకలు రాళ్లతో దాడిచేసి లోపలికి ప్రవేశించి ఫర్నిచర్ మొత్తం ధ్వంసం చేశారు. టీవీలు, కంప్యూటర్లు, బల్లలు అన్నింటినీ విరగ్గొట్టారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కార్యాలయం నిర్వాహకుల నుంచి ఫిర్యాదు తీసుకొన్నారు.



తీవ్రంగా గాయపడిన సక్కూరు వంశీ



తిరుపతి సంజయ్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన కూటమి కార్యకర్తలు


ఎన్డీఏ భేటీలో చంద్రబాబు, నితీశ్ కుమార్‌లతో మాట్లాడుతున్న మోదీ


తన రాజీనామా పత్రాన్ని రాష్ట్రపతి ముర్ముకు సమర్పిస్తున్న మోదీ

ఎన్డీఏ నేతగా మోదీ

ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేతలు.. వీలైనంత త్వరగా ప్రభుత్వ ఏర్పాటు

న్యూఢిల్లీ/బెంగళూరు: బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ కూటమి నేతగా ప్రధాని మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వెలువడ్డ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ మెజారిటీ స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో మోదీ వరుసగా మూడోసారి ప్రధాని కానున్నారు. తొలి ప్రధాని నెహ్రూ తర్వాత ఈ ఘనత సాధించనున్న నాయకునిగా రికార్డు సృష్టించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో ప్రధాని నివాసంలో ఎన్డీఏ కీలక సమావేశం జరిగింది. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో బీజేపీతో పాటు ఎన్డీఏ పక్షాల అగ్ర నేతలంతా పాల్గొన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే, ఎల్జేపీ (ఆర్‌వీ) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, జేడీ(ఎస్) నేత హెచ్.డి.కుమారస్వామి, ఎన్సీపీ నాయకుడు ప్రఫుల్ పటేల్, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ సహా 16 పార్టీలకు చెందిన 21 మంది నాయకులు భేటీలో పాల్గొన్నారు. బీజేపీ నుంచి పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అగ్ర నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు హాజరయ్యారు. భేటీను ద్దేశించి తొలుత మోదీ మాట్లాడారు. ఎన్నికల విజయానికి కూటమి పక్షాలను అభినందించారు. కేంద్రంలో ఎన్డీఏ వరుసగా మూడోసారి మెజారిటీ సాధించడం చరిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు. ఇది గత 60 ఏళ్లలో ఎవరికీ సాధ్యపడని ఘనత అన్నారు. వీలైనంత త్వరగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నితీశ్ సూచించారు. ఇండియా కూటమిలో చేరాలంటూ ఎన్డీఏ పార్టీలకు కాంగ్రెస్ బాహాటంగానే పిలుపులిస్తున్న నేపథ్యంలో అనిశ్చితికి తావు లేకుండా తక్షణం ప్రభుత్వం కొలువుదీరాలని నేతలన్నారు. అందుకు వీలుగా శాఖల పంపకం తదితర మంతనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ కూర్పుపైనా భేటీలో నేతలు చర్చించారు. శుక్రవారం ఎన్డీఏ ఎంపీలంతా సమావేశమై మోదీని తమ నాయకునిగా లాంఛనంగా ఎన్నుకుంటారని హెచ్ఏఎం(ఎస్) జితిన్‌రాం మాంఝీ వెల్లడించారు. అనంతరం రాష్ట్రపతిని కలిసి ఎన్డీఏ కూటమికి మద్దతు లేఖలు సమర్పిస్తామని భేటీ అనంతరం మీడియాకు వెల్లడించారు.

మోదీపై నేతల ప్రశంసలు

దేశ ఘన వారసత్వాన్ని ప్రగతికి, సమగ్రాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం పాటుపడుతుందంటూ ఎన్డీఏ భేటీలో నేతలంతా తీర్మానం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ''ప్రధాని మోదీ సారథ్యంలో గత పదేళ్లలో పలు ప్రజానుకూల నిర్ణయాలతో దేశం అన్ని రంగాల్లోనూ వృద్ధి బాటన సాగుతోంది. ఆయన నాయకత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో సమైక్యంగా పోటీ చేసి గొప్ప విజయం సాధించడం మాకందరికీ గర్వకారణం. మోదీని మా నాయకునిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నాం'' అంటూ నేతలు తీర్మానించారు.

ఎన్డీఏతోనే ఉంటాం

తాము ఎన్డీఏలోనే కొనసాగుతామని బాబు, నితీశ్ స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి ఊహాగానాలకూ తావు లేదన్నారు. దేశ నిర్మాణం కోసం పదేళ్లుగా మోదీ చేసిన కృషిని ప్రస్తుతిస్తూ నేతలంతా ఆయన్ను అభినందించారని తెలిపారు. ''అంతర్జాతీయంగా భారత్ స్థాయిని మోదీ పెంచారు. ఆయన లక్ష్యాల సాధనకు సహకరిస్తాం'' అన్నారు.

కీలక శాఖలు, స్పీకర్
ఎన్డీఏ పక్షాల డిమాండ్లు

2014, 2019ల్లోనూ కేంద్రంలో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వమే ఏర్పాటైనా ఆ రెండు సార్లూ బీజేపీకి ఒంటరిగానే సంపూర్ణ మెజారిటీ వచ్చింది. ఈసారి మాత్రం ఆ పార్టీ 240 లోక్‌సభ స్థానాలకు పరిమితమై మెజారిటీకి 32 సీట్ల దూరంలో నిలిచింది. దాంతో ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్య పక్షాల మద్దతు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మోదీ 3.0 సర్కారు పనితీరు గత రెండుసార్లతో పోలిస్తే చాలా భిన్నంగా ఉండేలా కనిపిస్తోంది. ఎన్డీఏ భాగస్వాములంతా కీలక శాఖలు డిమాండ్ చేస్తున్నట్టు చెబుతున్నారు. విశ్వసనీయ వర్గాలతో పాటు జాతీయ మీడియా పేర్కొంటున్న మేరకు ఎవరేం కోరుతున్నారంటే...

టీడీపీ: ఏకంగా 7 నుంచి 8 కేబినెట్ బెర్తులు, ఒక సహాయ మంత్రి పదవి కోరుతోంది! వ్యవసాయ, రవాణా, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, ఐటీ–వాణిజ్య, విద్య, గృహ నిర్మాణ, జల శక్తి, ఆర్థిక (సహాయ) శాఖలతో కూడిన జాబితాను బీజేపీ ముందు పెట్టినట్టు తెలుస్తోంది. లోక్‌సభ స్పీకర్ పదవి కూడా అడుగుతోంది.

జేడీ(యూ): జేడీ(యూ) పార్టీ కనీసం మూడు కేబినెట్ పదవులు డిమాండ్ చేస్తోంది. ఒకట్రెండు సహాయ మంత్రి పదవులు కూడా కోరవచ్చంటున్నారు. మరోవైపు విపక్షాల 'ఇండియా' కూటమి కూడా ఇప్పటికే తమను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని జేడీ(యూ) సీనియర్ నేత, బిహార్ మంత్రి విజయ్ కుమార్ చౌదరి మీడియాకు చెప్పడం విశేషం. ఆయన వ్యాఖ్యలను బీజేపీపై ఒత్తిడి పెంచే వ్యూహంగా భావిస్తున్నారు.

ఎల్జేపీ (ఆర్‌వీ): ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి కోసం పట్టుబడుతోంది. బిహార్లో పోటీ చేసిన ఐదు లోక్‌సభ స్థానాల్లోనూ పార్టీ ఘనవిజయం సాధించడం తెలిసిందే. హెచ్ఏఎం(ఎస్) నేత జితిన్‌రాం మాంఝీ కూడా కేబినెట్ పదవి ఆశిస్తున్నారు.

శివసేన: ఒక కేబినెట్, మరో సహాయ మంత్రి పదవి కోరుతోంది.

వ్యవసాయ శాఖపై జేడీ(ఎస్) కన్ను: తనకు వ్యవసాయ శాఖ కావాలంటూ జేడీ(ఎస్) నేత కుమారస్వామి స్పష్టమైన సంకేతాలిచ్చారు. ఆయన పార్టీ జేడీ(ఎస్) రెండు లోక్‌సభ స్థానాలు గెలిచింది. ''కేంద్ర వ్యవసాయ శాఖపై మా పార్టీకి ఆసక్తి ఉంది. అయితే మేమేమీ డిమాండ్లు చేయడం లేదు. మాకు కర్నాటక ప్రయోజనాలే ప్రధానం. కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రానికి ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించాలో మోదీ నిర్ణయిస్తారు. అయినా దానిపై సరైన సమయంలో మాట్లాడుకుందాం'' అని చెప్పుకొచ్చారు.

8 లేదా 9న ప్రమాణం!

మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నరేంద్ర మోదీ

- మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం
- ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ ఏర్పాటుపై చర్చ
- 17వ లోక్‌సభను రద్దు చేయాలని సిఫార్సు
- ఆమోదించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ప్రధానిగా వ్యవహరించాలని మోదీకి సూచన

సాక్షి, న్యూఢిల్లీ: మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అధిరోహించబోతున్నారు. వరుసగా మూడుసార్లు ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి జవహర్‌లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డును మోదీ సమం చేయబోతున్నారు. ఈ నెల 8 లేదా 9న ప్రమాణం స్వీకారం చేసే అవకాశం ఉంది. ప్రధాని సహా నూతన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా, బుధవారం మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. ఎన్డీయే–2 ప్రభుత్వంలో ఇదే చివరి కేబినెట్ సమావేశం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు నూతన ప్రభుత్వ ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు. ప్రస్తుత 17వ లోక్‌సభను రద్దు చేయాలని కేబినెట్ సిఫార్సు చేసింది. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో ఉదయం 11.30 గంటలకు జరిగిన కేబినెట్ భేటీలో మోదీ మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు ఒక భాగమేనని అన్నారు. నెంబర్ గేమ్ కొనసాగుతుందని చెప్పారు. గత పదేళ్ల పాలనలో ఎన్నో మంచి పనులు చేశామని, భవిష్యత్తులోనూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటామని వెల్లడించారు. పదేళ్లలో మంత్రులంతా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తనతో పాటు మంత్రివర్గ సహచరుల రాజీనామా లేఖలను సమర్పించారు. మోదీతోపాటు కేంద్ర మంత్రుల రాజీనామాలను రాష్ట్రపతి ఆమోదించారు. నూతన ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా వ్యవహరించాలని మోదీని కోరారు. 17వ లోక్‌సభను రద్దు చేయాలని కోరుతూ కేబినెట్ చేసిన సిఫార్సు లేఖను రాష్ట్రపతి అందజేశారు. దీంతో 17వ లోక్‌సభను రద్దు చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు వెల్లడించాయి.

ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్‌తో మోదీ భేటీ

ప్రధాని మోదీ బుధవారం తన పదవికి రాజీనామా చేసిన తర్వాత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధన్‌ఖడ్ మూడు కమలం పువ్వులున్న పుష్పగుచ్ఛాన్ని మోదీకి అందజేసి అభినందనలు తెలియజేశారు. వరుసగా మూడుసార్లు విజయం సాధించినందుకు గుర్తుగా మూడు కమలం పువ్వులను ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే మోదీ కూడా కొన్ని రకాల మిఠాయిలను ఉప రాష్ట్రపతికి అందజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రాత్రి ప్రధాని నరేంద్ర మోదీ, దిగిపోతున్న మంత్రివర్గానికి రాష్ట్రపతి భవన్‌లో విందు ఇచ్చారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా దీనికి హాజరయ్యారు.

టీడీపీ, జేడీ(యూ) మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ మిత్రపక్షాల సహాయంతో వరుసగా మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతోంది. ఈసారి కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం బీజేపీకి లభించలేదు. ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ, జేడీ(యూ), ఇతర మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ పెద్దలు నిర్ణయించారు. ఇదిలా ఉండగా, కేంద్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి సైతం తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో హస్తినలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఎన్డీయే నుంచి కొన్ని భాగస్వామ్య పక్షాలు ప్రతిపక్ష కూటమిలో చేరబోతున్నాయంటూ ఢిల్లీలో ఊహాగానాలు మొదలయ్యాయి.

కోర్టులో కేజ్రీవాల్‌కు చుక్కెదురు

బెయిల్ పొడిగింపు అభ్యర్థన తిరస్కరణ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల కోసం ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను అనారోగ్య కారణాలరీత్యా పొడిగించాలని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ సిటీ కోర్టు బుధవారం తోసిపుచ్చింది. బెయిల్‌ను పొడిగించాలంటూ కేజ్రీవాల్ పెట్టుకున్న పిటిషన్‌పై కేజ్రీవాల్, ఈడీ తరపున ఇరువైపులా వాదనలు విన్న కోర్టు గతంలోనే తీర్పును బుధవారానికి రిజర్వ్‌చేయడం తెల్సిందే. ఈ అభ్యర్థనను తిరస్కరిస్తున్నట్లు తీర్పును బుధవారం వెలువరిచింది. పిటిషన్‌లో కేజ్రీవాల్ అనారోగ్యం అంశాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో జైలులో ఆయన బాగోగులు చూసుకోవాలని తిహార్ జైలు యంత్రాంగానికి ఢిల్లీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా బుధవారం ఆదేశించారు. కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని జూన్ 19వ తేదీదాకా పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో డీఫాల్ట్ బెయిల్ కోసం కేజ్రీవాల్ విడిగా పెట్టుకున్న మరో పిటిషన్‌ను జూన్ ఏడో తేదీన విచారిస్తామని కోర్టు తెలిపింది.

మహిళా ఎంపీలు@74

న్యూఢిల్లీ: పద్దెనిమిదో లోక్‌సభకు మొత్తం 74 మంది మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. 543 మంది సభ్యులు గల లోక్‌సభలో మహిళా ఎంపీలు 13.62 శాతం మాత్రమే. ఈ 74 మందిలో 30 మంది గత లోక్‌సభలోనూ సభ్యులు కాగా, ఒకరు రాజ్యసభ సభ్యురాలు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 797 మంది మహిళలు పోటీచేయగా... బీజేపీ అత్యధికంగా 69 మందిని బరిలోకి దింపింది. కాంగ్రెస్ 41 మంది మహిళలకు టికెట్లిచ్చింది. చట్టసభల్లో 33 శాతం సీట్లను రిజర్వు చేసే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందాక జరిగిన తొలి ఎన్నికలివి. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంకా అమల్లోకి రాలేదు. బీజేపీ నుంచి హేమమాలిని, టీఎంసీ నుంచి మహువా మొయిత్రా, ఎన్సీపీ (ఎస్పీ) నుంచి సుప్రియా సూలే, ఎస్పీ నుంచి డింపుల్ యాదవ్‌లు తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. బాలీవుడ్ నటి కంగనా రనౌత్, లాలూ కూతురు మీసా భారతి తొలిసారిగా నెగ్గి దేశం దృష్టిని ఆకర్షించారు. సమాజ్‌వాది పార్టీ నుంచి 25 ఏళ్ల ప్రియా సరోజ్ (మచిలీషహర్), 29 ఏళ్ల ఇక్రా చౌదరి (కైరానా)లు లోక్‌సభకు ఎన్నికైన అతిపిన్న వయసు మహిళా ఎంపీలు. దేశంలో అత్యధిక మంది మహిళా ఎంపీలను లోక్‌సభకు పంపిన రాష్ట్రంగా పశ్చిమబెంగాల్ నిలిచింది. బెంగాల్ నుంచి గెలిచిన 11 మంది మహిళా ఎంపీలూ టీఎంసీ వారే కావడం విశేషం. భారత లోక్‌సభ చరిత్రలో అత్యధికంగా 17వ లోక్‌సభలో 78 మంది మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. దక్షిణాఫ్రికాలో 46 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్‌లో 35 శాతం, అమెరికాలో 29 శాతం మంది మహిళా ఎంపీలు ఉన్నారు.

ఏ పార్టీ నుంచి ఎందరంటే..

బీజేపీ	30
కాంగ్రెస్	14
తృణమూల్	11
సమాజ్‌వాది	4
డీఎంకే	3
జేడీయూ	2
ఎల్జేపీ	2

(వైఎస్సార్‌సీపీ 1, ఎన్సీపీ-ఎస్పీ 1, అకాళీదళ్ 1, అప్నా దళ్ 1, ఆర్జేడీ 1, జేఎంఎం 1, టీడీపీ 1, ఇతరులు 1)

నవీన్ పట్నాయక్ రాజీనామా

ముగిసిన 24 ఏళ్ల ప్రస్థానం

భువనేశ్వర్: ఒడిశాలో బిజూ జనతాదళ్(బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ పరిపాలనకు తెర పడింది. 24 ఏళ్లుగా అవిచ్ఛిన్నంగా ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన నవీన్ పట్నాయక్ బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర గవర్నర్ రఘువర్ దాస్‌కు సమర్పించారు. ఒడిశా శాసనసభ ఎన్నికల్లో బీజేడీ పరాజయం పాలైంది. 147 స్థానాలకు గాను కేవలం 51 స్థానాలు గెలుచుకుంది. బీజేపీ ఏకంగా 78 సీట్లు సాధించింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. నవీన్ పట్నాయక్ 2000 సంవత్సరం మార్చి 5న తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి పదవిలో కొనసాగారు. తాజా ఎన్నికల్లో ఓటమి ఎదురుకావడంతో పదవి నుంచి తప్పుకున్నారు. ఇక ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్నారు.

బీజేపీని అడ్డుకున్నాం

అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్య

కన్నౌజ్/ఎటావా: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీని అడ్డుకోవడంలో తాము విజయవంతం అయ్యామని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేయడమే లక్ష్యంగా పని చేశామని అన్నారు. అనుకున్న లక్ష్యం సాధించామని ఉద్ఘాటించారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ చూపిన బాటలో నడుస్తూ బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేశామన్నారు. యూపీలో లోక్‌సభల్లో ఎస్పీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎస్పీ సొంతంగా 37 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి అఖిలేశ్ యాదవ్ 1.70 లక్షల ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి సుబ్రతా పాఠక్‌పై విజయం సాధించారు.

దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా!

ముంబై: లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను అధికార కూటమిలో భాగస్వామి అయిన బీజేపీ కేవలం 9 స్థానాలు గెలుచుకుంది. ఎన్నికల్లో పేలవమైన పనితీరును తాను బాధ్యత వహిస్తున్నానని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. తన రాజీనామాకు అంగీకారం తెలపాలని బీజేపీ అధిష్టానాన్ని బుధవారం కోరారు. మరో ఆరు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేస్తానని, పూర్తి సమయం పార్టీ కోసమే వెచ్చిస్తానని అన్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేద్దాం రండి

అన్ని పార్టీలకు ఖర్గే పిలుపు

- ఇండియా కూటమి నేతల భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుపై మల్లగుల్లాలు
- బీజేపీ పాలన వద్దన్నది ప్రజాభీష్టం
- దాన్ని నెరవేర్చేందుకు చర్యలు: ఖర్గే

న్యూఢిల్లీ: కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై విపక్ష ఇండియా కూటమి మల్లగుల్లాలు పడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అందరి అంచనాలనూ మించి కూటమి 234 స్థానాలు సాధించడం తెలిసిందే. దాంతో కాంగ్రెస్‌తో పాటు భాగస్వామ్య పక్షాలన్నీ జోష్‌లో ఉన్నాయి. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఇండియా కూటమిలో చేరాల్సిందిగా పార్టీలన్నింటినీ ఆహ్వానిస్తున్నట్టు ఖర్గే ఈ సందర్భంగా ప్రకటించారు. రాజ్యాంగ పరిరక్షణకు, అందులో పేర్కొన్న విలువలకు కట్టుబడ్డ పార్టీలన్నింటికీ ఇండియా కూటమిలోకి స్వాగతమన్నారు. తమ కూటమి పక్షాలన్నీ ఎన్నికల్లో అద్భుతంగా పోరాడాయంటూ ప్రశంసించారు. ''ప్రజా తీర్పు ప్రధాని మోదీకి, ఆయన విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా వెలువడింది. ఫలితాలు ఆయనకు నైతిక ఓటమి. అయినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కానీ ప్రజా తీర్పును కాలరాసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు'' అంటూ ఖర్గే దుయ్యబట్టారు. దీన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు.

సరైన సమయంలో సరైన చర్యలు

భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలన వద్దని ప్రజలు స్పష్టంగా తీర్పు వెలువరించారన్నారు. దాన్ని నెరవేర్చేందుకు ఇండియా కూటమి సరైన సమయంలో చర్యలు తీసుకుంటుందంటూ నర్మగర్భంగా మాట్లాడారు. కూటమి నేతలంతా భేటీలో ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఇప్పటికిప్పుడు ముందుకు వెళ్లడం లేదన్నారు. మోదీ సారథ్యంలోని బీజేపీ ఫాసిస్టు పాలనపై రాజీలేని పోరు కొనసాగించాలని కూటమి నేతలంతా నిర్ణయించామన్నారు. లోక్‌సభలో మెజారిటీ మార్కు 272. దాన్ని చేరేందుకు ఇండియా కూటమికి మరో 38 సీట్లు కావాలి. పాలక ఎన్డీఏ కూటమికి మెజారిటీకి మించి 292 స్థానాలొచ్చినా బీజేపీ మాత్రం 240కే పరిమితమైంది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు టీడీపీ, జేడీ(యూ), శివసేన, ఎల్జేపీ వంటి భాగస్వాములపై ఆధారపడింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీలను తమవైపు తిప్పుకునేందుకు ఇండియా కూటమి ఇప్పటికే జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు చెబుతున్నారు. ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వద్రాతో పాటు భాగస్వామ్య పక్షాల నుంచి అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), స్టాలిన్ (డీఎంకే), సంజయ్ రౌత్ (శివసేన–యూబీటీ), శరద్ పవార్, సుప్రియా సులే (ఎన్సీపీ–ఎస్పీ), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), చంపయ్ సోరెన్ (జేఎంఎం), సీతారాం ఏచూరి (సీపీఎం), సంజయ్ సింగ్, రాఘవ్ ఛద్దా (ఆప్), ఒమర్ అబ్దుల్లా (ఎన్సీ), ఎన్కే ప్రేంచంద్రన్ (ఆరెస్పీ) తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటు తదితర భావి వ్యూహాలపై నేతలంతా రెండు గంటలకు పైగా లోతుగా చర్చించారు.


ఢిల్లీలోని ఖర్గే నివాసంలో భేటీ అయిన 'ఇండియా' కూటమి పార్టీల నేతలు

వేచి చూడండి: తేజస్వి

భేటీకి ముందు తేజస్వి మీడియాతో మాట్లాడుతూ 'ఏం జరగనుందో వేచి చూడండి' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఆయన, ఎన్డీఏ భేటీలో పాల్గొనేందుకు జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్ బుధవారం పట్నా నుంచి ఢిల్లీకి ఒకే విమానంలో వెళ్లడం విశేషం! ఆ సందర్భంగా పక్కపక్కనే కూర్చుని మాటలు కలిపడంతో మీడియాలో విపరీతమైన ఆసక్తి నెలకొంది. నితీశ్‌ను తిరిగి ఇండియా కూటమిలో చేరేలా ఒప్పించేందుకు తేజస్వి ప్రయత్నించారంటూ పుకార్లొచ్చాయి. దాంతో ఢిల్లీ చేరగానే విమానాశ్రయంలో మీడియా అంతా తేజస్విని చుట్టుముట్టింది. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఇండియా కూటమి చేస్తున్న ప్రయత్నాలపై ప్రశ్నల వర్షం కురిపించింది. నితీశ్‌తో తన మాటలు కుశల ప్రశ్నలకే పరిమితమైనట్టు తేజస్వి బదులిచ్చారు.

మీ చెల్లెల్ని అయినందుకు గర్వంగా ఉంది

రాహుల్‌కు ప్రియాంక అభినందనలు

న్యూఢిల్లీ: తన సోదరుడు రాహుల్ గాంధీ ఎప్పటికీ వెనక్కి తగ్గరని, సత్యం కోసం పోరాటాన్ని ఆపబోరని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన రాహుల్‌కు బుధవారం 'ఎక్స్'లో అభినందనలు తెలియజేశారు. ''మీరు ఎప్పుడూ తలెత్తుకొని ఉంటారు. ఎవరేం చెప్పినా, ఏం చేసినా, ఎన్నిక ప్రతికూల పరిస్థితులు ఎదురైనా మీరు వెనక్కి తగ్గరు. మీ అంకితభావాన్ని ఎవరెంతగా సందేహించినా మీరు మీపై విశ్వాసం కోల్పోరు. కోపం, విద్వేషం వంటివి మిమ్మల్ని ప్రభావితం చేయలేవు. మీరు చాలా ధైర్యవంతులు. మీ చెల్లెల్ని అయినందుకు ఎంతో గర్వంగా ఉంది'' అని ప్రియాంక పోస్టు చేశారు.

మోదీకి దేశాధినేతల శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: మూడోసారి అధికార పగ్గాలు స్వీకరిస్తున్న ప్రధాని మోదీకి పలు ప్రపంచ దేశాల అధినేతలు శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, జర్మనీ చాన్స్‌లర్ ఓలాఫ్ స్కోల్జ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలానీ ఇలా 75 దేశాలకు చెందిన అగ్రనేతలు మోదీకి శుభాకాంక్షలు తెలిపారు.

మూడోసారి అంతరిక్షంలోకి సునీత

హూస్టన్: భారత సంతతికి చెందిన అమెరికా వ్యోమగామి సునీతా విలియమ్స్(58) అంతరిక్ష ప్రయాణం ప్రారంభించారు. మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్(61)తో కలిసి బోయింగ్ కంపెనీకి చెందిన స్టార్‌లైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో బుధవారం పయనమయ్యారు. అంతరిక్షంలోని ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు 25 గంటల్లో చేరుకోబోతోన్నారు. అక్కడ వారం రోజులపాటు ఉంటారు. స్టార్‌లైన్ స్పేస్‌క్రాఫ్ట్‌లోనే ఈ నెల 14న మళ్లీ భూమిపైకి చేరుకుంటారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ఆధ్వర్యంలో ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ ప్రయాణం అరంభమైంది. స్టార్‌లైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో అంతరిక్ష ప్రయాణం చేసిన మొట్టమొదటి వ్యోమగాములుగా సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ చరిత్ర సృష్టించారు. ఈ స్పేస్ మిషన్‌కు సునీతా పైలట్‌గా, విల్‌మోర్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. సునీతా అంతరిక్షంలోకి వెళ్లడం ఇది మూడోసారి కావడం విశేషం. 2006లో, 2012లో అంతరిక్ష ప్రయాణం సాగించారు. 2012లో అంతరిక్షంలో ట్రయథ్లాన్ పూర్తిచేసిన తొలి మహిళగా రికార్డుకెక్కారు. వెయిట్ లిఫ్టింగ్ మెషీన్ సాయంతో శూన్య వాతావరణంలో ఈత కొట్టారు. ట్రెడ్‌మిల్‌పై పరుగెత్తారు. 2007లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి బోస్టన్ మారథాన్ పూర్తిచేశారు. అమెరికా నావికాదళంలో పనిచేసిన సునీతా విలియమ్స్‌ను నాసా 1998లో ఎంపిక చేసి వ్యోమగామిగా శిక్షణ ఇచ్చింది. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్టు మిషన్ చాలా ఏళ్లు వాయిదా పడింది. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ అభివృద్ధిలో కొన్ని అటంకాలు తలెత్తడమే ఇందుకు కారణం. ఎట్టకేలకు స్పేస్‌క్రాఫ్ట్ సిద్ధమైంది. బోయింగ్ కంపెనీ డెవలప్ చేసిన మొట్టమొదటి అంతరిక్ష ప్రయోగం వాహనం స్టార్‌లైనర్ కావడం విశేషం. ఎలాన్ మస్క్ స్థాపించిన స్పేస్ ఎక్స్ సంస్థ ఇలాంటి అంతరిక్ష ప్రయాణ వాహనాలు తయారు చేసే తొలి ప్రైవేట్ సంస్థగా రికార్డుకెక్కింది. తాజా ప్రయోగంతో రెండో ప్రైవేట్ సంస్థగా బోయింగ్ కంపెనీ రికార్డు సృష్టించింది.



తొమ్మిది మంది పర్వతారోహకుల దుర్మరణం

మృతులంతా కర్ణాటకవాసులే

బెంగళూరు: ఉత్తరాఖండ్‌లో పర్వతారోహణకు వెళ్లిన కర్ణాటకకు చెందిన తొమ్మిది మంది పర్వతారోహకులు ప్రాణాలు కోల్పోయారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులే వారి ప్రాణాలు తోడేశాయని ఉత్తరాఖండ్ జిల్లా మేజిస్ట్రేట్ మెహర్బాన్ సింగ్ బిష్ట్ చెప్పారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 18 మంది కర్ణాటకకు చెందిన ట్రెక్కీలు, ఒక మహారాష్ట్ర వ్యక్తి, ముగ్గురు గైడ్‌లతో కూడిన 22 మంది సభ్యుల ట్రెక్కింగ్ బృందాన్ని మనేరీకి చెందిన హిమాలయన్ వ్యూ ట్రెక్కింగ్ ఏజెన్సీ ట్రెక్కింగ్‌కు పంపింది. ఉత్తరాఖండ్‌లోని సహస్త్రతల్ సరస్సు ప్రాంతానికి చేరుకోగానే దారి తప్పి ప్రతికూల వాతావరణంలో చిక్కుకుపోయారు. జాడ గల్లంతైన వారిలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేన, విపత్తు స్పందన దళం రంగంలోకి దిగి మిగిలిన 13 మందిని కాపాడాయని రెవిన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి రష్మీ మహేశ్ చెప్పారు. మృతుల వివరాలను వెల్లడించలేదు.

ఏకంగా 280 కొత్త ముఖాలు

న్యూఢిల్లీ: పద్దెనిమిదో లోక్‌సభలో ఏకంగా 280 మంది ఎంపీలు మొదటిసారిగా దిగువసభకు ఎన్నికైన వారున్నారు. ఇందులో మాజీ సీఎంలు, సినీ తారలు, వారసులు, హైకోర్టు మాజీ జడ్జి తదితరులున్నారు. అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తరప్రదేశ్ నుంచి ఏకంగా 45 కొత్తముఖాలు కనిపించనున్నాయి. వీరిలో టీవీ రాముడు అరుణ్ గోవిల్, జెయింట్ కిల్లర్ కిశోరీలాల్ శర్మ, దళిత హక్కుల ఉద్యమకారుడు చంద్రశేఖర్ ఆజాద్ తదితరులున్నారు. మహారాష్ట్రలో 48 స్థానాలుండగా 33 మంది తొలిసారిగా ఎంపీలుగా గెలిచారు. స్కూల్ టీచర్ భాస్కర్ భాగ్రే ఎన్సీపీ (పవార్) తరపున ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం డిండోరి నుంచి గెలుపొందారు. పీయూష్ గోయల్ కూడా లోక్‌సభకు రావడం ఇదే తొలిసారి. మాజీ ముఖ్యమంత్రులు నారాయణ్ రాణే (మహారాష్ట్ర), త్రివేంద్ర సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), మనోహర్‌లాల్ ఖట్టర్ (హరియాణా), బిప్లవ్‌కుమార్ దేవ్ (త్రిపుర), జితిన్‌రామ్ మాంఝి (బిహార్), బస్వరాజ బొమ్మై (కర్నాటక), జగదీశ్ షెట్టర్ (కర్నాటక), చరణ్‌జిత్ సింగ్ చన్నీ (పంజాబ్)లు తొలిసారిగా దిగువసభలో అడుగుపెట్టనున్నారు. సినీ తారల్లో సురేష్ గోపి (త్రిసూర్), కంగనా రనౌత్ (మండి)లు తొలిసారి నెగ్గినవారే. రాజకుటుంబీకుల్లో ఛత్రపతి సాహు (కొల్హాపూర్), యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్ (మైసూర్), కీర్తి దేవి దేబ్‌బర్మన్ (త్రిపుర ఈస్ట్)లు, ఎన్నికలకు ముందు హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసి బీజేపీ టికెట్‌పై పశ్చిమబెంగాల్‌లోని తమ్లుక్ నుంచి పోటీ చేసిన గెలిచిన అభిజిత్ గంగోపాధ్యాయ్‌లు మొదటిసారి ఎంపీలుగా గెలిచిన వారే.

ముస్లిం ఎంపీలు 24 మంది


నూతన లోక్‌సభకు 24 మంది ముస్లిం ఎంపీలు ఎన్నికయ్యారు. మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్ (టీఎంసీ), అసదుద్దీన్ ఓవైసీ, అస్సాంలో 10 లక్షల పైచిలుకు మెజారిటీతో నెగ్గిన కాంగ్రెస్ అభ్యర్థి రకీబుల్ హుస్సేన్‌లు ఉన్నారు. ఈసారి మొత్తం 78 మంది ముస్లిం అభ్యర్థులు పోటీచేయగా 24 మంది గెలిచారు. కిందటి లోక్‌సభలో 26 మంది ముస్లిం ఎంపీలు ఉండగా.. ఈసారి వారి సంఖ్య రెండు తగ్గింది. కాంగ్రెస్ నుంచి అత్యధికంగా ఏడుగురు ముస్లిం ఎంపీలు ఎన్నికకాగా, తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఐదుగురు, సమాజ్‌వాది నుంచి నలుగురు, ఇండియన్ ముస్లిం లీగ్ నుంచి ముగ్గురు ముస్లింలు ఎంపీలుగా గెలిచారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 6 । జూన్ । 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కృష్ణాజిల్లా కానుమోలుకు చెందిన పొట్లూరి పవన్‌కుమార్, లత బుధవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

గరిష్టం/కనిష్టం
39/27

	కనిష్టం	గరిష్టం
నందిగామ	28.1	37.3
జగ్గయ్యపేట	27	37
మచిలీపట్నం	28	39
గుడివాడ	28	38

న్యూస్‌రీల్

ప్రత్యేక గోదాముల్లో ఎన్నికల సామగ్రి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎన్నికల సామగ్రిని ప్రత్యేక గోదాముల్లో భద్రపరుస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక గోదాములో ఎన్నికల్లో ఉపయోగించిన స్టాట్యుటరీ కవర్స్, ఫారాలు, రిజిస్టర్లు వంటి ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచే కార్యక్రమాన్ని బుధవారం అధికారులతో కలిసి కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల సామగ్రిని సురక్షితంగా భద్రపరిచామని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎం, వీవీప్యాట్‌లను పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా గొల్లపూడిలోని ప్రత్యేక గోదాములో భద్రపరుస్తున్నట్లు తెలిపారు.

7 నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ముగియనుంది. గత నెల 27వ తేదీన ఈ కౌన్సెలింగ్ ప్రకియ మొదలైంది. ఈ నెల మూడో తేదీన జరగాల్సిన కౌన్సెలింగ్‌ను ఎన్నికల కౌంటింగ్ కారణంగా గురువారానికి వాయిదా వేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీఏపీ, పీడబ్ల్యూడీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల్లో ఒకటి నుంచి చివరి ర్యాంకు వరకు పొందిన వారి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1,08,001 నుంచి 1,16,000 ర్యాంకు వరకు, ఆంధ్ర లయోల కళాశాలలో 1,16,001 నుంచి చివరి ర్యాంకు వరకు జనరల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేస్తామని పాలిసెట్ - 2024 ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎం.విజయసారథి తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల ఏడు నుంచి పదో తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. 11వ తేదీన ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పిస్తామని, 13వ తేదీ సీట్ల కేటాయింపు వివరాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ లోపు అభ్యర్థులు తమకు కేటాయించిన కళాశాలకు స్వయంగా వెళ్లి రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

వైఎస్సార్ పేరు తొలగించిన టీడీపీ కార్యకర్తలు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ ఎదుట ఉన్న డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ బోర్డును టీడీపీ కార్యకర్తలు మార్చివేశారు. మంగళవారం రాత్రి ఈ చర్యకు పాల్పడ్డారు. వైఎస్సార్ పేరుపై రంగు పూశారు. అధికారులు ఎవరూ ఈ చర్యపై స్పందించలేదు. ప్రభుత్వ కార్యాలయంపై ఎగబడి పేరు మార్చినా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఎన్నికల కోడ్ ఉన్నా టీడీపీ శ్రేణులు తమపై బెదిరింపు ధోరణితో వ్యవహరించినా అధికారులు మౌనంగా ఉండిపోయారు. ఈ విషయమై కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఈ ఘటనపై విచారించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): సురక్షిత మంచినీటి వాడకం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై మొగల్రాజపురం పరిసర ప్రాంతాల ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కలిగిస్తున్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అందులో భాగంగా బుధవారం పది బృందాలు 446 ఇళ్లను సర్వే చేసి, 1,784 మంది ఆరోగ్య స్థితి తెలుసుకున్నాయని పేర్కొన్నారు. డయేరియా కేసులు ఏవీ నమోదు కాలేదన్నారు. వైద్య శిబిరాల్లో సాధారణ వ్యాధులకు కూడా చికిత్స అందిస్తున్నామని వివరించారు. వైద్య బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించి, వ్యాధి వచ్చి తగ్గిన వారి ఆరోగ్య పరిస్థితిపైనా ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి వైద్య సిబ్బంది, మందులు, పడకలను సిద్ధంగా ఉంచామని వివరించారు. డీపీఎంఓ డాక్టర్ నవీన్, జిల్లా ఏపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహ సమీర, రాష్ట్ర, జిల్లా ఏపిడిమిక్ విభాగం ప్రతినిధులు, రెపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు, స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ఉష్మాన్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ సునీల్, డాక్టర్ రాజ, డాక్టర్ నరేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడివరిగా సాగుకు..

- ఖరీఫ్‌కు పొలాలు సిద్ధం చేస్తున్న రైతులు
- అక్కడక్కడా ఇప్పటికే మొదలైన పత్తి సాగు
- ఖరీఫ్‌కు కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పొలాలను దుక్కులు దున్ని పంటల సాగుకు విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. మే నెలలో కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంత రైతులు పత్తి విత్తనాలు నాటారు. రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకడం, ఆవర్తన ప్రభావంతో జిల్లాలో కొద్ది రోజులగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఖరీఫ్–2024కు కార్యాచరణ రూపొందించింది. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. వరి, పచ్చిరొట్ట విత్తనాలను అవసరమ మేరకు సిద్ధం చేసింది. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఎటువంటి కొరతా లేకుండా అందించేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసింది.

మే నెలలో వర్షం

బంగాళా ఖాతంలో అల్పపీడనం, ద్రోణుల ప్రభావంతో జిల్లాలో మేతోపాటు ఈ నెలలోనూ వర్షాలు కురిశాయి. మే పదో తేదీన జిల్లాలో 20.34 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. 12న 6.04 మిల్లీమీటర్లు, 14న 3.12, 16న 6.26, 17న 3.78, 19న 6.24, 23న 4.19, 24న 13.42, 25న 13.95, జూన్ రెండో తేదీన 29.85 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం కురిసింది. దీంతో రైతులు తమ పొలాలను ఖరీఫ్ పంటలకు సాగు చేశారు. ఈ ఏడాది రుతు పవనాలు తొందరగా రావడంతో అనుకూల వాతావరణం నెలకొంది.

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 97,340 హెక్టార్లు

ఈ ఏడాది ఖరీఫ్‌లో 97,340 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధాన పంటలైన వరి 48,606 హెక్టార్లు, పత్తి 39,368 హెక్టార్లు, పప్పుధాన్యాలు (పెసర, మినుము, కంది) 5,377 హెక్టార్లు, మొక్కజొన్న 3,434 హెక్టార్లు, చెరకు 484 హెక్టార్లు, ఇతర పంటలు 71 హెక్టార్లలో సాగవుతాయని ప్రకటించింది. ఆయా పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, పచ్చిరొట్ట, ఎరువులను రైతులకు జిల్లా వ్యవసాయశాఖ అందుబాటులో ఉంచింది.

74,823 టన్నుల ఎరువులు అవసరం

జిల్లాలో ఈ ఖరీఫ్ కాలానికి 74,823 టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే 46,251 టన్నులు అందుబాటులోకి తెచ్చారు. నెలవారీ ప్రణాళిక ప్రకారం అవసరమైన ఎరువులను రైతుభరోసా కేంద్రాలు, సొసైటీలు, డీలర్ల వద్ద అందుబాటులో ఉంచుతారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

సార్వా పంట కాలానికి భూమి సత్తువని, ఉత్పత్తి సామర్థ్యం పెంపొందించడానికి పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ శాఖ 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను పంపిణీచేస్తోంది. ఎన్టీఆర్ జిల్లాకు మొత్తం 5,192 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. జీలుగ 3,710 క్వింటాళ్లు, పిల్లిపెసర 1,333 క్వింటాళ్లు, జనుము 149 క్వింటాళ్లు సిద్ధం చేసింది. జీలుగ, జనుము విత్తనం కిలో ధర రూ.88 కాగా 50 శాతం రాయితీతో రూ.44కు, పిల్లిపెసర కిలో ధర రూ.134లకు గాను రూ.67లకు రైతులకు సరఫరా చేస్తోంది. పలు ప్రాంతాల్లో ఇప్పటికే రైతులు పచ్చిరొట్ట పైర్లు వేశారు. మరికొన్ని ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా పిల్లిపెసర, జీలుగ విత్తనాల పంపిణీ జరుగుతోంది.

అందుబాటులో వరి విత్తనాలు

ఈ సార్వా సీజనులో 48,606 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగుకానున్న నేపథ్యంలో బీపీటీ 5204 వరి రకం 1250 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 4,500 క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం 1250 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం 800 క్వింటాళ్లు చొప్పున రైతులకు అందుబాటులో ఉంచింది. కిలోకు రూ.5 చొప్పున వంగడాలను రైతులకు పంపిణీ చేయనుంది.

రైతులకు ఇబ్బంది లేకుండా..



ఈ ఏడాది ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేశాం. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాం. పచ్చిరొట్ట పైర్ల సాగుకు అవసరమైన విత్తనాలను రాయితీపై అందజేస్తున్నాం. ఇప్పటికే రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను రైతులు తీసుకెళ్తున్నారు. ఎరువులు, విత్తనాల విషయంలో రైతులకు ఎటువంటి లోటు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నాం.

– సాకా నాగమణెమ్మ, జిల్లా వ్యవసాయాధికారి, ఎన్టీఆర్ జిల్లా

ప్రకృతిని రక్షిద్దాం.. భావితరాలకు ఆదర్శంగా నిలుద్దాం



పర్యావరణ దినోత్సవంలో మాట్లాడుతున్న ఏపీ పీసీబీ మెంబర్ సెక్రటరీ శ్రీధర్



పర్యావరణ పరిరక్షణను బుర్రకథ రూపంలో వివరిస్తున్న కళాకారులు

ఏపీ పీసీబీ మెంబర్ సెక్రటరీ శ్రీధర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రకృతిని రక్షించి, భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్య కార్యదర్శి బి.శ్రీధర్ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎస్ఏసీ కల్యాణ మండపంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ.. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. ప్లాస్టిక్, వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన లేకపోతే భావితరాల భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసినవాళ్లమవుతామని హెచ్చరించారు. ప్రధానంగా మట్టి, నీరు, గాలి కలుషితం కాకుండా చర్యలు తీసుకునేలా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. 1972 నుంచి జూన్ ఐదో తేదీన పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో పర్యావరణ రక్షణకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జేఎన్‌టీయూ కాకినాడ అకడమిక్ డైరెక్టర్ కె.వి.ఎస్.జి. మురళీకృష్ణ మాట్లాడుతూ.. మానవుల ప్రవర్తన ప్రకృతి హితంగా ఉండాలని, పుడమి ఇచ్చిన అవకాశాన్ని నాశనం చేసుకోరాదని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ కె.కామేశ్వరరావు మాట్లాడుతూ.. సహజ వనరులు వృథా చేసుకోవడం క్షమించరాని నేరమన్నారు. పర్యావరణంపై ప్రేమ పెంచుకోవాలని కోరారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే ఒక ఉద్యమంలా ప్రారంభించేలా ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేసి మనసా వాసా కర్మణా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఎస్.వి.భాస్కరరావు, పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు ఎ.వి.రత్నం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయ అధికారి, జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పి.మునిస్వామి నాయుడు, ప్రాంతీయ కార్యాలయ అధికారి పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

8న చేప మందు పంపిణీ



మహమూద్ ఆలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృగశిర కార్తె సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులకు వనమూలికలతో తయారు చేసిన చేప మందును ఉచితంగా పంపిణీ చేస్తామని మహ్మద్ మసూద్ ఆలీ జిన్నా, మహ్మద్ మహమూద్ ఆలీ బుధవారం తెలిపారు. కొండపల్లిలో జనాహాజీ హకీమ్ మహ్మద్ యూసఫ్ ఆలీ 1920 ఏడాది నుంచి చేప మందు ఉచితంగా పంపిణీ చేసి ఎందరికో వ్యాధిని నయం చేశారని పేర్కొన్నారు. ఆయన మరణానంతరం తమ వంశీకుల ద్వారా 103 ఏళ్లుగా చేపమందు అందిస్తున్నట్లు వివరించారు. వరుసగా మూడేళ్లు చేప మందు తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని సూచించారు. మందు తీసుకున్న వారు జున్ను పాలు, వాలుగ చేప, బూడిద గుమ్మడికాయ, వంకాయ, గోంగూరను దీర్ఘకాలం తీసుకోకూడదని స్పష్టంచేశారు. మందుకోసం వచ్చేవారు ఆ రోజు ఉదయం ప్రాణంతో ఉన్న బురద మట్ట, కొరమేను చేపపిల్లను తీసుకుని రావాలని సూచించారు.

నార సంచుల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో గుడ్డ, నారతో చేసిన పర్యావరణహిత సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని అరికట్టాలన్నారు. గుడ్డ, నారతో చేసిన సంచులనే వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.



గుడ్డ, నార సంచులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం వాహనం అందజేత

చల్లపల్లి: మండల కేంద్రమైన చల్లపల్లి గ్రామానికి హైదరాబాద్ సన్‌షైన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి రూ.5 లక్షల విలువైన ట్రక్కుతో కూడిన మినీ ట్రాక్టర్ (మహా ప్రస్థానం వాహనం)ను బుధవారం అందజేశారు. గ్రామస్థులు ఎవరైనా చనిపోతే వారి భౌతిక కాయాలను అంత్యక్రియల కోసం తరలించేందుకు, తన తల్లిదండ్రులు అన్నపరెడ్డి రాజ్యలక్ష్మి, సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఈ వాహనాన్ని అందజేశారు. గతంలో డాక్టర్ పోతిన రమేష్, మహాలక్ష్మి విరాళంతో చల్లపల్లికి సమకూరిన మహాప్రస్థానం వాహనాన్ని గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు. తాజాగా డాక్టర్ గురవారెడ్డి దాతృత్వంతో మరో వాహనం సమకూరింది. ఈ వాహనాలను స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, మనకోసం మనం ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్నారు. దాతృత్వం చూపిన డాక్టర్ గురవారెడ్డికి స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి దంపతులు ధన్యవాదాలు తెలిపారు.



గురవారెడ్డి సమకూర్చిన వాహనం

లీటరు పెట్రోలు రూ.150

- మూతబడిన రెండు పెట్రోల్ బంక్‌లు
- ఎన్నికల కోడ్‌ను ధిక్కరించి బాటిళ్లు, క్యాన్లలో నింపుతున్న బంక్ నిర్వాహకులు
- విచారణలో నిజమని తేలడంతో బంక్‌ల మూసివేత
- కోడూరు ప్రాంత వాసులకు పెట్రోలు కష్టాలు



మూడు నెలల నుంచి మూతబడి ఉన్న పద్మనాభ ఫిల్లింగ్ స్టేషన్



నిబంధనలు పాటించకపోవడంతో అధికారుల ఆదేశాలతో విక్రయాలు నిలిపివేసిన కృష్ణాపురం పెట్రోల్ బంక్

కోడూరు: మండల కేంద్రంలో ఉన్న రెండు పెట్రోల్ బంక్‌లు మూతబడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పద్మనాభ ఫిల్లింగ్ స్టేషన్ (హెచ్‌పీ పెట్రోల్ బంక్)ను వివిధ కారణాల నేపథ్యంలో మూడు నెలల క్రితం జిల్లా ఉన్నతాధికారులు మూసివేశారు. దీంతో కృష్ణాపురం సమీపంలో ఉన్న ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్) మాత్రమే వాహనచోదకులకు పెట్రోల్, డీజిల్‌ను అందిస్తోంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెట్రోల్‌ను ఖాళీ సీసాలు, క్యానుల్లో నింపవద్దంటూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నిబంధనలను ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు ధిక్కరిస్తూ యథేచ్ఛగా క్యాన్లు, సీసాల్లో పెట్రోల్ నింపుతున్నట్లు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా కలెక్టర్ ఈ విషయంపై విచారణకు ఆదేశించారు. ఆదిత్య ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులు క్యానుల్లో పెట్రోల్ నింపడం నిజమేనని తేలడంతో కలెక్టర్ ఆదేశాలతో స్థానిక రెవెన్యూ అధికారులు బంక్‌లో పెట్రోల్, డీజిల్ విక్రయాలను పూర్తిగా నిలిపివేశారు. మండల కేంద్రంలో ఉన్న రెండు పెట్రోల్ బంక్‌లు మూతబడడంతో వాహనచోదకులు పెట్రోల్ దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనిపై బయటకు వెళ్లేందుకు కూడా వాహనాల్లో పెట్రోల్ ఉండడం లేదని వాహనదారులు వాపోతున్నారు. పెట్రోల్ లేక వాహనాలు ఆగిపోతే వాటికి పెట్రోల్ తెచ్చుకొనేందుకు కూడా బయట బంక్‌లోని నిర్వాహకులు బాటిళ్లలో పెట్రోల్ కొట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు బంక్‌లు మూతబడడంతో బ్లాక్ మార్కెట్‌లో పెట్రోల్‌ను విక్రయిస్తున్న పరిస్థితులు కూడా కొనసాగుతున్నాయి. కోడూరు తూర్పువైపున లీటర్ పెట్రోల్‌ను రూ.150 వరకు విక్రయిస్తున్నారని, చేసేది లేక అధిక డబ్బులు చెల్లించి వాహనాల్లో పెట్రోల్ నింపుకొంటున్నామని వాహనదారులు బాహాటంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాహనచోదకులకు పెట్రోల్ కష్టాల నుంచి విముక్తి లభించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలి



మొక్క నాటి నీరుపోస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక తదితరులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో అరుణసారిక మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొక్కలను పెంచటం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. వాతావరణంలో మార్పులు రావటం వల్ల సకాలంలో వర్షాలు పడతాయన్నారు. ప్రజల్లో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తకుండా ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు ఇంటికో చెట్టును పెంచి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ రామకృష్ణ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ జయశ్రీ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి ముసలయ్య, న్యాయవాదులు కె.గోపాలకృష్ణ, మణికంఠ, ఎస్.ప్రియసుధ, కె.నాగ శ్రీనివాసరావు, గోవర్ధనమ్మ, శ్రీదేవి, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఏపీగా గుడివాడ స్టేడియం క్రీడాకారుడు



గుడివాడటౌన్: రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ క్రీడాకారుడు పి.జాన్‌బాబు స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టైటిల్ కైవసం చేసుకున్నాడని స్టేడియం మేనేజర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. తాము సాధించిన పతకాలను క్రీడాకారులు బుధవారం మీడియా ఎదుట ప్రదర్శించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ నెల రెండు, మూడు తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పి.జాన్‌బాబు 66 కిలోల విభాగంలో 525 కిలోలు, కె.జీవన్ కుమార్ 74 కిలోల విభాగంలో 345 కిలోల బరువు ఎత్తి బంగారు పతకాలు, నక్కా వీరనాగఅను 47 కిలోల విభాగంలో 165 కిలోల బరువును ఎత్తి కాంస్యం, పి.స్వాతిశ్రీ 85 కిలోల విభాగంలో 200 కిలోల బరువు ఎత్తి వెండి పతకం సాధించారని వివరించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు, కోచ్ మార్నెళ్ల వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ జంపా ఉషాకుమారిని స్టేడియం పాలకవర్గం ఈ సందర్భంగా అభినందించింది.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ డివిజన్ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు చేట్టారు. ఏడీఆర్ఎంలు పీఈ ఎడ్విన్, కొండ శ్రీనివాసరావులతో కలసి డీఆర్ఎం క్లాక్ టవర్ నుంచి ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంలోని బాపజీ వెయిటింగ్ హాల్ వరకు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ పరిసరాలలో మొక్కలు నాటి ఉద్యోగుల చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంధన సంరక్షణలో విజయవాడ డివిజన్ సాధించిన విజయాలతో కూడిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ పర్యావరణ లక్ష్యాలు సాధించేందకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడం వల్ల ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించాలని కోరారు. ఇటీవల స్వచ్ఛతా పఖ్వాడా 2023లో దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో విజయవాడ డివిజన్‌కు మూడో స్థానం రావటంపై ఎన్‌హెచ్ఎం విభాగం అధికారుల కృషిని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అనంతరం పర్యావరణ హితమైన గుడ్డ సంచులకు ప్రయాణికులకు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రదర్శించిన 'బీట్ ది ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై ప్రదర్శించిన నాటకానికి ప్రయాణికుల నుంచి విశేషమైన స్పందన లభించింది. రైల్వే హాస్పిటల్ సీఎంఎస్ డాక్టర్ సారిబాల పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ పరిసరాలలో మొక్క నాటి నీరుపోస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

క్లుప్తంగా

నీట్ ఫలితాల్లో శారదా విద్యార్థుల ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్–2024 ప్రవేశ పరీక్ష ఫలితాలలో తమ విద్యాసంస్థలోని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు పొందారని శారదా విద్యాసంస్థల చైర్మన్ వై.రమేష్‌బాబు చెప్పారు. నీట్–2024 ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను స్థానిక మొగల్రాజపురంలోని శారదా కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ సీనియర్ బైపీసీ విద్యార్థులు జాతీయస్థాయిలో యు. నాగపవన్(656వ ర్యాంకు), వీటీ కార్తీక్ (632), పి.ఇందూరెడ్డి (621), పి.రమ్య నాగసాయి(606), ఆర్.సిందుసిరి (602) ర్యాంకులు పొందారని చెప్పారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ తమ విద్యాసంస్థకు చెందిన 150 మంది విద్యార్థులు నీట్–2024 ప్రవేశ పరీక్ష రాశారని, వారిలో 75 మంది మెడికల్ సీటు సాధించే మార్కులు పొందారని చెప్పారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను కళాశాల యాజమాన్యంతో పాటు విద్యాసంస్థల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జనరల్ మేనేజర్ జీవీ రావు అధ్యాపకులు అభినందించారు.

సిబ్బందికి ఎస్పీ అభినందనలు

కోనేరుసెంటర్: జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషి చేసిన జిల్లా పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రకటన విడుదల అయిన నాటి నుంచి పోలింగ్‌తో పాటు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థంగా నిర్వర్తించి కృష్ణాజిల్లా పోలీసుశాఖ ప్రతిష్టను పెంపొందించారన్నారు. ఎన్నికల బందోబస్తుకు సంబంధించి జిల్లాకు వచ్చిన ప్రత్యేక బలగాలు పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అల్లర్లు, అలజడులకు అవకాశం లేకుండా విధులను నిర్వర్తించటం అభినందనీయమన్నారు.

జిల్లా కోర్టు ప్రత్యేక పీపీ జితేంద్ర రాజీనామా

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా కోర్టు ప్రత్యేక పీపీ వడ్డి జితేంద్ర బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, హోం సెక్రటరీలకు లేఖను పంపారు. 2024 ఫిబ్రవరి 14వ తేదీన డిపాజిట్స్, ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ కేసులకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఈయన నియమితులయ్యారు. ఈయన కాలపరిమితి 2027 ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఉంది.

నారు దశ.. జాగ్రత్తలే రక్ష

- వరినారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- అప్పుడే నాణ్యమైన దిగుబడులకు ఆస్కారం
- గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి సూచనలు



వరి నారుమడుల తయారీ



గుడ్లవల్లేరు: వరినారు పోసే రైతులు కొన్ని జాగ్రత్తలు పాటించి నారుమళ్లను పోసుకుంటే నాణ్యమైన నారును పొందవచ్చు. నారుమడి యాజమాన్య పద్ధతులను గుడివాడ వ్యవసాయ అధికారి బోలెం అనంతలక్ష్మి సూచిస్తున్నారు. ఆ వివరాలు ఇవి..

నారుమడి తయారీ ఇలా..

దమ్ము చేసిన నేలలో 10మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పుతో నారుమడిని చేసుకోవాలి. నారుమడిలోని నీరు, పోషకాలు బయటకు పోకుండా గట్లు వేసుకోవాలి. గట్లు సమంగా, గట్టిగాను పోయాలి. మడిలో చెత్తాచెదారం లేకుండా జాగ్రత్త పడాలి. నారుమడి బురద పదునులో ఉండాలి. నారుమడులు ఎత్తుగా ఉండేలా జాగ్రత్త పడాలి. రెండు మడుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పుతో కాలువ తీయాలి. కాలువలోని మట్టిని తీసి మడిలో వేసే నారుమడిని ఎత్తుగా చేసుకోవాలి. నారుమడి మొత్తం చదునుగా ఉండాలి. నారుమడి 10నుంచి 12రోజుల ముందే దమ్ము చేసి చదును చేసుకోవాలి. నీరు పెట్టడానికి, తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు పూర్తిగా పురి విప్పుకునే వరకు ఆరుతడులు ఇచ్చి.. తర్వాత పలుచగా నీరు నిల్వ కట్టాలి. జింకు లోపాన్ని గమనించి 2గ్రాముల జింకు సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే ఈ జింకు లోప లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. తల్లి పురుగులు గుడ్లను కొసల మీద పెడుతుంది. నారు నాటేటపుడు కొసలు విరిచి నాటాలి. దీనితో గుడ్లను నిర్మూలించవచ్చు.

విత్తన మోతాదు..

నాటే పద్ధతికి 20నుంచి 25కిలోలు వెదజల్లడానికి విత్తనాలను వినియోగించవచ్చు. గరువు భూముల్లో 24నుంచి 30కిలోలను వాడవచ్చు. సహజంగా వెదజల్లడానికి 16నుంచి 30కిలోలు సరిపోతాయి. గొర్రుతో విత్తటానికి (వర్షాధారపు వరి)కి సంబంధించి 30 నుంచి 36కిలోల అవసరం ఉంటుంది. శ్రీపద్ధతిలో రెండు కిలోలే సరిపోతాయి.

విత్తన శుద్ధి..

కిలో విత్తనానికి 2.5గ్రాముల కార్బండిజమ్ కలిపి 24గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లకైతే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజమ్‌ను కలపాలి. ఆ ద్రావణంలో విత్తనాలను 24గంటల నానబెట్టాలి. మరో 24గంటల పాటు మడె కట్టి మొలకలను దంప నారుమడిలో చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి లీటరు నీరు సరిపోతుంది. పది లీటర్ల నీటికి 1.5కిలోల ఉప్పు కలపగా వచ్చిన ద్రావణంలో ఎంపిక చేసుకున్న విత్తనాన్ని పోసి పైకి తేలిన తాలు విత్తనాలను తొలగించాలి. ఉప్పు నీటిలో మునిగిన గట్టి విత్తనాలను నారు పోయడానికి వాడుకోవాలి. మడిలో చల్లే ముందు 24గంటల పాటు మంచినీటిలో విత్తనాలను నానబెట్టాలి. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణ కోసం కిలో విత్తనానికి 3గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో చల్లే ముందు మొలకెత్తిన విత్తనాన్ని 0.2శాతం క్లోరిఫైరిఫాస్ ద్రావణంలో నానబెట్టి చల్లుకోవాలి. దీని వల్ల నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

సస్యరక్షణ ఇలా..

విత్తిన 10రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6మిల్లీలీటర్లు లేదా క్లోరిఫైరిఫాస్ 2.0మిల్లీలీటర్లను లీటరు నీటికి కలిపి విత్తన 10రోజుల నుంచి 17రోజులకు పిచికారీ చేయాలి. లేదా నారు తీయటానికి వారం రోజుల ముందు సెంటు నారుమడికి 160గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలు తక్కువ నీటిలో వేయాలి.

ఎరువుల యాజమాన్యం..

నారుమడులు పోయాలనుకున్న భూములకు వేసవి దుక్కికి ముందుగానే పశువుల ఎరువును వేయాలి. నారుమడులు పోయడానికి పొలంలో 10వ భాగాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న పొలానికి నీరు పెట్టి బాగా కలియదున్నాలి. తర్వాత మట్టి గడ్డలన్నీ మెత్తగా అయ్యేలా బాగా దమ్ము చేయాలి. మొక్కలు లేకుండా జాగ్రత్త పడాలి. 5సెంట్ల నారుమడికి 2కిలోల నత్రజనిని ఒక కిలో విత్తనం చల్లే ముందు మరో కిలో విత్తిన 12నుంచి 14రోజులకు ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ ఇచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భాస్వరం రెట్టింపు చేసుకోవచ్చు.

విజయోత్సవ ర్యాలీలో టీడీపీ దాడులు

వైఎస్సార్ సీపీకి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు



కనుమలచెరువులో విజయోత్సవ ర్యాలీలో దాడులకు పాల్పడుతున్న టీడీపీ శ్రేణులు

బొల్లాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపొందిన తర్వాత పల్నాడు జిల్లా, బొల్లాపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు చేస్తూ దాడులకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ వారు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని కనుమలచెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ విజయోత్సవం చేసుకుంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటంతో తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలో ర్యాలీ చేస్తూ ఎస్సీ కాలనీకి చేరుకొని ఒక్కసారిగా దాడి చేశారని, ఈ దాడిలో కె.నవీన్, కె.బెన్నితో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయని బాధితులు తెలిపారు. వీరిని వినుకొండలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత వైఎస్సార్ సీపీ వారు తెలిపారు. బండ్లమోటు ఎస్ఐ డి. చెన్నకేశవులును వివరణ కోరగా విజయోత్సవ ర్యాలీ ఘర్షణకు దారి తీసిందని పేర్కొన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

జంగమహేశ్వరపాడులో నాలుగిళ్లు ధ్వంసం

దుర్గి: పల్నాడు జిల్లా, దుర్గి మండలంలోని సమస్యాత్మక గ్రామమైన జంగమహేశ్వరపాడులో బుధవారం టీడీపీ శ్రేణులు దాడి చేసి వైఎస్సార్ సీపీకి నాయకులకు చెందిన నాలుగు ఇళ్లను ధ్వంసం చేశారు. ఈ దాడికి ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దం వచ్చింది. దీంతో మహిళలు, పిల్లలు, ఇరుగుపొరుగు వారు బయటకు పరుగులు తీశారు. ఘటనకు సంబంధించిన బాధిత కుటుంబ మహిళలు, పిల్లలు ఊరి నుంచి వెళ్లి పోయారు. మాచర్ల నుంచి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. గతంలో అనేక పర్యాయాలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ఈ గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. అయినా ఈ ఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ శ్రేణుల నుంచి తమ ఇళ్లకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని పోలీస్ అధికారులకు బాధిత కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు. పటిష్ట కేంద్ర బలగాలతో నిరంతరం ఇళ్ల సోదాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు చేష్టలతో శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతోంది.

మొక్కల నాటడంలో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్



జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు పత్రాలు అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఎస్ఎన్‌జీ ఫౌండేషన్ సహకారంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. రైల్వే వ్యాగన్‌వర్క్‌షాపు చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 72 సెకన్లలో 1800 మొక్కలు నాటి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు పెంపకం సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సంస్థ ప్రతినిధులు అవార్డు అందజేశారు.

ప్రకృతిని రక్షించుకుందాం..



పర్యావరణ పరిరక్షణ పోస్టర్లను ప్రదర్శించిన విద్యార్థులతో అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణ

అప్‌కాస్ట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రకృతిని రక్షించుకునేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై. అపర్ణ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భవానీపురంలోని అప్‌కాస్ట్ రీజనల్ సైన్స్ సెంటర్‌లో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మైనం హుస్సేన్ నేతృత్వంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు 'మొక్కలను నాటుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం.. ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదాం – పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం' అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించటం, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించటాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు విత్తనాలకు సంబంధించిన సీడ్ బాల్స్ అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు ఆదేశాల మేరకు విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌సీ పీఓ ఢిల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ, జిల్లా డీసీబీ సెక్రటరీ ఉమారాణి పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం



గౌరవరంలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం

గౌరవరం(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికలలో కూటమి విజయం సాధించటంతో రోజురోజుకు టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలు, ఆగడాలు మితిమీరుతున్నాయి. గ్రామంలో మంగళవారం రాత్రి గ్రామ సచివాలయం వద్దనున్న శిలాఫలకాన్ని టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. కూటమి అభ్యర్థి విజయం సాధించటంతో రాత్రి 11 గంటల సమయంలో ర్యాలీలు చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, సచివాలయం వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఫొటోలతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. పోలీసుల స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తిరుమలగిరిలో..

గ్రామంలోని టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్ల వద్దకు వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో చిల్లకల్లు ఎస్ఐ సతీష్ అక్కడకు చేరుకుని సర్ది చెప్పారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కోనూరులో ఎస్సీ కాలనీలపై దాడులు





చికిత్స పొందుతున్న గుడేటి మీన, వేమవరపు పున్నమ్మ

అచ్చంపేట: పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలంలోని కోనూరులో టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి ఎస్సీ కాలనీలపై దాడులకు దిగడంతో పలువురికి గాయాలయ్యాయి. ఫ్యాను రెక్కలు విరిగిపోయాయంటూ హేళన చేస్తూ సైకిల్‌కు కట్టుకుని వీధులలో తిరిగారు. అడ్డు వచ్చిన ఎస్సీ కార్యకర్తలపై దాడులు చేశారు. గాయాలపాలైన బాధితులు సతెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేమవరపు యోషోవా, వేమవరపు పున్నమ్మ, గుడేటి మీన తదితరులున్నారు. ఈ గ్రామంలో గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి 307 ఓట్ల మెజారిటీ రాగా, ఈ సారి టీడీపీకి 270 ఓట్లు రావడంతో గ్రామస్తులు పలు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు. అచ్చంపేట సీఐ షేక్ కరీముల్లా షావలి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతి పరుడి స్కూటీ దగ్ధం

చేబ్రోలు: గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం వడ్లమూడిలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడికి చెందిన స్కూటీకి గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పు పెట్టారు. వడ్లమూడి దళితవాడకు చెందిన జోసఫ్ ఉరఫ్ తంబి స్కూటీపై గ్రామం నుంచి క్వారీ గుడి రోడ్డులో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ముఖానికి గుడ్డలు కట్టుకున్న ఐదుగురు జోసఫ్‌తో వాగ్వివాదానికి దిగారు. స్కూటీ ముందు భాగంలో వైఎస్సార్ సీపీ స్టిక్కర్‌ను తొలగించాలని బెదిరించారు. అభ్యంతరం తెలపటంతో వాహనంపై పెట్రోలు పోసి నిప్పుపెట్టి పరారయ్యారు. ఘటనపై కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలిపాడు. గత ఏడాది కొనుగోలు చేసి స్కూటీ దహనం కావడంతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. బాధితుడు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించనున్నట్లు వివరించారు.

గోతిలో పడి ద్విచక్ర వాహనదారుడు మృతి

వేమవరం(వత్సవాయి): బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పి గోతిలో పడిపోవడంతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. పెనుగంచిప్రోలుకు చెందిన మందా కార్తీక్(22) వేమవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి సమయంలో వేమవరం వచ్చి తిరిగి పెనుగంచిప్రోలు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయాడు. దీంతో అదుపుతప్పి గోతిలో పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎస్ఐ బి. అభిమన్యు కేసు నమోదు చేశారు.

డైట్ కళాశాల ఉద్యోగి మృతి



గుడివాడ టౌన్: గుడ్లవల్లేరు మండలం అంగలూరు డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రేమల్లి సునీల్ కుమార్(43) బుధవారం మృతిచెందారు. గత మూడు రోజులుగా గుండెకు సంబంధించిన ఇబ్బందితో బాధపడుతున్న ఆయన విజయవాడలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్ను మూశారు. సునీల్ కుమార్‌కు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం పెదపారుపూడి లోని ఆయన స్వగ్రామంలో జరుపుతారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, డీవైఈఓ కార్యాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

పెన్షనర్లు ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలి

కంచికచర్ల : ప్రభుత్వ పెన్షనర్స్ 2023–2024 ఆర్థిక సంవత్సరానికి జూలై 31వ తేదీలోగా ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం రిటైర్డ్ ఎంప్లాయీస్‌తో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పద్ధతి ప్రకారం రూ.7.50 లక్షల వరకు ఇన్‌కం ట్యాక్స్ చెల్లించనవసరం లేనప్పటికీ, ప్రస్తుతం పాత పద్ధతే అమలు చేస్తున్నందున రూ.3.50లక్షలు దాటితే తప్పనిసరిగా ఇన్‌కంట్యాక్స్ జూలై 31లోగా చెల్లించాలన్నారు. ఇన్‌కం టాక్స్ సబ్ ట్రెజరరీలో కటింగ్ అయినవారు ఫారం–16ను తీసుకుని రిటర్న్ దాఖలు చేయాలన్నారు. తప్పనిసరిగా గడువు తేదీలోగా ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయాలని సూచించారు. సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, పెద్దినీడి కోటేశ్వరరావు, చలసాని నాగేశ్వరరావు, స్వర్ణలత, లక్ష్మీనారాయణ, జానీ మియా, మొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఐలా' ఆదాయానికి గండి!

- మురుగు కాలువలపై చిరువ్యాపారాలు
- వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో అద్దె వసూలు చేస్తున్న వైనం
- పట్టించుకోని ఐలా అధికారులు



పంటకాలువ రోడ్డులో నిర్వహిస్తున్న దుకాణాలు



డ్రైయినేజీ కాలువపై ఉల్లిపాయల విక్రయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): వారి ఇళ్ల ముందు డ్రైయినేజీ కాలువలపై వ్యాపారాలు చేయాలంటే నెలవారీ అద్దె ఇవ్వాల్సిందే. లేకుంటే ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి చాన్స్ లేదు. అది కూడా వారు అడిగినంత అద్దె ఇవ్వాలని డ్రైయినేజీ ముందు ఉన్న స్థల యజమానులు హుకుం జారీ చేస్తున్నారు. చిరు వ్యాపారులకు గత్యంతరం లేకపోవడంతో పెద్ద మొత్తంలో అద్దె చెల్లిస్తున్నారు. ఇది గత కొంతకాలంగా ఆటోనగర్‌లో జరుగుతున్న తంతు. నెలకు రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పైగా చిరు వ్యాపారుల నుంచి అద్దెలు వసూలు చేస్తున్న పరిస్థితి. ఈ విషయమై సంబంధిత ఐలా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా మాజీ ఐలా పాలకవర్గ సభ్యులు పలువురి కనుసన్నల్లో జరుగుతుందని ప్రచారం జరుగుతోంది. జవహర్ ఆటోనగర్‌లో చిరు వ్యాపారులు పడరాని పాట్లు పడుతున్నారు. వ్యాపారాలకు కాస్త స్థలం దొరకని దుస్థితి ఇక్కడ నెలకొని ఉంది. దీంతో పంటకాలువ వంద అడుగుల రోడ్డు పక్కన ఉన్న మురుగు కాలువలపై వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు నెల నెలకు రూ.వేలల్లో అద్దెలు వసూలు చేస్తున్నారు. డ్రైయినేజీ కాలువపై సిమెంట్ బల్లలు వేసి వ్యాపారాలు చేస్తున్నారు. తమ స్థలాల ముందు ఉన్న డ్రైయినేజీ కాలువలపై వ్యాపారులకు అద్దెకు ఇచ్చి యజమానులు పెద్ద మొత్తంలో అద్దె వసూలు చేస్తున్నారు. పంటకాలువ రోడ్డులో ఉల్లిపాయలు, క్రీస్ పాయింట్లతో పాటు బిస్కెట్లు తయారు చేస్తున్నారు. దీంతో డ్రైయినేజీలోని మురుగు మాత్రం అడుగు ముందుకు కదలడంలేదు. వ్యాపారాలు మాత్రం బాగానే సాగుతున్నాయి.

ఐలా అనుమతులు లేవు..

డ్రైయినేజీ కాలువలపై చిరువ్యాపారులు చేస్తున్నప్పటికీ వీరి నుంచి ఐలా(ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ) అధికారులు మాత్రం ఒక్క పైసా కూడా పన్నుల రూపంలో వసూలు చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. డ్రైయినేజీ ఐలా స్థలం అయినప్పటికీ సంబంధిత యజమానులు చిరు వ్యాపారుల నుంచి అద్దెలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి మురుగు కాలువపై వ్యాపారాలు చేయాలంటే ఐలా అనుమతి ఉండాలి. అలాంటివేమి తీసుకోవడంలేదు. వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకోవడంలేదు. కనీసం ఇక్కడ వ్యాపారాలు చేసే వారి నుంచి కచ్చితంగా ఐలా అధికారులు పన్ను వేయాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఐలాకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

రోడ్ల మీద గాని, డ్రైయినేజీ కాలువలపై వ్యాపారాలు చేసుకునేందుకు ఎవ్వరికీ అనుమతులు ఇవ్వలేదు. వ్యాపారుల వారి నుంచి అద్దె వసూలు చేస్తే అలాంటి వారిపై చర్యలు తప్పవు. డ్రైయినేజీ కాలువలపై ఏయే ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్నారో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– మధు, ఐలా కమిషనర్

విజ్ఞానాన్ని సమాజాభివృద్ధికి వినియోగించాలి

- ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఇంజినీర్ శంకర్‌నాయక్
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విజ్ఞానాన్ని సమాజాభివృద్ధికి వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఇంజినీర్ ఎస్.శంకర్‌నాయక్ అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం, ఎనర్జీ కన్జర్వేషన్ క్లబ్, ఏకో క్లబ్, గ్రీన్ క్లబ్, సైకిల్ క్లబ్ సంయుక్తంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఎస్.శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

కాలుష్య నియంత్రణకు సహకరిస్తాం..

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాలుష్య నియంత్రణ ఏవిధంగా చేయాలనే అంశాలపై విద్యార్థులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నీరు, గాలి, నేల కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు సహకరిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల, ఫిజిక్స్ విభాగాధిపతి టి.శ్రీనివాసకృష్ణ, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు జె.పాండురంగారావు, శ్రావణి, శివనాగరాజు, ఐ.వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

వ్యర్థాలు తొలగించిన ఎన్‌సీసీ విద్యార్థులు

చదువుతో పాటుగా సోషల్ సర్వీస్ యాక్టివిటీస్‌లో కూడా యువత ఉత్సాహంగా పాల్గొనాలని ఫోర్ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్ధార్థ కళాశాల ఫోర్ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో కృష్ణానది ఒడ్డున ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను ఎన్‌సీసీ క్యాడెట్లు బుధవారం తొలగించారు. కార్యక్రమాన్ని బలిందర్ సింగ్ పర్యవేక్షించారు. లెఫ్టినెంట్ రోహిణితో పాటుగా ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.


సిద్ధార్థ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న శంకర్‌నాయక్, సిద్ధార్థ అకాడమీ ప్రతినిధులు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యాన బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. నేడు పెరిగిపోతున్న కాలుష్యాన్ని అదుపు చేయాలంటే మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మొక్కలు పెంచటం అలవాటు చేసేందుకు తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, వ్యాయామ అధ్యాపకులు మండవ కోటేశ్వరరావు, యుగంధర్, నాగార్జున ఎన్టీఆర్ జిల్లా యువజన శాఖ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణానది ఒడ్డున ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కోవిడ్ పార్క్ వద్ద అమరావతి వాకర్స్ అండ్ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నది ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక వికాసం నేపథ్యంలో అనేక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఆ క్రమంలో విలాస వస్తువుల నుంచి వచ్చే వివిధ వాయువులు లేదా ఇతర కాలుష్యాల నుంచి పర్యావరణానికి తీవ్రమైన ప్రమాదం వాటిల్లుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు సాధ్యమైనంత వరకూ కాలుష్యాన్ని విడుదల చేసే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా నదీజలాలు కలుషితం కాకుండా అందరూ కృషి చేయాలన్నారు. తాగునీరు కలుషితం కావటం వలన ఇటీవల నగరంలో అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. విద్యార్థులు వాటిపై ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయభాస్కర్ నిర్వహించారు.



కృష్ణానది తీరంలో సిద్ధార్థ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు



విద్యార్థులతో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి


వ్యర్థాలను తొలగిస్తున్న కేబీఎన్ ఎన్‌సీసీ క్యాడెట్లు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థానిక రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ శ్రీనగర్, బెంజ్ సర్కిల్ ఫీడర్ల పరిధుల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఅండ్‌టీ కాలనీలోని 1,2,3, అంతర్గత రహదారులు, చందమామ ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ కాలనీ సర్వీస్ రోడ్డు, కేపీ నగర్, స్టెల్లా కళాశాల ఏరియా, నిర్మలా కాన్వెంట్ ఏరియా, ఓల్డ్ పీఅండ్‌టీ కాలనీ, భద్రయ్య నగర్, బెంజ్‌సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

నీట్‌లో శ్రీ భవిష్య కళాశాల విద్యార్థుల ప్రతిభ


రవళిక మచ్చ (676 మార్కులు)


మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్-2024 ఫలితాల్లో 720 మార్కులకు గాను దేవిరెడ్డి హేమహారిణి-676, రవళిక మచ్చ-676, భార్గవ్ నూతక్కి-673 మార్కులు సాధించారని శ్రీ భవిష్య అకాడమీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 667, 664, 662 వంటి అత్యధిక మార్కులతో పాటు 600 మార్కులకు పైగా 60 మంది, 550కి పైగా 173 మంది, 500కి పైగా 243 మంది, 480కి పైగా 301 మంది, 450కి పైగా 386 మంది తమ విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ ఫలితాలు సాధించగలిగామని నాగేశ్వరరావు చెప్పారు. నీట్-2024 ఫలితాలలో శ్రీ భవిష్య విద్యార్థులు 350లకు పైగా ఎంబీబీఎస్ ఫ్రీ సీట్లను సాధించే అవకాశం ఉందన్నారు. ఈ అత్యుత్తమ ఫలితాలను సాధించినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులను కళాశాల డైరెక్టర్లు జి.వెంకట్రావు, డి.రామమూర్తి, ఎం.రామారావు, టి.సతీష్, లక్ష్మీనారాయణ, కె.కిషోర్‌బాబు, జి.రాజేశ్వరరావు, మూర్తి, పి.సతీష్, ఎం.శ్రీనివాసరావు అభినందించారు.

క్యాన్సర్ శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి కుటుంబానికి వైద్య ఖర్చులకు గానూ బుధవారం సాయి మణికంఠ కేటర్స్ అధినేత జొన్నలగడ్డ రమేష్ బాబు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నగరానికి చెందిన సుబ్బు కుమార్తె చిన్నారి వేముల గీర్వాణి నిత్యశ్రీ క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు. చిన్నారికి శస్త్రచికిత్స సత్వరమే చేయాలని ఇందుకుగానూ రూ.35 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు చెప్పారు. దీంతో రమేష్‌బాబు తన వంతు సాయంగా రూ.25 వేలు చిన్నారి తండ్రి సుబ్బుకు అందజేశారు.

ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లిక, బి.వసంతకుమార్, షఫీవుల్లా అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటడంతో పాటు సంరక్షించటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చెస్ క్రీడాకారుడికి అభినందన



విజయవాడ స్పోర్ట్స్: అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణించి విజయవాడ ఖ్యాతిని నలు దిశల చాటాలని చదరంగం క్రీడాకారుడు టి.నిశ్చల్‌కు సెయింట్ జాన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ తరుణ్ సూచించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అఖిల భారత చిన్నారుల చదరంగం పోటీల్లో విజయవాడకు చెందిన నిశ్చల్ బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో క్రీడాకారుడు నిశ్చల్‌ను ప్రిన్సిపాల్ బుధవారం అభినందించారు. ప్రతిష్టాత్మకమైన జాతీయ పోటీల్లో పతకం సాధించిన స్ఫూర్తితోనే అంతర్జాతీయ క్రీడ వేదికలపైన సత్తా చాటాలని చెప్పారు.

ఎస్పీ బాలు గీతాలు అజరామరం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు పద్మశ్రీ డాక్టర్ శ్రీపాద పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం(ఎస్పీ బాలు) స్వరం చిరస్మరణీయమని, ఆయన స్వరం నుంచి వెలువడిన గీతాలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, గీతాంజలి మ్యూజికల్స్ సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాల్‌లో నిర్వహించిన దశకంఠుడు ఎస్పీ బాలు స్వరాభిషేకం కార్యక్రమం శ్రోతలను అలరించింది. ఎస్పీ బాలు గానం చేసిన పలు గీతాలను ప్రసూనా రామన్, డాక్టర్ భాగ్యశ్రీలతో పాటు పలువురు గాయనీ గాయకులు శ్రావ్యంగా ఆలపించారు.

గాన గంధర్వుడు ఎస్పీ

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సినీ రంగంలో అనేక మంది ప్రముఖ హీరోలకు వారి గొంతులకు అనుగుణంగా పాటలు పాడిన బాలును సినీ ప్రియులు మరిచిపోలేరన్నారు. కేవలం సినీ గీతాలే కాకుండా అనేక ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలను నేటికి భక్తుల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. సినీ రచయిత వేటూరి గీతాలపై పరిశోధన చేసిన డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ వేటూరి వంటి ఎందరో మహానుభావులు రచించిన పాటలకు ప్రాణం పోసిన గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తరువాత ఆ స్థానాన్ని భర్తీ చేసిన ఎస్పీ బాలును గాయక లోకం మరిచిపోదన్నారు. కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని 45 అడుగుల ఎత్తైన హనుమాన్ విగ్రహం వద్ద దాసాంజనేయ స్వామి దేవస్థానంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దాదాపు ఆరు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పల్నాటి సత్యనారాయణ, బోడే వెంకయ్య కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మండే వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకే ప్రతి ఏటా ఎక్స్‌రే, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఎక్స్ రే గ్రూప్ సంస్థల ప్రధాన బాధ్యులు కొల్లూరి అన్నారు. సాంబమూర్తి రోడ్డులో బుధవారం 65 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఏటా వేసవిలో ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ, ఎక్స్ రే వాకర్స్ క్లబ్, అంజలి, గీతాంజలి, దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త నిర్వహణలో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తాము చేస్తున్న సేవలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 5 వరకు 65 రోజులుగా దాదాపు 15,000 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశామని చెప్పారు. ఎక్స్ రే ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తోటివారికి సహాయపడే మనస్తత్వం అలవర్చుకోవాలని కోరారు. వేసవిలో వడగాల్పులను సైతం లెక్కచేయక అకుంఠిత దీక్షతో మజ్జిగ పంపిణీ నిర్వహించటం అభినందనీయమని కొనియాడారు. మజ్జిగ పంపిణీ చైర్మన్ గోపు రాము, వైస్ చైర్మన్ పాత్తూరి సీతారామారావు సభ్యులు కనకవల్లి, చామర్తి వెంకట సుబ్బయ్య, బ్రహ్మదేశం వసంత కుమార్,గుర్రం ఏడుకొండలు, కె.రాము పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో దాతలు

విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు దేశభక్తి గీతాల ఆలాపన, పుస్తక సమీక్ష, కథల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు జరిగాయి. పోటీలను గణపతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అసాధారణ నైపుణ్యం దాగి ఉంటుందని, అది వెలికి తీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి మాట్లాడుతూ గురువారం క్యారమ్ బోర్డ్, చదరంగం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలి పిలుపునిచ్చారు. విజేతలకు 7న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పర్యావరణ దినోత్సవ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం, కాలుష్యం నియంత్రణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటింటా మొక్కలు పెంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దని, మట్టిలో కరగని ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని గ్రంథాలయాధికారి పద్మావతి సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జనరల్ నాలెడ్జిపై క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం


చిన్నారి తండ్రి బాజీరావుకు నగదు అందజేస్తున్న సీఐ మహేంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయమై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారి నిశిక వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన తండ్రి బాజీరావు చిన్నారి ఆపరేషన్‌కు దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసుల తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. టూ ట్రాఫిక్ సీఐ మహేంద్ర, గ్రూప్ సభ్యులు కానిస్టేబుల్ నాగేంద్రబాబు, బ్రహ్మం హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలి తండ్రి బాజీరావుకు నగదును బుధవారం అందించారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి బాజీరావు మాట్లాడుతూ.. నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్య, వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహాయ, సహకారాలు అందిస్తున్న సిటీ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం 63వ డివిజన్ పాత, కొత్త రాజీవ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. వాతావరణంలో చోటుచేసుకొన్న మార్పుల కారణంగా ప్రజలు నివసించే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు క్లీన్ చేయడం, ఆ ప్రాంతాల్లో సున్నం చల్లించడం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు. ప్రతి రోజూ డ్రైనేజీ కాల్వల్లో స్కిల్ట్ లేకుండా చూడాలని, మురుగునీరు కాల్వల్లో నిలబడకుండా చూడాలన్నారు. మురుగుకాల్వలకు సమీపంలో వున్న తాగునీటి పైపులైన్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించడానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు జోనల్ కమిషనర్ పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించడం, శాంపిల్స్ సేకరించడం జరుగుతుందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో వైద్యసిబ్బందితో సర్వే చేయిస్తున్నట్లు తెలియజేశారు.


బ్లీచింగ్ చల్లిస్తున్న జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరుకు చెందిన మహాదేవ్ కూచిపూడి నాట్యక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు బుధవారం సాయంత్రం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం మామిడాల పావని పర్యవేక్షణలో సోనిక, తన్వీ, జ్యోత్స్నిక, హారిణి, హేమ, వివక్ష, లాస్య, దుర్గా, జయలక్ష్మిల శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

మైలవరం: కంటి చూపు లేనిదే మనం దేనిని గుర్తించలేమని, అంధకారంలో ఉంటామని హైదరాబాద్ డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. రమేష్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం డాక్టర్ రమేష్ కంటి ఆవశ్యకతను వివరించి, దృష్టి లోపం ఎలా వస్తుంది, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.

- **ఆగిరిపల్లి:** తోటపల్లిలోని ఫ్రీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కొంకా హారిక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు తాడిశెట్టి శోభన్‌బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్‌నకు రాత పరీక్ష ద్వారా విద్యార్థిని హారిక ఎంపికైందని చెప్పారు. హారికకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ప్రతి ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. హారికను సత్కరించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీపీసీబీ సెక్రటరీ శ్రీధర్



కార్యక్రమానికి హాజరైన ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు




నృత్యం చేస్తున్న కళాకారిణులు

ఘనంగా పర్యావరణ దినోత్సవం

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయవాడలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్య కార్యదర్శి బి.శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మా ఓట్లు ఏమయ్యాయి?

▶ మొదటి పేజీ తరువాయి

ఫలితాలను తాము కలలో కూడా ఊహించలేదని టీడీపీ నేతలే ఆశ్చర్యపోతున్నారంటే ఏం జరిగి ఉంటుందనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. కూటమి గెలిచిందనే ఆనందం కంటే జగన్ ఓడిపోయారనే బాధ అత్యధికుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 'మా గ్రామంలో 3 వేల ఓట్లు ఉంటే అందులో కనీసం 2100 ఓట్లు వైఎస్సార్‌సీపీకే పడ్డాయి.. ఇలా ఒక నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ జరిగితే జగన్ ఓడిపోవడమేంటి' అంటూ అనేక గ్రామాల్లో ప్రజలు లెక్కలు వేస్తున్నారు. పలువురు రైతులు పల్లెల్లో ఒక చోట చేరి 'మనకు ఎంతో మేలు చేసిన జగన్‌కే కదా మనం ఓటేశాం. ఇలా అన్ని ఊళ్లలోనూ జరిగింది.. మరి మనందరి ఓట్లు ఏమైపోయాయి?' అని ఆవేదన పంచుకుంటున్నారు. జగనన్నకే మేమూ ఓటేశాం అన్నకు మరీ ఇంత తక్కువ సీట్లు రావడమేంటంటూ అక్కచెల్లెమ్మలు కన్నీరు మున్నీరవుతున్నారు. బంధువులకు, స్నేహితులకు, తెలిసిన వారికి ఫోన్లు చేసి ఏం జరిగి ఉంటుందంటూ ఆరా తీస్తున్నారు. ఉద్యోగులు సైతం ఈ ఫలితాల పట్ల విస్మయం చెందుతున్నారు. సచివాలయాల ఉద్యోగులు, కొన్ని సామాజిక వర్గాల ఉద్యోగులు, వలంటీర్లు వైఎస్సార్‌పార్టీకి ఓటేశారని, వీరందరి ఓట్ల వల్ల అనేక సీట్లు వచ్చే అవకాశం ఉందని వారు చర్చించుకుంటున్నారు.

కుట్ర జరిగిందనిపిస్తోంది..

కొందరైతే గెలుపు ఓటములు సహజం, కానీ గెలిచిన వారికి ఇంత భారీ మెజారిటీలు రావడం, వైఎస్సార్‌సీపీకి అత్యంత పట్టున్న అనేక జిల్లాల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కచ్చితంగా ఏదో జరిగిందని వారంతా భావిస్తూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఈవీఎంల సాంకేతికత, హ్యాకింగ్, ట్యాంపరింగ్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కొన్ని ఈవీఎంలలో ఓట్ల లెక్కల్లో తేడాలు రావడం, వాటిని రిటర్నింగ్ అధికారులు ఆ తర్వాత సరిచేయడం వంటి ఉదాహరణలు అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయని చెబుతున్నారు. ఎన్నికల తర్వాత టీడీపీ అధినేత గుట్టుగా విదేశాలకు వెళ్లిపోవడం కూడా కుట్రలో భాగమనే వాదనలు వినిపిస్తున్నాయి. విదేశాల నుంచి ఈవీఎంలను ప్రభావితం చేసేలా ఏదో జరిగిందని పలువురు నాయకులు సైతం ఆరోపణలు చేయడం ప్రజల అనుమానాలకు బలం చేకూర్చింది. మరోవైపు జగన్‌కు ప్రజా మద్దతు ఏ మాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా మొత్తం జగన్‌కు అనుకూల పోస్టులతో నిండిపోయింది. కూటమి ఏదో కుట్ర చేసి గెలిచి ఉండవచ్చని పోస్టులు షేర్ చేస్తున్నారు. సామాన్య జనం కూడా జగన్‌కు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని, విద్య, వైద్యం, సంక్షేమంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక సంస్కరణలు ఎప్పటికీ మరచిపోలేమని అంటున్నారు. కచ్చితంగా ఏదో జరిగితే తప్ప కూటమికి ఇంత ఘన విజయం సాధ్యం కాదని ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇదే అంశం న్యాయస్థానం వరకు చేరితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న కూటమిని కలవరానికి గురిచేస్తోంది. వైఎస్సార్‌సీపీని ఇంతలా ఓడించేంత వ్యతిరేకత ప్రజల్లో లేదనే విషయం స్పష్టమవుతోంది.

ఈవీఎంలో మార్పుతోనే ఇలాంటి ఫలితాలు



కొత్తగా పార్టీ పెట్టినప్పుడు కూడా వైఎస్సార్‌సీపీకి ఇలాంటి ఫలితాలు లేవు. అప్పటికీ, ఇప్పటికి పార్టీ గ్రామీణ స్థాయిలో ఎంతో బలంగా ఉంది. సంక్షేమ పథకాలతో ఇంటింటికీ లబ్ధి చేకూరింది. అలాంటిది టీడీపీకి ఏకపక్ష ఫలితాలు రావడం ముమ్మాటికీ కుట్రే. ఈవీఎంలు తారుమారు చేస్తేనే ఇలాంటి ఫలితాలు సాధ్యం.

– మునిస్వామి, ఆదోని, కర్నూలు జిల్లా

మా గ్రామ చరిత్రలోనే టీడీపీకి మెజార్టీ రాలేదు



మా గ్రామంలో 1,130 ఓట్లు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 960 పోల్ అయ్యాయి. టీడీపీకి 180 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత 40 ఏళ్లుగా గ్రామంలో ఏ ఎన్నికలు జరిగినా టీడీపీపై 300 నుంచి 400 మెజార్టీ వచ్చేది. మా గ్రామ చరిత్రలో టీడీపీకి మెజార్టీ వచ్చిన దాఖలాలే లేవు. ఈ ఫలితాలను గ్రామంలో ఎవరూ నమ్మడం లేదు. గుంపులు గుంపులుగా కూడబలుక్కొని వేసిన ఓట్లన్నీ ఎక్కడికి పోయాయో తెలియట్లేదు.

– తిరుపతి రెడ్డి, పేరూరు, నంద్యాల జిల్లా

ప్రతి ఊర్లో అదే మాట



మా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అత్యధికులు వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామని బహిరంగంగా చెప్పారు. అయితే ఫలితం ఎలా తారుమారయ్యిందని అందరూ ఆశ్చర్యపోతున్నారు. 2009, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో చాపాడు మండలంలో 6 వేలకు పైగా ఓట్ల మెజార్టీ రఘురామిరెడ్డికి వచ్చింది. ఇప్పుడు ఇలా ఓటమిపై అందరూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

– తెలిదేల లక్ష్మయ్య, ఎంపీపీ, చాపాడు మండలం, మైదుకూరు , వైఎస్సార్ జిల్లా

ఆ ఓట్లన్నీ ఏమయ్యాయి?



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన అందరికీ సంక్షేమ ఫలాలు అందించారు. లబ్ధి పొందిన అందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశామని చెబుతున్నారు. 2019 కంటే అఖండ మెజార్టీ వస్తుందని భావించాం. కానీ ఫలితాలు చూస్తే మాకే ఆశ్చర్యం కలిగించింది. మరి వేసిన ఓట్లు అన్నీ ఏమయ్యాయో అర్థం కావడం లేదు.

– దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఏపీబీసీ మాజీ డైరెక్టర్, ఖాజీపేట, వైఎస్సార్ జిల్లా

ఏమాత్రం నమ్మశక్యంగా లేదు



మా గ్రామం మొదట్నుంచీ వైఎస్సార్‌సీపీకి పట్టున్న ప్రాంతం. మా పోలింగ్ బూత్ పరిధిలో మెజారిటీ ఓటర్లు వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారు. అయితే టీడీపీకి ఎలా మెజారిటీ వచ్చిందో అర్థం కావడం లేదు. ఇది ఏమాత్రం నమ్మశక్యంగా లేదు. ఎక్కడో ఏదో జరిగింది.

– కే. ప్రవీణ్‌కుమార్, పూలవాండ్లపల్లె, అగ్రహారం పంచాయతీ, నిమ్మనపల్లె మండలం, అన్నమయ్య జిల్లా

ఈవీఎంలో మార్పు చేసి ఉంటారు



మా మండలంలో ప్రతిసారీ వైఎస్సార్సీపీకే మెజారిటీ వస్తుంది. ఈ విడత 1550 ఓట్ల మెజారిటీ టీడీపీకి వచ్చింది. నియోజకవర్గంలో 24 వేల మెజారిటీ టీడీపీ అభ్యర్థికి రావడం వెనుక ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ఈవీఎంలో మార్పు చేసి ఉంటారన్న అనుమానం కలుగుతోంది.

– ఆనం రాణి రత్న ప్రభావతి, మర్రిపూడి, ప్రకాశం జిల్లా

ఈవీఎంలపై అనుమానాలు



మా గ్రామంలో ఎక్కువ శాతం మంది ఫ్యాన్ గుర్తుకే ఓటేశారు. కానీ టీడీపీకి ఇంత మెజారిటీ రావడం వెనుక ఎన్నో అనుమానాలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీకి పట్టున్న గ్రామాల్లో టీడీపీకి ఇంత ఆధిక్యం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. ఈవీఎంలపై అందరికీ అనుమానం ఉంది.

– చింతపల్లి హరిబాబు, టంగుటూరు, ప్రకాశం జిల్లా

ఈవీఎంలను మార్చారు



పోలింగ్ తర్వాత ఈవీఎంలను మార్చారన్న అనుమానం అందరికీ ఉంది. లేకపోతే ఇలాంటి ఫలితాలు రావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందని కుటుంబం లేదు. కానీ ఫలితాలు మాత్రం తారుమారుగా వచ్చాయి. అల్లూరులో ఎక్కువ శాతం మహిళలు ఫ్యాన్ గుర్తుకే ఓటేశారు. దీనిపై విచారణ జరిపించాలి.

– బెంగోహరి వేణు, అల్లూరు, ప్రకాశం జిల్లా

అర్థం కావడం లేదు



మా గ్రామంలో ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు ఉంది. ఇప్పటి వరకు ఏ ఎన్నికలు జరిగిన వైఎస్సార్‌సీపీకే భారీ మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో మాత్రం వైఎస్సార్‌సీపీ మెజార్టీ పూర్తిగా పడిపోయింది. ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు.

– ఎస్‌కె జాన్‌వలి, రెడ్డిగూడెం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా

ఏదో జరిగి ఉంటుంది



కౌంటింగ్ ప్రక్రియలో ఏదో తేడాలు జరిగాయనే అనుమానం కలుగుతోంది. ఏ ఎన్నికల్లో లేని విధంగా ఇంత భారీ మెజార్టీ టీడీపీ నేతలకు రావడం అయోమయంగా ఉంది. ప్రతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య టైట్ ఫైట్ జరిగిన క్రమంలో కూడా ఆ పార్టీకి భారీ మెజార్టీ రావడం సందేహ పడాల్సిన అంశమే.

–రామిరెడ్డి,ఆటోడ్రైవర్, పాతగుంటూరు

భారీ మెజార్టీపై అనుమానం



పేద వర్గాలు, సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలబడి ఓటు వేశారు. అయినప్పటికీ టీడీపీకి భారీ మెజార్టీ రావడం విడ్డూరంగా ఉంది. ఏదైనా సాంకేతిక లోపాలు చోటు చేసుకున్నాయా.. అనే అనుమానం కలుగుతోంది. వైఎస్సార్‌సీపీ ఓడిపోయినప్పటికీ టీడీపీకి ఇంతటి మెజార్టీ రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

– ఆర్. లలిత, న్యాయవాది, గుంటూరు

ఈవీఎంలను పరీక్షించాలి



ఈవీఎంలను రాండమ్‌గా కొన్ని చోట్ల పూర్తిగా పరీక్షించేలా ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వాలి. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబు ఈవీఎంలను అడ్డం పెట్టుకుని గెలిచినట్టు కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర, రాయలసీమలో కూడా వైఎస్సార్‌సీపీ వెనుకబడటానికి అడ్డదారిలో ఈవీఎంలను వినియోగించడమేనని తెలుస్తోంది. అంతా ఏకమై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి.

– బాడితబోయిన రాములప్పుడు, చేపలుప్పాడ, విశాఖ జిల్లా

పెత్తందారుల కుట్ర



నాతో పాటు వందల మంది ఫ్యాను గుర్తుపై ఓటు వేశాము. కానీ ఎన్నికల ఫలితాలు చూసి అవాక్కయ్యాము. పేదలకు పెత్తందార్లకు మధ్య జరిగిన పోరాటంలో పెత్తందార్ల కుట్రలతో ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని ప్రతీ ఒక్కరూ అనుమానిస్తున్నారు. ఫ్యానుకు వేసిన ఓటు సైకిల్‌కు ఎలా మళ్లిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

– శశిభూషణరావు, వివేకానందకాలనీ, 68వ వార్డు, విశాఖ

కుట్రలతో ఫలితాలు



జీవీఎంసీ 69వ వార్డు అంతా వైఎస్సార్ సీపీ అభిమానులే. 90 శాతం పైగా ఫ్యాను గుర్తుపై ఓటు వేశారని ఓట్లు వేసి చెబుతున్నారు. కానీ ఎన్నికల ఫలితాలు చూసి.. నిజంగా దేవుడనే వాడు ఉన్నాడా అని అనుమానంగా ఉంది. కూటమి.. వ్యవస్థలను మేనేజ్ చేసి గెలిచింది.

– బోగాది సన్యాసిరావు, 69వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

ఇవి నిజమైన ఫలితాలు కావు



నేను వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యానుకు ఓటు వేశాను. కానీ ఆ ఓటు కూటమి పార్టీలో సైకిల్‌కు పడిందా అని అనుమానంగా ఉంది. ఇలా ఎందరికో జరిగింది. ఎన్నికల ఫలితాలపై అనుమానంగా ఉంది. కూటమి కుట్రలతో ఫలితాలు వెలువడటంతో పేదవారి గుండె ఆగినంత పనైంది. చాలా మంది ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

– గుడివాడ అనూష, 68వ వార్డు కార్పొరేటర్

ఆశ్చర్యానికి గురి చేసింది



ఏజెన్సీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. గిరిజనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎంతో అభిమానం ఉంది. వారి కోసం పోడు పట్టాలు ఇచ్చి, రైతు భరోసా అమలు చేశారు. వారంతా పార్టీకి ఓట్లు వేశారు. అయితే ఎన్నికల్లో ఫలితాలు ఆశ్యర్యానికి గురి చేశాయి.

– పండా రామకృష్ణదొర, పందిరిమామిడి, రంపచోడవరం, అల్లూరి జిల్లా

ఇది కుట్రే.. సందేహం లేదు



ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఏ ఓటరు అభిప్రాయం అడిగినా వైఎస్సార్ సీపీకే ఓటు వేశామన్నారు. కేంద్రం సహాయంతోనే కూటమి గెలిచేలా మాయ చేసి ఉంటారు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. లేకుంటే వైఎస్సార్‌సీపీ గెలిచే బూత్‌లలో కూటమి అభ్యర్థికి మెజార్టీ సాధ్యం కాదు.

– తాడి కస్తూరి, 23వ వార్డు, వీర్రాజుపేట, పెద్దాపురం, కాకినాడ జిల్లా

వ్యవస్థలను అడ్డం పెట్టుకుని..



కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో కూటమి మోసానికి పాల్పడిందని భావిస్తున్నాం. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలూ గంపగుత్తగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశాం. మోసం జరగకుండా అంత పెద్ద ఎత్తున ఓటమి అసాధ్యం. పక్కా ప్రణాళికతో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని ఓడించారు తప్ప ప్రజాబలంతో కాదు.

– బొడ్డు చంటి, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం, కాకినాడ జిల్లా

ఎక్కడేం జరిగిందో..



మా గ్రామం వైఎస్సార్ సీపీకే అనుకూలంగా ఉంటుంది. ప్రతి ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థులనే గెలిపించుకుంటున్నాం. ఈసారి కూడా కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబుకే ఫ్యాన్ గుర్తుపై ఓటేశాం. ఎన్నికల ఫలితాలు చూసి షాకయ్యాం. ఎక్కడేం జరిగిందో తెలియడం లేదు.

– రొక్కాల గణేష్, సర్పంచ్, జి.భావారం, కరప మండలం, కాకినాడ జిల్లా

ఓటును ఖూనీ చేశారు

మాది పెనమలూరు నియోజకవర్గంలోని పెద ఓగిరాల గ్రామం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి బలమైన గ్రామం. 2019 ఎన్నికల్లో 607 ఓట్లు మెజారిటీ సాధించాం. అలాంటి మా గ్రామంలో టీడీపీకి మెజారిటీ వచ్చింది. గ్రామస్తులు అందరం నివ్వెరపోయాం. బీజేపీ సహకారంతో చంద్రబాబు ఈవీఎంలను ట్యాంపరింగ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటును ఖూనీ చేశారు.

– త్రిపురం చందు, వైఎస్సార్ సీపీ నేత, పెద ఓగిరాల, ఉయ్యూరు మండలం, కృష్ణా జిల్లా

ఓట్లు తగ్గడం నమ్మశక్యంగా లేదు



వైఎస్సార్‌సీపీకి పట్టుకొమ్మగా ఉన్న గ్రామంలో ప్రతి ఒక్కరూ జగన్‌కు బాసటగా నిలిచి ఓట్లు వేశారు. అయితే ఫలితాల్లో టీడీపీకి మెజారిటీ రావడం నమ్మశక్యంగా లేదు. అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాల కారణంగా లబ్ధి పొందినందున జగన్‌కే ఓటు వేశామని చెబుతున్నారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉంది.

– కట్టుపల్లి సోమయ్య, మాజీ సర్పంచి, మొసలిపాడు, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా.

అభ్యర్థే విస్తుపోయేలా మెజారిటీ



గెలుపొందిన అభ్యర్థులు సైతం విస్తుపోయేలా మెజార్టీలు రావడం సాధారణ ఓటరుకు అంతు పట్టని అంశంగా మారింది. వాస్తవంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్య పోటీ హోరాహోరీగా నడిచిందని ఇరువర్గాల్లో చర్చ జరగడం బహిరంగ రహస్యం. వస్తే మూడు నాలుగు వేల మెజారిటీ ఎవరికైనా రావచ్చని అందరూ అనుకున్నారు. తీరా 37,623 ఓట్ల మెజారిటీతో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం అందరికీ షాక్ ఇచ్చింది. దీన్ని బట్టి ఏదో తేడా జరిగిందని అందరూ భావిస్తున్నారు.

– కడియాల ప్రకాష్, మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా

మోసం జరిగిందనడానికి ఇదే సాక్ష్యం



ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామంలోని 78వ బూత్ నెంబర్ మాది. ఈ బూత్‌లో ఓటు వేసిన వాళ్లంతా మా వాళ్లే. సుమారు 250 మంది వరకు ఉంటారు. వీరంతా వైఎస్సార్‌సీపీకే వేశారు. అలాగే వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులు మరో 200 మంది వరకు వైసీపీ అభిమానులు ఉన్నారు. 746 ఓట్లు పోలైన మా బూత్‌లో ఎంత తక్కువగా అనుకున్నా 500 పైగా మెజార్టీ వస్తుందని భావించాం. ఓట్ల లెక్కింపులో అనూహ్యంగా టీడీపీకి 200 పైచిలుకు ఓట్లు మెజార్టీ రావడంతో టీడీపీ వాళ్లే ఆశ్చర్యపోయారు. ఏదో టెక్నికల్‌గా మోసం జరిగిందని ప్రతీ ఒక్కరం నమ్ముతున్నాం.

– దున్న గురుమూర్తి, వైస్ ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం, శ్రీకాకుళం జిల్లా

వైఎస్సార్‌సీపీ హవా ఉన్న గ్రామంలో కూటమికి మెజార్టీ!?



వైఎస్సార్‌సీపీ హవా ఉన్న పనపాం గ్రామంలో 809 ఓట్లు పోలైతే వాటిలో 594 ఓట్లు జనసేన అభ్యర్థికి వచ్చాయి. కేవలం 215 ఓట్లు మాత్రమే వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పడ్డాయి. గ్రామంలో 60–77 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు. గత ఎన్నికలన్నింటిలో 70 శాతం ఓట్లు వైఎస్సార్‌సీపీకి పోలయ్యాయి. ఏదో తేడా జరిగినట్లు అనిపిస్తోంది.

– మహంతి కల్యాణి, పనపాం ఎంపీటీసీ, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా

ఇదెలా సాధ్యం?



మా ఎం.సింగుపురం పంచాయతీలో పోలైన ఓట్లు 954. గ్రామంలో 90 శాతం మంది వైఎస్సార్‌సీపీ అభిమానులు. వైఎస్సార్‌సీపీకి 445, టీడీపీకి 500 ఓట్లు వచ్చాయి. ఇలా ఎలా వచ్చాయో అర్థం కావడం లేదు. మా పంచాయతీలో ప్రతి ఒక్కరూ ఇప్పుడు ఈ అంశంపైనే చర్చించుకుంటున్నారు. ఏదో జరిగింది. లేకుంటే ఫలితాలు ఇలా రావు.

– రణస్థలం రాంబాబు, ఎం.సింగుపురం, పాలకొండ మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

ఇప్పటికీ అర్థం కావట్లేదు..



మా సీతంపేట గ్రామం ఆది నుంచి వైఎస్సార్‌సీపీకి కంచుకోట. గత ఎన్నికల్లో మా బూత్ నుంచి 650 ఓట్లు మెజార్టీ ఇచ్చాం. ఈ దఫా కచ్చితంగా అంతే వస్తుందనుకున్నాం. కానీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి మెజార్టీ వచ్చింది. ఏం చేశారో అర్థం కాని పరిస్థితి. వ్యవస్థల్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు కాబట్టి ఇప్పుడు వచ్చిన ఫలితాలపై నమ్మకం లేదు.

– చింతల సత్యనారాయణమూర్తి, సీతంపేట, ఎస్.కోట మండలం, విజయనగరం జిల్లా

నమ్మలేక పోతున్నాం



జగనన్న అందించిన ప్రతి సంక్షేమ పథకం మాతో పాటు మా బంధువులకు, మా చుట్టుపక్కల ఉన్న వాళ్లందరికీ అందాయి. ఆయన పాలనలో మా ఆర్థిక స్థితిగతులు, మా బతుకులు మారాయి. తిరుపతి రూపు రేఖలు మారిపోయాయి. ఎమ్మెల్యేగా భూమన మంచి చేశారు. మళ్లీ ఇక్కడ గెలుపు ఖాయం అనుకున్నాం. కానీ ఫలితం అందుకు పూర్తి భిన్నంగా రావడం నమ్మలేక పోతున్నాం.

– శైలజ, సంజయ్‌గాంధీ కాలనీ, తిరుపతి


ఆశ్చర్యంగా ఉంది



మా బూత్ పరిధిలో అత్యధికులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. అయితే తెలుగుదేశం పార్టీకి ఎలా మెజార్టీ వచ్చిందో అర్థం కావడం లేదు. ఇందులో ఏదో జరిగింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పద్మనాభశెట్టి, సురేంద్రనగరం, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా


ఈ ఓటమి ఊహకందడం లేదు



వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంతలా ఓటమి చెందడం ఊహకందడం లేదు. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు జగనన్న అందరికీ మంచే చేశారు. ప్రతి ఇల్లూ లబ్ధి పొందింది. ఇంత పెద్ద మొత్తంలో ప్రజలకు మేలు జరిగితే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండే ప్రసక్తే లేదు. ఒకటి, రెండు వర్గాల వారు ఓట్లు వేయనంత మాత్రాన పార్టీ ఓడిపోవడం జరగదు. ఏదో మోసం జరిగిందని మాత్రం కచ్చితంగా చెప్పగలం.

– కేజీ రోస్ రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేత, పిచ్చాటూరు, తిరుపతి జిల్లా


ఈ ఫలితం మేమిచ్చింది కాదు



2019 నుంచి గ్రామంలో ప్రజలు, మా బంధువులు, అభిమానులు అందరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 725 ఓట్లు పోలయ్యాయి. గ్రామమంతా వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నా టీడీపీకి 29 ఓట్ల మెజార్టీ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. ఈ ఫలితాలను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోం.

– డీవీ శేషిరెడ్డి, లింగాల, కోవెలకుంట్ల మండలం, నంద్యాల జిల్లా

ఈవీఎంలపై అనుమానం



వైఎస్ జగన్ జనరంజక పాలన అందించారు. అన్ని వర్గాలకు మేలు చేశారు. వారంతా ఎన్నికల సమయంలో తమ కృతజ్ఞతను ఓటు రూపంలో తెలియజేస్తామని ఎన్నో సార్లు బహిరంగంగా ప్రకటించారు. అలాగే ఓట్లు కూడా వేశారు. కానీ ఫలితాలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈవీఎంలు ట్యాపరింగ్ చేశారనే అనుమానం కలుగుతోంది.

– బూరెల నాంచారమ్మ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేత, గుంటూరు జిల్లా

నమ్మలేకపోతున్నాము



మా గ్రామంలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఈ ఎన్నికల్లో మాతో పాటు మా చుట్టుపక్కల వారు కూడా ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారు. సరిపల్లి 7, 8 బూత్‌ల్లో 670 మెజార్టీ జనసేనకు వచ్చింది. అలా జరిగే వీలు లేదు. ఈవీఎంల్లో ఏదో జరిగినట్టుగా అనుమానం వస్తోంది.

– గమిడి బధుబాబు, సరిపల్లి, నరసాపురం మండలం

ఎక్కడో ఏదో తేడా జరిగింది.



మా ఇంట్లో గత ఐదేళ్లలో జగన్ అందించిన అనేక సంక్షేమ పథకాలు అందాయి. జగన్ ఇచ్చిన సొమ్ములు తిని ఆయనకే ఓట్లు వేశాము. బియ్యుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. ఇంత అభివృద్ధి, సంక్షేమం అందించిన జగన్‌కు కాక ఇంకొకరికి ఎందుకు ఓట్లు వేస్తాము? అయితే మొగల్తూరులోని మా 96వ పోలింగ్ బూత్‌లో జనసేనకు 1,012 ఓట్ల మెజార్టీ ఎలా వచ్చిందో తెలియడం లేదు. ఎక్కడో ఏదో తేడా జరిగింది.

– మన్నే భోగేశు, గొల్లగూడెం, మొగల్తూరు మండలం, తూర్పు గోదావరి జిల్లా

మెజార్టీపై అనుమానం



మా గ్రామంలో ఎక్కువ మంది దళిత బహుజనులు. సర్పంచ్ ఎన్నికల్లో, ఎంపీటీసీ ఎన్నికల్లో మంచి మెజార్టీతో వైఎస్సార్‌సీపీ గెలిచింది. మా గ్రామంలో సచివాలయం, ఆర్బీకే భవనం, హెల్త్ క్లినిక్ భవనం, సీసీ రోడ్లు.. ఇలా చాలా అభివృద్ధి జరిగింది. పైగా ఇంటింటికీ లబ్ధి చేకూరింది. అందరూ వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారు. అయితే టీడీపీ అభ్యర్థికి 1,105 ఓట్లు మెజార్టీ రావడం ఆశ్చర్యంగా ఉంది.

– దాసరి లాజరు, మాజీ సర్పంచ్, కొత్తపేట, పాలకొల్లు మండలం

షాక్‌కు గురయ్యాం..



ఎన్నికల ఫలితాలను చూసిన తరువాత షాక్‌కు గురయ్యాం. మా గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మంచి పట్టు ఉంది. ఎంపీటీసీ, సర్పంచ్, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ మంచి మెజారిటీ వచ్చింది. కానీ ఇవాళ మెజార్టీ తగ్గడం నమ్మబుద్ధి కావడం లేదు. ప్రస్తుత ఫలితాలను చూస్తుంటే ఈవీఎంలను ఏమైనా టాంపరింగ్ చేశారా అనే అనుమానం కలుగుతోంది.

– పీఆర్ నరసింహమూర్తి, ఆలదపల్లి, అమరాపురం మండలం, ఉమ్మడి అనంతపురం జిల్లా

ఏమిటీ ఫలితాలు?



అగళి మండలంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 1,800 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఏమీ చేయనప్పుడే అంత మెజార్టీ రాగా.. ప్రజలకు ఈ ఐదేళ్లలో అన్ని సంక్షేమ పథకాలు ప్రతి ఇంటి గుమ్మం ముందుకే అందించాం. ఎవరిని అడిగినా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశామని చెప్పారు. ఈ సారి ఐదు వేల ఓట్ల మెజార్టీ వస్తుందని భావించాం. కానీ 745 మాత్రమే రావడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఫలితాలు ఎందుకిలా వచ్చాయో నమ్మలేకపోతున్నాం.

– లింగరాజు, కదిరేపల్లి, అగళి మండలం, ఉమ్మడి అనంతపురం జిల్లా

ఈవీఎంలపైనే అనుమానం



మా గ్రామంలో అత్యధిక మంది ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామని చెబుతున్నారు. ఇక్కడ ఎప్పుడూ టీడీపీకి మెజార్టీ రాలేదు. అలాంటిది ఇప్పుడు బీజేపీకి మెజార్టీ రావడం అనుమానంగా ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజల్లో వ్యతిరేకత కూడా కనిపించలేదు. అయినా పార్టీకి అంత దారుణమైన ఫలితాలు రావడం టీడీపీ వారికే అంతుబట్టడంలేదు. కచ్చితంగా ఈవీఎంలపైనే అనుమానం వ్యక్తమవుతోంది.

– అప్పస్వామి, గంటాపురం, బత్తలపల్లి మండలం, ఉమ్మడి అనంతపురం జిల్లా

ఫలితం తారుమారు



ఈ ఎన్నికల్లో మా ప్రాంతం వాళ్లమంతా వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేశాం. మా పోలింగ్ బూత్ 241లో 828 ఓట్లు పోలయ్యాయి. అయితే టీడీపీకి 81 ఓట్ల మెజారిటీ రావడం నమ్మలేక పోతున్నాం. మా పంచాయతీలో ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీలో లబ్ధి చేకూరింది. ఫలితాలు తారుమారయ్యాయని అనుమానం కలుగుతోంది. – ఆరిమళ్ల నారాయణ, నాగసముద్రం, కలిగిరి మండలం, నెల్లూరు జిల్లా


మా బూత్‌లో ఓట్లు తగ్గడం విస్మయం



మాది తిక్కవరప్పాడు గ్రామంలోని 218వ పోలింగ్ కేంద్రంలో 854 ఓట్లు ఉన్నాయి. మూడింట రెండొంతుల ఓట్లు వైఎస్సార్‌సీపీకి కచ్చితంగా పడ్డాయి. అయితే టీడీపీకి మెజారిటీ రావడం విస్మయం కలిగించింది. ఈ ఫలితాల పట్ల మహిళలు విస్తుపోతున్నారు.

– మందల వరప్రసాద్, తిక్కవరప్పాడు, వెంకటాచలం మండలం, నెల్లూరు జిల్లా


మోసం జరిగింది..



దక్కునూరు బూత్ నంబర్ 83లో టి.కొండారెడ్డిపల్లి, దక్కునూరు గ్రామాలు కలిసి ఉన్నాయి. ఈ బూత్‌లో వైఎస్సార్‌సీపీకి గట్టి పట్టు ఉంది. కనీసం 250 ఓట్లకు పైగా మెజారిటీ వస్తుందని గట్టి నమ్మకంతో ఉన్నాం. తీరా ఫలితాలు చూశాక షాక్ గురయ్యాం. ఈ బూత్‌లో 11 ఓట్లు టీడీపీకే మెజార్టీ రావడం విస్మయం కలిగిస్తోంది. ఎక్కడో ఏదో మోసం జరిగింది.

– జక్కం శ్రీనివాసరెడ్డి, టి.కొండారెడ్డిపల్లి, వరికుంటపాడు మండలం, నెల్లూరు జిల్లా

ఫలితాలపై అనుమానం



మాకు ఓటు పుట్టినప్పటి నుంచి ఇలాంటి ఎన్నికలను చూడనే లేదు. ఏ విధంగా ఇటువంటి ఫలితాలు వచ్చాయో ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఊళ్లో ఎవరినీ అడిగినా మేము వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేశామని చెబుతున్నారు. కచ్చితంగా ఎవరు వేస్తారో వేయరో కూడా తెలుసు. కానీ ఫలితాలు చాలా అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

– పిడతల దయాసాగర్, యడ్లపాడు, పల్నాడు జిల్లా

మా బూత్‌లో ఎప్పుడూ మెజార్టీ వచ్చేది

మాది పెనుగంచిప్రోలు మండలం కొళ్లికుళ్ల. 198 పోలింగ్ బూత్. ఎప్పుడూ 150 నుంచి 175 వరకు వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చేది. కానీ ఇప్పుడు 60 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చాయి. మా ఓట్లు అన్నీ ఏమాయ్యయో అర్థం కావటం లేదు.

– గంగూరి రాజబాబు, కొళ్లికుళ్ల, పెనుగంచిప్రోలు మండలం, ఎన్టీఆర్ జిల్లా

మా ఓట్లన్నీ ఏమయ్యాయో..

మొదటి నుంచి కాంగ్రెస్, తర్వాత వైఎస్సార్‌సీపీకి పట్టున్న గ్రామం మాది. గ్రామంలో 194, 195 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎప్పుడూ కనీసం 100 ఓట్లు అయినా వైఎస్సార్‌సీపీకి మెజార్టీ ఉంటుంది. అయితే ఒక ఈవీఎం లెక్కించలేదని అంటున్నారు. మా ఓట్లు ఏమయ్యాయో అర్థం కావటం లేదు.

– కీసర లోకేష్, ఎంపీటీసీ, శనగపాడు, పెనుగంచిప్రోలు మండలం, ఎన్టీఆర్ జిల్లా

క్లుప్తంగా...

కూటమి విజయం అనేక అనుమానాలకు తావిస్తోంది

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



తాటిపర్తికి అభినందనలు తెలిపిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు

సింగరాయకొండ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం ఎన్నో అనుమానాలకు తావిస్తోందని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గెలుపొందిన తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సింగరాయకొండ సుందర్‌నగర్‌లోని నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి పోలీస్ వ్యవస్థ, ఎన్నికల కమిషన్ వ్యవహార సరళిని గమనిస్తే కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారన్న సంకేతం ఇచ్చారని ఆరోపించారు. నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి నా చిరకాల వాంఛ తీర్చిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని ఈ సందర్భంగా చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

కొడవలితో నరికిన టీడీపీ కార్యకర్త



తలుపుల: శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గెరికపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల అగ్రి బోర్డు చైర్మన్ చెన్నకృష్ణారెడ్డిపై మంగళవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఎస్.రామక్రిష్ణ కుమారుడు హరి కొడవలితో మెడపైన నరకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో గెరికపల్లి వీధుల్లో ఆ పార్టీకి చెందిన హరి, మరికొందరు కలిసి బాణసంచా కాల్చి హంగామా చేశారు. గొడవలకు దిగకుండా ఇంట్లోకి వెళ్లి ప్రశాంతంగా ఉండాలని చెన్నకృష్ణారెడ్డి వారికి సూచించారు. దీన్ని జీర్ణించుకోలేని హరి ఇంట్లో కొడవలి తీసుకొచ్చి దాడి చేయడంతో చెన్నకృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా.. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఎస్ఐ దిలీప్ కుమార్ గ్రామంలో విచారించి, దాడి చేసిన హరిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు కారుపై దాడి

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి దంపతులు ప్రయాణిస్తున్న కారుపై మంగళవారం రాత్రి టీడీపీ, జనసేన శ్రేణులు దాడి చేసినట్టు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏలూరులో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో గోపన్నపాలెం సమీపంలో కారుపై దాడి చేసి అద్దాలు పగులగొట్టినట్టు తెలిపారు. తాను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని.. ఎప్పుడూ ఇటువంటి చూడలేదన్నారు. ఇంకా ప్రమాణ స్వీకారం చేయక ముందే టీడీపీ, జనసేన శ్రేణులు తమపైనే దాడులు చేస్తే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

జనం ఇటు.. ఓట్లు అటు!

శృంగవరపుకోట నియోజకవర్గంలో తేడా

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సామాన్య ప్రజల్లో అనేక సందేహాలకు తావిస్తోంది. తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే తమ గ్రామంలో టీడీపీ అభ్యర్థి ఖాతాలోకి ఎలా వెళ్లాయో అని తలలు పట్టుకుంటున్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈవీఎంల్లో ఏమైనా మతలబు జరిగిందా? అనే సందేహాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. జామి మండలం కలగాడ గ్రామ పంచాయతీ మామిడిపల్లి గ్రామం ప్రజలు మే 13న జరిగిన ఎన్నికల్లోనూ ఒకే తాటిపైకి వచ్చారు. ఇక్కడి పోలింగ్ బూత్‌లో టీడీపీకి ఏజెంటే లేరు. అందరూ ఫ్యాన్ గుర్తుకే ఓటేసి వచ్చామని సంబరపడ్డారు. ఓట్ల లెక్కింపులో గ్రామంలోని 300 ఓట్లలో 60 టీడీపీ అభ్యర్థికి వెళ్లాయి. తమలో ఎవరూ సైకిల్ గుర్తుకు ఓటు వేయలేదని, మరి అవి ఎలా వెళ్లాయో తెలియడం లేదని గ్రామస్తులంతా బాధ పడుతున్నారు. శృంగవరపుకోట మండలం దారపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లపు దుంగాడ గ్రామస్తులు 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వారంతా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేశారు. తాజా ఎన్నికల్లోనూ అంతా ఏకగ్రీవమై ఫ్యాన్ గుర్తుకే ఓటేసి వచ్చారు. ఆ లెక్కన చెల్లని ఓట్లు పోను మిగతా 565 ఓట్లు వైఎస్సార్‌సీపీకే రావాలి. కానీ 443 మాత్రమే వచ్చాయి. ఎప్పుడూ సైకిల్ గుర్తుకే ఓటేయని ఈ గ్రామంలో 122 ఓట్లు ఇప్పుడు టీడీపీ అభ్యర్థికి ఎలా పడ్డాయో వారు చెప్పలేకపోతున్నారు. విజయనగరం డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు స్వగ్రామమైన వేపాడ మండలంలోని నీలకంఠరాజపురంలో తొలినుంచి వైఎస్సార్‌సీపీదే ఆధిపత్యం. ఈ ఎన్నికల్లో ఆయన మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీకి పని చేశారు. ఈ ప్రకారం అదే స్థాయిలో ఓట్లు రావాలి. కానీ ఆ మెజార్టీ రాకపోగా టీడీపీ అభ్యర్థికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కన్నా 14 ఓట్లు తక్కువగా వచ్చాయి. మరీ ఇంత దారుణంగా ఓట్లు ఎలా మారిపోయాయో ఎవరికీ అర్థం కావట్లేదు.

టీడీపీ, జనసేన విధ్వంసం

స్వైరవిహారం చేసిన నేతలు, కార్యకర్తలు

- విగ్రహాలు, శిలాఫలకాల ధ్వంసం, వాహనాల దహనం
- సచివాలయ బోర్డుల తొలగింపు
- పలుచోట్ల కూటమి జెండాల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు



నెల్లూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు దహనం చేసిన బైక్

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో టీడీపీ, జనసేన శ్రేణులు విధ్వంసం సృష్టిస్తున్నాయి. యథేచ్ఛగా విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నాయి. వాహనాలను ధ్వంసం చేస్తున్నాయి. మంగళవారం మొదలుపెట్టిన ఈ అరాచకపర్వాన్ని టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు బుధవారం కూడా కొనసాగించారు. ఈ రెండురోజులు ప్రభుత్వ భవనాల వద్ద ఫలకాలను చిత్రపటాలను ధ్వంసం చేస్తూ స్వైరవిహారం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో మహానేత వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేసి, విగ్రహాల వద్ద కూటమి జెండాలు ఏర్పాటు చేశారు. ఇప్పటంలో ప్రజల భాగస్వామ్యంతో నిర్మించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా పేరుతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ భవనం పైభాగంలో జనసేన, టీడీపీ జెండాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో 1, 2 సచివాలయాల వద్ద వైఎస్ జగన్ డిజిటల్ బోర్డులను తొలగించి రోడ్డుపై పడవేసి చిత్రపటంపై రాళ్లు వేశారు. నూతన సచివాలయం శిలాఫలకంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని చిన్నపిల్లలతో పగులగొట్టించారు. రైతుభరోసా కేంద్రంపై నవరత్నాల బోర్డును ధ్వంసం చేశారు. పల్నాడు జిల్లా గోళ్ళపాడులో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ శిలాఫలకాన్ని పగులగొట్టారు. తిరుపతి జిల్లా పుత్తూరులో పలు ఆలయాల వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్కే రోజా పేరిట ఉన్న శిలాఫలకాలను బుధవారం సాయంత్రం తెలుగుదేశం నాయకులు ధ్వంసం చేశారు. శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం లోపల ఏర్పాటు చేసిన అన్నదాన, కళ్యాణోత్సవ మండప శిలాఫలకాన్ని, ఆరేటమ్మ ఆలయం వద్ద పలు అభివృద్ధి పనుల పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, గేట్‌పుత్తూరులోని గోవిందమ్మ ఆలయం వద్ద ప్రారంభించిన జగనన్న సమావేశమందిర శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. తెలుగుదేశం నాయకులు డి.జి.ధనపాల్, బి.శ్రీనివాసులు చేసిన ఈ విధ్వంసంపై పుత్తూరు సెంగుంధర్ మక్కల్ నల సంఘం ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.ఎస్.గోపిరమణ, టి.జి.శక్తివేలు, ఎం.ఎస్.తిరునావక్కర్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని యలమంచిపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ మస్తాన్‌పై టీడీపీ నాయకులు దాడిచేశారు. అడ్డుకోబోయిన ఆయన తల్లి షేక్ బీబీ తలపైకొట్టి తీవ్రంగా గాయపరిచారు. ఆమెను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తడకలూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమా వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగులబెట్టారు. మరికొన్ని గ్రామాల్లో కూడా కవ్వింపు చర్యలకు దిగుతున్నారు. గ్రామాల్లో వివాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు.

పంచాయతీలో ఫైళ్ల అపహరణ

ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు సచివాలయం, హెల్త్‌క్లినిక్ ఆవరణలోని శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అబ్బయ్యచౌదరి ఫొటోలను సుత్తితో పగులగొట్టారు. తన కార్యాలయంలో వస్తువుల్ని ధ్వంసంచేసి ఫైళ్లు అపహరించారని సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు చెప్పారు. కొప్పులవారిగూడెంలోని సచివాలయ ఆవరణలోని శిలాఫలకాలను, ప్రభుత్వ సామగ్రిని ధ్వంసం చేశారు. సచివాలయం ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసే స్థూపానికి టీడీపీ జెండా కట్టారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో బొర్రా నారాయణరావు చికెన్ దుకాణాన్ని టీడీపీ, జనసేన కార్యకర్తలు ధ్వంసం చేశారు. దీనిపై నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం సచివాలయం–1పై ఉన్న శిలాఫలకాలను ధ్వంసం చేశారు. వార్డు సభ్యులు ముప్పిడి లక్ష్మణరావు, లక్ష్మణరావులపై దౌర్జన్యానికి దిగారు. నంద్యాల జిల్లా అవుకు మండలం సంగపట్నంలో సచివాలయం, హెల్త్‌క్లినిక్ ఫైలాన్లను ధ్వంసం చేశారు. టీడీపీ, జనసేన శ్రేణులు విధ్వంసాలకు పాల్పడుతుండగా సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదని పలు గ్రామాల్లో బాధితులు తెలిపారు.

కైకలూరులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం



ఏలూరు జిల్లా వడ్లకూటితిప్పలో దుండగులు కూల్చివేసిన వైఎస్సార్ విగ్రహం

కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం వడ్లకూటితిప్పలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద 2010లో వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఆకతాయిలు కూలగొట్టారు.ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఖండించారు. విగ్రహాల కూల్చివేత ఘటనలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు



గాయపడ్డ బాలస్వామి

ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు.. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై కర్రలు, రాళ్లతో దాడులు చేస్తున్నారు. అడ్డొచ్చినవారిని చంపేస్తామంటూ బెదిరిస్తున్నారు. ఏలూరు రూరల్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర వడ్డీకుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, గార్లమడుగు వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణ కారులో వెళుతుండగా విజయరాయి వద్ద టీడీపీ వారు దాడిచేశారు. 'గెలిచింది మేమే.. మాకు తిరుగులేదు.. రండి ఇప్పుడు..' అంటూ కర్రలు, రాళ్లతో కారు అద్దాలు పగులగొట్టారు. కారులో ఉన్న కృష్ణను బలవంతంగా బయటకు లాగి పిడిగుద్దులు గుద్ది రోడ్డుపై పడేశారు. కొంతదూరం లాక్కెళ్లి కొట్టారు. గతంలో చింతమనేని ప్రభాకర్‌పై చేసిన విమర్శలకు క్షమాపణలు చెబుతున్నా అంటూ కృష్ణతో చెప్పించి వీడియో రికార్డు చేశారు. అడ్డుపడేందుకు ప్రయత్నించిన శ్రీనివాసరాజు, సంజీవ్‌కుమార్‌లను తోసేశారు. కారు అద్దాలు పగలడంతో వైఎస్సార్‌సీపీ నాయకులకు గాయాలయ్యాయి. ఈ దాడిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం కొచ్చెర్లకోట పంచాయతీ సిద్ధాయపాలెంలో సింహం లలిత, ఆమె తండ్రి చొప్పరపు బాలస్వామిపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన బాలస్వామిని తొలుత మార్కాపురం జిల్లా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యూట్యూబర్ సుంకేసుల ఆదిశేషు ఇంటిపై టీడీపీ వర్గీయులు కొడవళ్లతో దాడిచేశారు. ఆ సమయంలో ఆదిశేషు ఇంట్లో లేకపోవడంతో వారు మహిళలతో దురుసుగా మాట్లాడి సామగ్రిని చిందరవందర చేశారు. ఆదిశేషు భార్య, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీ జీవితం నా చేతుల్లో..

వలంటీర్‌కు టీడీపీ నేత బెదిరింపు



పెదమక్కెనలో ధ్వంసమైన ఆటో

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి చెందిన వలంటీర్ బాబురావును గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తీవ్రంగా బెదిరించారు. 'అరేయ్ బాబురావుగా నీ పతనం స్టార్ట్ కాబోతుంది.. ఇక నువ్వు ఫిక్స్ అయిపో.. ఇప్పుడు నీ జీవితం నా చేతుల్లో ఉందిరా.. నిన్ను నువ్వు కాపాడుకోవాలనుకున్నా.. నిన్ను వేరే వాళ్ళు కాపాడాలన్నా.. నీ జీవితాన్ని నేను తిరగరాసినా ఇప్పుడు. నీకు భయం అంటే ఏంటో చూయిస్తారా.. నా కొడకా. అరేయ్ బాబురావుగా.. ఇప్పుడు నీ జీవితం నా చేతుల్లో ఉందిరా.. నీ తలరాత బ్రహ్మ రాసినా ఇప్పుడు నీ జీవితాన్ని నేను తిరగరాస్తా.. కొడకా..' అంటూ స్టేటస్ పెట్టి మరీ హెచ్చరించారు. మరోవైపు పెదమక్కెన గ్రామంలోని ఎస్సీ కాలనీలో దళితుల ఇళ్లపై టీడీపీ వారు రాళ్లు, సీసాలు విసిరారు. అజయ్‌కుమార్ జీవనాధారమైన ఆటోను ధ్వంసం చేశారు.



తిరుపతి జిల్లాలో గోవిందమ్మ ఆలయం వద్ద కూలదోసిన శిలాఫలకం



గుంటూరు జిల్లా ఈమనిలో సచివాలయం బోర్డును రాళ్లు, సుత్తితో కొడుతున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు



ఏలూరు జిల్లా గార్లమడుగు సచివాలయం, హెల్త్‌క్లినిక్‌ల శిలాఫలకాలను ధ్వంసం చేసిన దృశ్యం

టీడీపీ వేధింపులకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ బలి

ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న యలమంచిలి ప్రవీణ్



దాడుల సంస్కృతి కొనసాగితే ఉరుకోం

పెదవేగి: టీడీపీ కార్యకర్తల వేధింపులు తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ యలమంచిలి ప్రవీణ్ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ సూర్యారావుపేటకి చెందిన ప్రవీణ్ ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ దుర్ఘటన మండలంలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అహర్నిశలు శ్రమించాడన్న కక్షతో ఓట్ల లెక్కింపు రోజు (ఈనెల 4న) సాయంత్రం ప్రవీణ్ ఇంటి మీద తెలుగుదేశం కార్యకర్తలు దాడిచేశారు. రాళ్లు, బీరు సీసాలు విసిరి, దుర్భాషలాడుతూ చంపేస్తామని బెదిరించారు. పెదవేగి పెట్రోల్ బంక్ వైపు వస్తే కొడతామని, బైక్, కారు తగలబెట్టేస్తామని హెచ్చరించారు. బుధవారం ఉదయం ప్రవీణ్ విజయరాయి పెట్రోల్ బంక్‌కి వెళ్లగా.. బండిపై మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఫొటోతో ఉన్న వైఎస్సార్‌సీపీ స్టిక్కర్ తీసేవరకు బీభత్సం సృష్టించి దాడిచేశారు. టీడీపీ వారి బెదిరింపులకు భయపడి, వేధింపులు భరించలేక ప్రవీణ్.. తన ఇంటి సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రవీణ్ తల్లిదండ్రులు యలమంచిలి రున్నీరాణి, ప్రకాశరావు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

టీడీపీ వేధింపులను భరించలేక ఆత్మహత్య చేసుకున్న ప్రవీణ్ భౌతికకాయానికి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నివాళులర్పించారు. కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రవీణ్‌ను బలితీసుకున్న టీడీపీ కార్యకర్తల అరాచకాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని, వారి ఇళ్ల మీదకు వెళ్లి భౌతికదాడులు చేస్తూ, వాహనాలు, ఇంట్లో వస్తువులు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడుల సంస్కృతి కొనసాగితే ఊరుకునేదిలేదని టీడీపీ శ్రేణులను హెచ్చరించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సంయమనం పాటించాలని కోరారు.

ఓటమిని తట్టుకోలేక ఆగిన గుండెలు



1. కణితి వెంకమ్మ (ఫైల్)
2. బెజవాడ పుల్లయ్య
3. టి. నాగేశ్వరరావు
4. రమేష్

బుట్టాయగూడెం/నూజివీడు/ఎస్.రాయవరం: వైఎస్సార్‌సీపీ ఓటమి పాలవడంతో మనస్తాపానికి గురై ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రాచూరులో కణితి వెంకమ్మ (60) గుండెపోటుతో మరణించింది. కుటుంబ సభ్యులు వెట్టి మంగాయమ్మ, కుంజా భూదేవి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకమ్మ వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటు వేసింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అవుతారని కనిపించిన ప్రతి వారికీ చెప్పింది. ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైందన్న సమాచారం తెలియడంతో మంగళవారం రాత్రి మనస్తాపానికి గురైంది. అలా బాధపడుతూనే బుధవారం గుండెపోటుతో మరణించింది.

నూజివీడు మండలంలో ఇద్దరు మృతి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకపోవడాన్ని జీర్ణించుకోలేక తీవ్ర ఉద్వేగానికిలోనై ఇద్దరు అభిమానులు ప్రాణాలు విడిచారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి చెందిన తొమ్మండ్రు నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. పాతరావిచర్లకు చెందిన బెజవాడ పుల్లయ్య (52) వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక మంగళవారం గుండెపోటుకు గురయ్యాడు. అతనిని వెంటనే విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. దీంతో రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది.

టీవీ చూస్తూ కుప్పకూలిన కార్యకర్త

వైఎస్సార్‌సీపీ పరాజయాన్ని తట్టుకోలేక అనకాపల్లి జిల్లా పి.ధర్మవరంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుండె ఆగింది. మంగళవారం ఎన్నికల లెక్కింపు వార్తలను టీవీలో చూస్తూ రెడ్డిపల్లి రమేష్ (50) ఇంట్లో కుప్పకూలాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన రమేష్ ఈ ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక మృతి చెందినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలు నిర్వహించారు. రమేష్‌కు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు.

ఈవీఎంలను తారుమారు చేయడం వల్లే ఓడిపోయా

- ఈవీఎంలపై చాలా అనుమానాలు ఉన్నాయి
- ఈసీ దర్యాప్తు చేయాలి
- మడకశిర వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప



మడకశిర: ఈవీఎంలను తారుమారు చేయడం వల్లే తాను ఓడిపోయానని శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈర లక్కప్ప చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఈవీఎంలపై తనకు చాలా అనుమానం ఉందని తెలిపారు. రొళ్ల మండలం పిల్లిగుండ్లు 131 బూత్ ఈవీఎంను తారుమారు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. అసెంబ్లీకి సంబంధించిన ఈవీఎం లోక్‌సభ టేబుల్‌కు వెళ్లడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. లోక్‌సభ ఈవీఎం అసెంబ్లీ టేబుల్‌కు వచ్చిందని చెప్పారు. ఈ ఈవీఎంలో పోలైన ఓట్లను పరిశీలిస్తే చాలా అనుమానాలు కలిగాయని తెలిపారు. ఈవీఎం బటన్ నొక్కితే వైఎస్సార్‌సీపీకి ఐదు ఓట్లను మాత్రమే చూపించిందని తెలిపారు. అనుమానం వచ్చి ఆర్వోకు ఫిర్యాదు చేయడంతో వీవీ ప్యాట్లలోని స్లిప్‌లను లెక్కించగా వైఎస్సార్‌సీపీకి 414 ఓట్లు వచ్చాయన్నారు. అదేవిధంగా అమరాపురం మండలం హేమావతి 36వ బూత్ ఈవీఎం అసలు ఓపెన్ కాలేదన్నారు. దీంతో వీవీ ప్యాట్లలోని స్లిప్‌లను లెక్కించాల్సి వచ్చిందన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపులో ఇలాంటి లోపాలు ఎన్నో జరిగి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా ఇలాంటి లోపాలు ఉంటాయనే సందేహాలు కలుగుతున్నాయన్నారు. వీటిపై ఎన్నికల కమిషన్ దర్యాప్తు చేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో ఎంతో కష్టపడి పని చేశారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను గెలవలేకపోయినా, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలు

- మడకశిర, భీమవరం ఘటనల్లో బట్టబయలు
- కారుమూరి నాగేశ్వరరావు



పేదలకు మంచి చేయాలనే తపనే

తణుకు అర్బన్: ఈవీఎంలు ట్యాంపరింగ్ అయ్యాయనే విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని వైఎస్సార్‌సీపీ నేత కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మడకశిరలో ఈవీఎంలు మారిన వైనంతో పాటు కొందరు అధికారుల తీరు కూడా అనుమానాస్పదంగా ఉందని విమర్శించారు. అక్కడ వైఎస్సార్‌సీపీకి వచ్చిన 414 ఓట్లకు బదులుగా 5 ఓట్లు చూపించడం, పార్టీ ఏజెంట్లు నిలదీయడంతో అధికారులు తిరిగి మార్చడం వంటి పరిణామాలు దారుణమన్నారు. భీమవరంలో సైతం ఈవీఎంలను ఎలాంటి సెక్యూరిటీ లేకుండా ప్రైవేట్ వాహనాల్లో తరలించడం కూడా బయటపడిందని చెప్పారు. కూటమి నేతలు మొదటి నుంచి అబద్ధాలను, చెడును ఒకటికి పదిసార్లు భూతద్దంలో చూపించి సఫలమయ్యారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వంటి అంశంలో ప్రభుత్వంపై చెడు ప్రచారం ఎంత వేగంగా వెళ్లిందో ఈ ఎన్నికలే నిదర్శనమని అన్నారు. పేదలకు మంచి చేయాలనే సదుద్దేశంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేశారని, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలకు మంచి చేశారని కారుమూరి స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు సైతం మంచి గిట్టుబాటు ధర ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసే విధానాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. కులం, మతం, పార్టీ భేదాల్లేకుండా అందరికీ మంచి చేసే మంచి గుణాన్ని ప్రజలు విశ్వసించకపోవడం బాధాకరమన్నారు. ఎంతసేపూ పేదలకు మేలు చేయాలనే తపనతోనే జగన్ ఉండిపోయారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ ఐదేళ్లు నీతి, నిజాయితీతో ప్రజల్లో ఉన్నారని.. వారందరికీ అండగా ఉంటానని అన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, తణుకు పట్టణం, తణుకు, అత్తిలి మండలాల అధ్యక్షులు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు, పైబోయిన సత్యనారాయణ, ఇరగవరం మండల మహిళా విభాగం అధ్యక్షురాలు మెట్ల కిరణ్మయి పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల దౌర్జన్యం

- రైస్ వాహనానికి టీడీపీ జెండాలు కట్టి జగన్ చిత్రపటాన్ని చించివేసిన వైనం
- రైస్ పంపిణీదారుడిపై దాడికి యత్నం
- కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఘటన



ఎండీయు వాహనంపై జగన్ స్టిక్కర్‌ను చించిన టీడీపీ కార్యకర్తలు

మచిలీపట్నంటౌన్: ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడంతో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఆ పార్టీ శ్రేణులు దౌర్జన్యాలకు దిగుతున్నాయి. ఓ పక్క కౌంటింగ్‌లో టీడీపీకి అనుకూల పవనాలు వీస్తున్న సమయంలో పేర్ని వెంకట్రామయ్య (నాని) ఇంటి సమీపంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వి దాడులకు పాల్పడిన టీడీపీ, జనసేన కార్యకర్తలు బుధవారం మళ్లీ దాడులకు యత్నించారు. నగరంలోని పలు కాలనీల్లో ఆయా ప్రాంతాల్లోని టీడీపీ కార్యకర్తలు బైక్‌ల సైలెన్సర్లు తీసి పెద్ద శబ్దాలతో హడావుడి చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తల నివాసప్రాంతంలో పెద్ద ఎత్తున బాణాసంచాను కాలుస్తూ నినాదాలు చేస్తూ కవ్వింపు చర్యలకు దిగారు. బుధవారం నగరంలోని 28వ డివిజన్ ఓగీస్‌పేట ప్రాంతంలో మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండీయు) వాహనం ద్వారా నిర్వాహకుడు పిండి శ్యాంబాబు కార్డుదారులకు సరుకులు అందజేస్తున్నాడు. ఈ సమయంలో ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకుని ముందు వాహనం నుంచి దిగాలని శ్యాంబాబును దౌర్జన్యంగా దింపి దాడి చేయబోయారు. దీంతో అక్కడే ఉన్న ప్రజలు అడ్డుకున్నారు. వాహనానికి టీడీపీ జెండాలను కట్టి జగన్ స్టిక్కర్లను చించివేశారు. దీంతో శ్యాంబాబు విషయాన్ని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో పాటు డీఎస్‌వో, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. బుధవారం వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున గురువారం ఆ ప్రాంతానికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాలని, మళ్లీ వారు ఏమైనా ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు.

ఎన్నికల ఫలితాలపై సందేహాలున్నాయి

- వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్

సాక్షి, అమరావతి: ఏపీలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ కూటమి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి గెలిచిందని చెప్పారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదన్నారు. ఎలక్షన్ కమిషన్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కుట్ర చేసిందని ఆరోపించారు. ఓటమి భయంతో కూటమి కట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థులకు లక్షల్లో మెజారిటీ రావడం, జనసేన పార్టీ పోటీ చేసిన స్థానాల్లో అన్నింటిలోనూ గెలవటంపై అనుమానాలున్నాయన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయకపోతే టీడీపీకి 135, జనసేన 21, బీజేపీ 8 స్థానాల్లో గెలిచే సత్తా లేదని ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. బాబు వ్యవస్థలను మేనేజ్ చేసి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయించారని, సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి, అనుమానాలను నివృత్తి చేయాలన్నారు.

క్లుప్తంగా...

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల జయకేతనం


పి.పవన్ కుమార్ రెడ్డి


జీ.భాను తేజ సాయి


వి.ముఖేష్ చౌదరి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నీట్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు. శ్రీచైతన్య విద్యా సంస్థల విజయవాడ బ్రాంచ్‌కి చెందిన పి.పవన్‌కుమార్‌రెడ్డి, జి.భానుతేజసాయి, వి.ముఖేష్ చౌదరి 720 మార్కులకు గాను 720 మార్కులతో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. 715 మార్కులకు పైగా ఎనిమిది మంది, 710 మార్కులుపైగా 17 మంది, 705 మార్కులు పైగా 23 మంది, 700 మార్కులకుపైగా 35 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థల్లోని విద్యార్థులు వివిధ కేటగిరిల్లో 1500లకు పైగా మెడికల్ సీట్లు కైవశం చేసుకోబోతున్నారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ర్యాంకులు పొందిన విద్యార్థులను అభినందించారు.

నీట్‌లో మెరిసిన పవన్

720 మార్కులతో జాతీయస్థాయిలో మొదటిర్యాంకు


పవన్‌కుమార్‌రెడ్డి

గాండ్లపెంట: శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం పోరెడ్డివారిపల్లికి చెందిన పోరెడ్డి వసంత రెడ్డి, చంద్రకళ దంపతుల కుమారుడు పోరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి నీట్‌లో మెరిశాడు. 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించి జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. పవన్ 1-8వ తరగతి వరకు కదిరి నారాయణ పాఠశాలలో చదివాడు. 9,10వ తరగతి గుడివాడలో చదివాడు. ఇంటర్ శ్రీచైతన్య కళాశాల (విజయవాడ)లో చదివాడు. ఈ ఏడాది మే 5న నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో కార్డియాలజిస్ట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పవన్‌కుమార్‌రెడ్డి చెప్పాడు.

మూడు రోజులు వానలు!

- రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు
- గంటకు 30-40 కి.మీల వేగంతో గాలులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు పడనున్నాయి. నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనాలు దీనికి దోహదపడుతున్నాయి. ప్రస్తుతం రుతుపవనాలు కోస్తాంధ్రలో నెమ్మదిగా కదులుతున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో ఇవి మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. అదే సమయంలో రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఒకటి, కోస్తా కర్ణాటక ప్రాంతంలో మరొక ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉన్నాయి. వీటి ఫలితంగా గురువారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే శుక్రవారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షాలకు ఆస్కారం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, శ్రీకాకుళం, అల్లూరి, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని వివరించింది. అదే సమయంలో గంటకు 30-40 కి.మీల వేగంతో ఈదురుగా గాలులు వీస్తాయని, కొన్నిచోట్ల పిడుగులు పడే వీలుందని పేర్కొంది.


బుధవారం సాయంత్రం చిక్కమగళూరు శివార్లలో నెమలి వయ్యారాలు

మయూర నాట్యం

తొలకరి జల్లు కురిసింది. పుడమి తల్లి పులకరించింది. అందమైన.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓ మయూరం పురివిప్పి తన్మయత్వంతో నాట్యమాడి కనుల విందు చేసింది. ఈ అద్భుత ఘటన బెంగళూరులోని చిక్కమగళూరు శివారులో బుధవారం సాయంత్రం జరిగింది.

వెలుగులోకి మరో 'కౌంటింగ్' మాయ

పెదకూరపాడు నియోజకవర్గంలో 737 ఓట్లున్న ఈవీఎం లెక్కించని అధికారులు

అచ్చంపేట: ఎన్నికల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో ఈవీఎం మారిపోయిన సంఘటన ఇప్పటికే బయటపడగా, తాజాగా పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలో ఓ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలో నమోదైన ఓట్లను లెక్కించకుండానే అధికారులు పక్కన పడేసిన వైనం వెలుగులోకి వచ్చింది. ఈ నియోజకవర్గంలోని అచ్చంపేట జెడ్పీ హైస్కూలులో ఉన్న 56వ పోలింగ్ బూత్‌లో ఈవీఎంలో ఓట్లను లెక్కించకుండానే అధికారులు పక్కన పెట్టేశారని కౌంటింగ్ ఏజెంట్లు తెలిపారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా, ఈవీఎంలో సాంకేతిక లోపం తలెత్తిందని, అది ఓపెన్ కావడంలేదని, అందువల్ల లెక్కింపు సాధ్యం కావడంలేదని చెప్పారని ఏజెంట్లు చెప్పారు. ఈ బూత్‌లో మొత్తం 737 ఓట్లు ఉన్నాయి. అందులో 357 మంది పురుషులు, 380 మంది మహిళలు ఉన్నారు. అచ్చంపేట మండలంలో 2019 ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి 7,597 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈసారి టీడీపీకి ఈ మండలంలో 161 ఓట్ల మెజార్టీ వచ్చింది. అయితే, 56వ పోలింగ్ బూత్‌లో ఓట్లను లెక్కించకుండానే టీడీపీకి 161 ఓట్ల మెజార్టీ వచ్చినట్లు అధికారులు ఎలా ధృవీకరిస్తారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నేతల ఒత్తిడి మేరకే అధికారులు ఈ విధంగా, చేశారని, వైఎస్సార్‌సీపీని దెబ్బ తీయడానికి ఇంకా బయటపడని ఘోరాలు ఇంకెన్ని జరిగాయోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై దాడి

- ఉమామహేశ్వర నాయుడు ఇంటిపై టీడీపీ నాయకుల దాష్టీకం
- ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నేత ఉమామహేశ్వర నాయుడు ఇంటిపై టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విజయోత్సవ ర్యాలీ జరిగింది. రాత్రి 10.20 గంటల సమయంలో ర్యాలీ ఉమామహేశ్వర నాయుడు ఇంటి మీదుగా వెళ్లింది. ఎమ్మెల్యే ముందుకెళ్లిన తర్వాత ఆయన అల్లుడు ధర్మతేజ చౌదరి, అవినాష్ చౌదరి, ఆయన కుమారుడు యశ్వంత్ చౌదరి, ఇత టీడీపీ నాయకులు ఒక్కసారిగా కేకలు వేస్తూ ఉమా ఇంటిపై దాడి చేశారు. సమీపంలో ఇంటి నిర్మాణం కోసం తోలిన రాళ్లను ఉమా ఇంటిపైకి విసిరారు. ఈ దాడిలో ఉమా ఇంటి పైకప్పు అద్దాలు ధ్వంసమయ్యాయి. అక్కడ పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలూ పగిలిపోయాయి. దాడి సమయంలో ఉమామహేశ్వర నాయుడు ఇంటిలో లేరు. కుటుంబ సభ్యులు మాత్రమే ఉన్నారు. టీడీపీ నాయకుల దుశ్చర్యతో బెంబేలెత్తిపోయిన కుటుంబ సభ్యులు బయటకు రాలేదు. ఇదంతా పోలీసుల సమక్షంలోనే జరిగింది. అయినా వారు ప్రేక్షకపాత్ర వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ టీడీపీ నేతలు రెచ్చిపోయినా పోలీసులు పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం.

పోలైన ఓట్లకు ఈవీఎంలలో ఓట్లకు తేడాలున్నాయి

- రెండు బూత్‌లలో 152 ఓట్లు అధికం
- కొన్ని బూత్‌లలో తక్కువ ఓట్లు
- పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతాం
- వైఎస్సార్‌సీపీ వేమూరు అసెంబ్లీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

వేమూరు(తెనాలి): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం ఈవీఎంలపై తనకు అనుమానాలున్నాయని ఆ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు చెప్పారు. తన నియోజకవర్గంలోని కొన్ని బూత్‌లలో పోలైన ఓట్లకంటే లెక్కింపులో ఎక్కువ వచ్చాయని, కొన్నింటిలో తక్కువ వచ్చాయని వివరించారు. వేమూరు మండలం జంపనిలోని 98వ నంబరు పోలింగ్ బూత్‌లో మొత్తం 1030 ఓట్లు ఉన్నాయని, వాటిలో 810 ఓట్లు పోలైనట్టు చెప్పారు. కౌంటింగ్ రోజున ఈవీఎంలో 901 ఓట్లు లెక్క వచ్చినట్టు చెప్పారని, 91 ఓట్లు అదనంగా ఎక్కడ్నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఇదేవిధంగా చుండూరు మండలం నడిగడ్డపాలెంలోని 13వ బూత్‌లో మొత్తం ఓట్లు 1030 కాగా, 833 ఓట్లు పోలయ్యాయని తెలిపారు. కౌంటింగ్ రోజున ఆ ఈవీఎంలో 894 ఓట్లు లెక్కించారని, 61 ఓట్లు అదనంగా ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేవలం రెండు బూత్‌లలోనే 152 ఓట్లు అదనంగా రావటం, మరో అయిదారు బూత్‌లలో పోలైన ఓట్లకన్నా తక్కువగా ఈవీఎంలలో చూపారని, ఇవేమి అక్రమాలని ప్రశ్నించారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి, తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఎంబీబీఎస్‌లో ఏ ర్యాంక్‌కు ఎక్కడ సీటొస్తుంది?

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు అంచనా వేసుకుంటున్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు కళాశాలల ప్రాధాన్యత క్రమం ఏ విధంగా ఉండాలో కసరత్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేటు, రెండు మైనారిటీ, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఉన్నాయి. వీటిలో 5,360 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో 2,935 సీట్లు 16 ప్రభుత్వ వైద్య కళాశాలలకు సంబంధించినవి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 15 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. మిగిలినవి రాష్ట్ర కోటాలో భర్తీ చేస్తారు. మరోవైపు బీ కేటగిరిలో 85 శాతం సీట్లలో మన విద్యార్థులకే అవకాశం కల్పిస్తోంది.

అందరి చాయిస్ ఆంధ్ర కళాశాల

రాష్ట్రంలో వైద్య విద్య అభ్యసించే విద్యార్థుల మొదటి చాయిస్ ఆంధ్ర వైద్య కళాశాలే. ఈ కళాశాలలో సీటు రావడమే అదృష్టంగా భావిస్తారు. ఈ కళాశాలలో గత ఏడాది ఎస్టీ విభాగంలో 490 స్కోర్‌తో 118377 ర్యాంక్ సాధించిన విద్యార్థికి చివరి సీటు వచ్చింది. ఎస్సీ విభాగంలో 545తో 67614 ర్యాంక్, బీసీ-ఏలో 596తో 31456, బీసీ-బి 612తో 22315, బీసీ-సిలో 591తో 34134, బీసీ-ఈలో 548తో 24384, ఓసీ కేటగిరీలో 621తో 17976, ఈడబ్ల్యూఎస్‌లో 608తో 24384 ర్యాంకు వరకు సీట్లు పొందారు.

2023-24లో రిజర్వేషన్ కేటగిరీ వారీగా రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయిలా

కేటగిరి	నీట్ ర్యాంక్	స్కోర్
బీసీ-ఎ	152602	459
బీసీ-బి	112158	496
బీసీ-సి	166925	447
బీసీ-డి	111696	497
బీసీ-ఈ	153509	458
ఈడబ్ల్యూఎస్	77920	533
ఓసీ	69941	543
ఎస్సీ	161655	451
ఎస్టీ	211061	413

మైనార్టీ కళాశాలలు	చివరి ర్యాంక్	స్కోర్
ఫాతిమా వైద్య కళాశాల, కడప	136896	473
నిమ్రా, విజయవాడ	184353	433

2023-24లో ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా ఏ ర్యాంక్ వరకూ సీట్లు వచ్చాయంటే

విభాగం	ర్యాంక్	స్కోర్
ఓసీ	329358	342
బీసీ-ఎ	427011	297
బీసీ-బి	368739	323
బీసీ-సి	321838	346
బీసీ-డి	336327	339
బిసి-ఈ	1085495	125
మైనార్టీ	1037708	133
ఎస్సీ	323513	345
ఎస్టీ	516995	262


ఏఏజీ పొన్నవోలు రాజీనామా

- పీపీ పదవికి నాగిరెడ్డి రాజీనామా
- అదనపు పీపీ, పలువురు ప్రభుత్వ న్యాయవాదులు కూడా రాజీనామా
- సొంత లా పుస్తకాలను తీసుకెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- పోలీసుల తీరుపై మండిపడుతున్న న్యాయవాదులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కి బుధవారం పంపారు. రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) యర్రంరెడ్డి నాగిరెడ్డి, అదనపు పీపీ శెట్టిపల్లి దుష్యంత్ రెడ్డి, పలువురు ప్రభుత్వ న్యాయవాదులు కూడా వారి పదవులకు రాజీనామా చేశారు. పీపీ నాగిరెడ్డి, ఏపీపీ దుష్యంత్ రెడ్డి తమ రాజీనామా లేఖలను న్యాయశాఖ కార్యదర్శికి పంపారు. అయితే ప్రస్తుతం వెకేషన్ కోర్టు నడుస్తున్నందున, అందరూ ఒకేసారి రాజీనామా చేస్తే కేసుల విచారణకు ఇబ్బంది కలుగుతుంది. అందువల్ల ఏజీపీలు, ఏపీపీలు కొద్ది రోజుల తర్వాత రాజీనామా చేసే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు ప్రభుత్వ న్యాయవాదులు ఛాంబర్లను ఖాళీ చేశారు. వారి సొంత లా బుక్స్‌ను వెంట తీసుకెళ్లారు. అయితే బుధవారంనాడు కొందరు ప్రభుత్వ న్యాయవాదులు తమ లా బుక్స్‌ను, కేస్ లా పుస్తకాలను తీసుకెళుతుండగా హైకోర్టు పోలీసులు అడ్డుకున్నారు. హైకోర్టు నుంచి వేటినీ తీసుకెళ్లకుండా చూడాలంటూ సచివాలయం నుంచి ఆదేశాలు అందాయని పోలీసులు చెప్పడంతో న్యాయవాదులు ఆ పుస్తకాలను అక్కడే వదిలి వెళ్లారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు చేయాలని న్యాయవాదులు భావిస్తున్నారు. కేసు ఫైళ్లను తీసుకెళితే అభ్యంతరం చెప్పొచ్చు గానీ, తమ సొంత లా పుస్తకాలను, కేస్ లా పుస్తకాలను తీసుకెళుతుంటే అడ్డుకోవడంపై వారు మండిపడుతున్నారు.

జిల్లా వార్తలు

144 సెక్షన్‌తో నిర్మానుష్యంగా రోడ్లు


జనసంచారం లేని కారెంపూడి బస్టాండ్ సెంటర్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చాటుమాటుగా వ్యాపారాలు చేస్తున్న కొందరు వ్యక్తులు
- నేడు కూడా వ్యాపారాలు బంద్


గడియారం స్తంభం వద్ద వాహనాలను ఆపి చోదకులను ప్రశ్నిస్తున్న పోలీసులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో పోలీసులు పకడ్బందీగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 13న జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసాత్మక సంఘటనలపై అధికారులు స్పందించి 144సెక్షన్ అమల్లోకి తీసుకొచ్చారు. కొన్నాళ్లు పకడ్బందీగా నిర్వహించిన పోలీసులు.. కౌంటింగ్‌కు వారం ముందు సడలింపులు ఇచ్చారు. తర్వాత కౌంటింగ్ ప్రక్రియ సమీపిస్తుండటంతో ఈనెల ఒకటో తేదీ నుంచి మళ్లీ అమలులోకి తీసుకొచ్చారు. వ్యాపారాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. సినిమా థియేటర్లలో ప్రదర్శనలు నిలిపివేశారు. ప్రజలు గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. వన్ టౌన్, టుటౌన్ సీఐల ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు సెక్షన్ అమలు చర్యలను చేపట్టారు. మంగళవారంతో కౌంటింగ్ ప్రక్రియ ముగియటంతో బుధవారం ఒక్కసారిగా ప్రజలు తమ కార్లు, ద్విచక్ర వాహనాలతో రోడ్లపైకి వచ్చారు. గత నాలుగు రోజుల నుంచి ఉక్కబట్టుకొని ఉన్న ఆటోవాలాలు రోడ్లపైకి వచ్చి ప్రయాణికులను చేరవేయటం ప్రారంభించారు. దీనిని గమనించిన పోలీసులు ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేశారు. రోడ్లపైకి ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించి, వారి వాహనాల పత్రాలను పరిశీలించారు. సక్రమంగా లేని వాటిని అదుపులోకి తీసుకున్నారు.

చాటుమాటుగా విక్రయాలు

నరసారావుపేట పట్టణంలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు చాటుమాటుగా మద్యం విక్రయాలు చేశారు. ఆర్‌యూబీకి సమీపంలో స్టేషన్‌రోడ్డుపైనున్న బార్ నిర్వాహకులు రహస్యంగా విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రకాష్‌నగర్‌లోని స్టేషన్‌రోడ్డు రిక్షాసెంటర్ సమీపంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న జనరల్ షాపులో విక్రయాలు సాగిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవటం విశేషం. కొన్నిరోజులుగా కూరగాయల దుకాణాలను సైతం తెరవనీయకపోవటంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. వీరికి కర్రీ పాయింట్లు ఊరట ఇస్తున్నాయి. ఈ దుకాణాల వద్ద ప్రజలు గుమికూడారు.

నేడు కూడా షాపులకు సెలవు

పోలీసుల విజ్ఞప్తి మేరకు గురువారం కూడా పట్టణంలో దుకాణాలు తెరవొద్దని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్ బాబు బుధవారం వెల్లడించారు.

మాచర్లలో..

మాచర్ల: పట్టణంలో మే 13 నుంచి 144 సెక్షన్ కొనసాగుతోంది. ఎక్కడిక్కడ గస్తీ ఏర్పాటు చేశారు. రింగ్‌రోడ్డు సెంటర్, వెల్దుర్తికి వెళ్లే రహదారి, గుంటూరు రోడ్డు, నెహ్రూనగర్, పట్టణంలో పలు ప్రధాన ప్రాంతాల్లో నిరంతరం స్పెషల్ పార్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, పలువురు పోలీసు సిబ్బంది నిరంతరంగా కాపలా ఉంటున్నారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అనుమానిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, తనిఖీలు చేస్తున్నారు. మాచర్లలో గ్రామీణ ప్రాంతాల నుంచి కొత్త వ్యక్తులు రాకుండా చర్యలు చేపట్టారు. ఎటు చూసినా పట్టణంలో పోలీసులే కనిపిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నారు. పలు వాహనాలను స్టేషన్‌కు తరలించి, పత్రాలు లేని వాటిని సీజ్ చేస్తున్నారు.

కారెంపూడిలో..

కారెంపూడి: కారెంపూడిలో 144 సెక్షన్ కొనసాగుతోంది. దీంతో పట్టణంలో బుధవారం కూడా వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. షాపులన్నీ మూతపడ్డాయి. ఒక్క మెడికల్ షాపులు మాత్రమే తెరిచారు. ఆర్టీసీ బస్సులు మాత్రం యధాతథంగా తిరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లలో పోలీస్ పహారా కొనసాగుతోంది. ఎన్నికల సందర్భంగా మండలంలో చోటు చేసుకున్న విధ్వంసకర ఘటనలు, దాడుల నేపథ్యంలో విధించిన 144 సెక్షన్ ఇంకా కొనసాగుతోంది. ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు ఇలాగే ఉంటుందని అధికారులు తెలిపారు.

హద్దు మీరితే క్రిమినల్ చర్యలే

- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరిక
- యడ్లపాడు, నాదెండ్ల స్టేషన్‌ల సందర్శన
- కౌంటింగ్ నేపథ్యంలో నమోదైన కేసులపై ఆరా


రొంపిచర్ల పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మలికా గార్గ్

యడ్లపాడు/నాదెండ్ల: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రతిచిన్న ఘటనను కూడా సీరియస్‌గా పరిగణనలోకి తీసుకుని కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు స్టేషన్లను బుధవారం ఆమె సందర్శించారు. రెండు మండలాల్లో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా నెలకొన్న ఘటనల గురించి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. యడ్లపాడు స్టేషన్‌లో విలేకర్లతో ఎస్పీ మలికా గార్గ్ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఎంతో సజావుగా, ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. ఫలితాల అనంతరం కొద్దిపాటి అల్లర్లు జరిగాయని చెప్పారు. చిన్న ఘటనను సైతం సీరియస్‌గా పరిగణిస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగానే 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేశామన్నారు. యడ్లపాడు ఎస్సీకాలనీలో జరిగిన ఘర్షణ, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెంలో వైఎస్సార్ విగ్రహం కూల్చివేతపై ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేసి, బాధ్యులను అరెస్టు చేశామన్నారు. ఘటన చిన్నదైనా, పెద్దదైనా ఒకే దృష్టితో చూస్తామని చెప్పారు. కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తామని తెలిపారు.

మారకుంటే 144 సెక్షన్ కొనసాగింపే...

ఇంకా ఎస్పీ మాట్లాడుతూ... ''కలెక్టర్‌తో సమీక్షిస్తాం. పరిస్థితులు ఇదే విధంగా ఉంటే 144 సెక్షన్‌ను మళ్లీ కొనసాగించక తప్పదు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే సహకరిస్తున్నారు. కాని కిందిస్థాయిలో కొందరు ఇలాంటి అల్లర్లు సృష్టిస్తున్నారు. ప్రజల సమస్యల్ని దృష్టిలో ఉంచుకుని శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భాగస్వాములు కావాలి.

నగదు సీజ్...పైగా కేసులు ఖాయం..

కోడ్ వచ్చినప్పటి నుంచి జిల్లాలో ప్రీపోల్, పోస్ట్‌పోల్, హోల్డింగ్ కేసులు 160 వరకు నమోదు చేశాం. 1,220 మందిని అరెస్టు చేశాం. దాదాపు 400 మందిపై రౌడీషీట్ ఓపెన్ చేశాం. మరికొందరిపై బైండోవర్ కేసులు కట్టాం. అయినా అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. వారికి హామీ ఉంచిన నగదు సీజ్ చేసి, తిరిగి వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు సిద్ధం అవుతున్నాం. సుదీర్ఘ కాలం రౌడీషీట్ల కేసుల్ని పరిశీలిస్తామని, ప్రస్తుతం వారి నడవడికలో మార్పుల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీల్లో విభజించి.. సీ కేటగిరీ వారిపై కేసుల్ని క్లోజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటా''మన్నారు.

రెండు రోజుల్లో వాహనాల రిలీజ్..

ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పట్టుబడిన వందలాది వాహనాలను రెండు రోజుల్లో విడుదల చేస్తామని ఎస్పీ తెలిపారు. ఆధారాలు చూపి వాటిని తీసుకెళ్లేలా ఆదేశించామన్నారు. పొల్యూషన్, ట్యాక్స్ వంటి వాటిని కూడా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా చెక్ చేయించి రిలీజ్ చేస్తామని వెల్లడించారు. లేని వాటిని కోర్టుకు అప్పగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ భూపాల్, రూరల్ సీఐ పి శ్రీనివాసరెడ్డి, ఇన్‌ఛార్జి సీఐ సుబ్బారెడ్డి, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్, నాదెండ్ల ఎస్ఐ జె బలరామ్‌రెడ్డి ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత


రొంపిచర్ల: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించిన సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఆమె వెంట డీఎస్పీ సుధాకర్‌రావు, రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కె.పి.రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తాం

వినుకొండ(నూజెండ్ల): జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలవుతున్న నేపథ్యంలో కౌంటింగ్ అనంతరం ఘర్షణలకు పాల్పడేవారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని పల్నాడు జిల్లా ఎస్పీ హెచ్చరించారు. బుధవారం వినుకొండ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. కౌంటింగ్ ముగిసిన రోజున ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కళ్యాణమండపాన్ని కొందరు ధ్వంసం చేసిన ఘటనలో సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించామని, వారు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే సహించం

- వాటిని ప్రోత్సహించినా చర్యలు తప్పవు
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్
- యడ్లపాడు ఎస్సీ కాలనీలో అవగాహన సదస్సుకు ఆదేశం


జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్న యడ్లపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు

యడ్లపాడు: టీడీపీ విజయోత్సవాల సందర్భంగా యడ్లపాడు ఎస్సీ కాలనీ(పైపల్లె)లో జరిగిన ఘర్షణకు సంబంధించి సామరస్యంగా పరిష్కారం చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీని వైఎస్సార్‌సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కల్లూరి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పిడతల దయాసాగర్, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు కలిశారు. ఈనెల నాల్గో తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత యడ్లపాడు ఎస్సీకాలనీలో టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఈ క్రమంలో టీడీపీ కార్యకర్తలు కాలనీవాసుల్ని అసభ్య పదజాలంతో దూషించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి, ఘర్షణకు దారితీసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి కేవలం ఒకవర్గం వారినే 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఎంతవరకు సమంజసమని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అలాంటి గొడవలు జరగకుండా తాము బాధ్యత వహిస్తామని ఎస్పీకు విన్నవించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇరువర్గాలను పిలిపించి సమస్యకు సామరస్యంగా పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం ఇరువర్గాలపై కేసులు నమోదు అయ్యాయని ఎస్పీ చెప్పారు. అయితే శాంతియుత వాతావరణం కల్పించేలా ఎస్సీకాలనీలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సీఐ పి. శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్‌ను ఎస్పీ ఆదేశించారు. రాజకీయ నేతలు, స్థానిక పెద్దలు ఎలాంటి ఘర్షణలను ప్రోత్సహించవద్దన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైనట్లు తెలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

11న గుంటూరులో సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం


సాంబయ్య (ఫైల్)


దేపురు భారతి

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలం ఖాజీపేటకు చెందిన సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న అవార్డు ప్రదానోత్సవం ఈనెల 11వ తేదీన గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కంచి కామకోటి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికలో జరుగనుంది. సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటయ్యే సభలో 'విద్యాప్రదాత' సీహెచ్ సాంబయ్య స్మారక అవార్డును తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ దేపురు భారతికి ప్రదానం చేయనున్నారు. పరిషత్ అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2009లో స్థాపించిన తమ పరిషత్‌చే ఏటా విద్య, వైద్య, వైజ్ఞానిక, కళాసేవ అంశాల్లో ఒక ప్రముఖుడికి ప్రదానం చేసి సత్కరిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రొఫెసర్ దేపురు భారతిని ఎంపిక చేశామన్నారు. అవార్డు ప్రదానోత్సవంలో ఏటా పదో తరగతి పరీక్షల్లో జిల్లా/రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు సాధించిన విద్యార్థికి ప్రతిభా పురస్కారం, రూ.10 వేల నగదును అందజేస్తున్నట్టు గుర్తు చేశారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో అత్యధికంగా 599/600 మార్కులు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయి మనస్వినికి 10 వేల ప్రోత్సాహక నగదుతో ప్రతిభాపురస్కారం అందిస్తామని తెలిపారు. ఇదే వేదికపై విజయవాడకు చెందిన నాట్య మయూరి లేఖ్యా భరణి బృందంచే నృత్య ప్రదర్శన మరో అంశమని వివరించారు. తమ సంస్థచే పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
గురువారం ॥ 6-6-2024

మగ్గం పనిలో ముత్తులక్ష్మి



''ఇంట్లో మగ్గం ఉంది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. నా గ్రామం నుంచి విదేశాలతో అనుసంధానం కావడానికి ఇవి చాలు. నేను నేసిన చీరను ఈ కామర్స్ వేదికల ద్వారా నేనే మార్కెట్ చేసుకోగలుగుతున్నాను. నా చేతుల్లో తయారైన చీరను ధరించే వారి చేతికి చేర్చే సాంకేతిక మార్గాలను నేర్చుకున్నాను. వందల మంది మహిళలం సంఘటితమయ్యాం. మాలోని నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటుతున్నాం. మేము గౌరవప్రదమైన ఉపాధిని పొందుతున్నాం'' అంటోంది తమిళనాడుకు చెందిన ముత్తులక్ష్మి. ఆమె మాటలు అక్షరసత్యాలు.

సాధికార మహిళలు

వైవిధ్యతే ఉపాధి

భాషలు, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లలో మాత్రమే కాదు మనదేశంలో ఉన్న వైవిధ్యత... కళలు, కళాత్మకతల్లోనూ ఉంది. దాదాపుగా ప్రతి ఇంట్లోనూ ఆ కళాత్మకత ఉంటుంది. స్థానికంగా లభించే వస్తువులతో మహిళల చేతిలో రూపుదిద్దుకునే అనేక వస్తువులు ఇప్పుడు వారికి ఉపాధిమార్గాలవుతున్నాయి. దేశంలో దాదాపుగా ఏడు కోట్ల మంది చేతిలో కళ ఉంది. ఆ చేతుల్లో అందమైన హస్తకళాకృతులు తయారవుతున్నాయి. అందులో సగానికి పైగా మహిళలే. ఒకప్పుడు ఆ పని తమకు ఉపాధినిస్తుందని, గుర్తింపును తెస్తుందని తెలియదు వాళ్లకు. తెలిసినా సరే, మధ్య దళారుల దోపిడీకి గురవుతూ అరకొరగా లభించే రుసుముతోనే సంతృప్తి చెందే వాళ్లు. ఇప్పుడు మహిళలు చురుగ్గా ఉన్నారు. తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టే మాధ్యమాల పట్ల అవగాహన పెంచుకుంటున్నారు. హస్తకళాకృతులు తయారు చేసే కుటుంబాల్లోని మగవారు మెరుగైన ఉపాధి కోసం ఆ వృత్తులను వదిలేస్తున్న తరుణంలో ఆ ఇళ్లలోని మహిళలు తమ వారసత్వ కళను కొనసాగిస్తూ తమ కంటూ ప్రత్యేకమైన గౌరవాన్ని, అదే స్థాయిలో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ముత్తులక్ష్మి ఇంట్లో పవర్‌లూమ్ ఉంది. ఆ మరమగ్గం మీద ఆమె నెలకు పది చీరలను నేయగలుగుతోంది. తమిళనాడులోని అరుపోకోటాయ్ బ్లాక్ చేనేత చీరలకు ప్రసిద్ధి. అక్కడ నేసే చీరలను కూడా అదే పేరుతో అరుప్పుకోటాయ్ చీరలుగానే పిలుస్తారు. ఆమె నేసిన చీరలను ఫొటో తీసి తానే స్వయంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ కామర్స్ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేస్తుంది. ఉత్పత్తిదారులకు– వినియోగదారులకు మధ్య మరో వ్యక్తి అవసరం లేదని, సాంకేతికతను ఒంటపట్టించుకోవడానికి పెద్ద చదువులు అక్కరలేదని నిరూపిస్తోంది.





బుట్టల అల్లికలో మహిళలు

సాధికారత సాధించాం!

''ఒక్కో ప్రాంతంలోని మహిళల్లో ఒక్కో కళ ఉంటుంది. మా దగ్గర మహిళలు చేనేతతోపాటు తాటి, కొబ్బరి ఆకులతో బుట్టలు అల్లుతారు. కర్ణాటక, రాయచూర్ వాళ్లు అందమైన దండలు, ఊలు, క్రోషియో వైర్‌తో ఇంటి అలంకరణ వస్తువులు అల్లుతారు. గుజరాత్, దహోద్ వాళ్లు ముత్యాల ఆభరణాలతోపాటు వెదురుతో రకరకాల వస్తువులు తయారు చేయడంలో నిష్ణాతులు. వాళ్లందరికీ డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, ఎంటర్‌ప్రెన్యూరల్ స్కిల్స్‌తోపాటు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పిస్తే అద్భుతాలు చేయగలరని నమ్మాను. అది నిజమైంది కూడా. ఇప్పుడు మొత్తం తొమ్మిది వందల మందిమి నాస్కామ్ నిర్వహించిన పదిరోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సొంతంగా అన్ని పనులూ చక్కబెట్టుకోగలుగుతున్నాం. మహిళా సాధికారత సాధనకు మా చేతిలో ఉన్న పని, సాంకేతిక పరిజ్ఞానం తోడైంది'' అన్నది ముత్తులక్ష్మి. ●

ఫిఫ్త్ జనరేషన్



గౌరీ కిర్లోస్కర్

గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన గౌరీ కిర్లోస్కర్ తమ కుటుంబ వ్యాపార విజయాల వెలుగులో మాత్రమే కనిపించాలనుకోలేదు.
'కొత్తగా నేను ఏమీ చేయకపోయినా జీవితం సాఫీగా సాగిపోతుంది' అనుకోలేదు.
'ఇంత పెద్ద వ్యాపార సామ్రాజ్యంలో నేను ఎక్కడ?' అని ప్రశ్నించుకుంది.
ఆ ప్రశ్నే ఆమెతో ఎన్నో ప్రయాణాలు చేయించింది.
ప్రతి ప్రయాణంలో విలువైన పాఠాలు నేర్చుకునేలా చేసింది.
తమ కుటుంబ వ్యాపార చరిత్రలో తన కంటూ కొన్ని పుటలు ఉండాలనుకుంది.
ఆమె ప్రయత్నం, కష్టం ఫలించాయి.
ఫిఫ్త్ జెనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రసిద్ధ వ్యాపార సామ్రాజ్యమైన 'కిర్లోస్కర్'లోకి అడుగుపెట్టిన గౌరీ కిర్లోస్కర్ తనను తాను నిరూపించుకుంది.
తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించింది.

సగౌరవంగా... గౌరీ విజయం

కుటుంబ వ్యాపారంలోకి అడుగు పెట్టినంత మాత్రానా ఎంటర్‌ప్రెన్యూర్‌గా వారిది నల్లేరు మీద నడక అనుకోవడానికి లేదు. తమను తాము నిరూపించుకొని ఫ్యామిలీ బిజినెస్‌కు మరింత బలాన్ని ఇచ్చేవారితో పాటు నిరూపించుకోలేక వెనుతిరిగేవారు కూడా ఉంటారు. గౌరీ కిర్లోస్కర్ మొదటి కోవకు చెందిన మహిళ.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్(ఎల్‌ఎస్‌ఈ)లో చదువుకుంది. అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో ఫైనాన్స్‌లో డిగ్రీ చేసింది.

చదువు పూర్తి కాగానే తమ కుటుంబ వ్యాపారంలోకి అడుగు పెట్టి పెద్ద హోదాలో వెలిగిపోవచ్చు. అలా కాకుండా ఉద్యోగం చేయాలనుకుంది గౌరి.

ఉద్యోగం చేయాలనుకోవడానికి కారణం....తనను తాను నిరూపించుకోవడం.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనలిస్ట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ తరువాత 'పియర్సన్ కార్పొరేట్ ఫైనాన్స్'లో స్ట్రాటజీ గ్రూప్‌లో చేరింది. ఉద్యోగజీవితంలో విలువైన అనుభవాలను సొంతం చేసుకుంది. ఈ అనుభవాలు ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన విజయాలకు బలమైన పునాదిగా నిలిచాయి.

మన దేశానికి తిరిగివచ్చిన గౌరి కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఇక అప్పటినుంచి 'కిర్లోస్కర్ గ్రూప్'లో వ్యూహాత్మక విధానాలపై దృష్టి పెట్టింది. బోర్డ్ మెంబర్‌గా సమీక్ష సమావేశాల్లో చురుగ్గా పాల్గొనడం ఒక కోణం అయితే ఎనర్జీ సెక్టర్‌లో ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలను అన్వేషించడం మరో కోణం.

'ఆర్క్ ఫిన్ క్యాప్'కు సంబంధించి టీమ్ ఏర్పాటు, బిజినెస్ ప్లానింగ్‌లో కీలకంగా వ్యవహరించింది.

పుణెలో కంపెనీకి సంబంధించిన రియల్ ఎస్టేట్ బిజినెస్ ప్రధాన బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వహించింది. ఇంటర్నేషనల్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్‌తో కలిసి పనిచేసింది.

హెచ్‌ఆర్, బ్రాండింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్‌లో తనదైన ముద్ర వేసింది.

పర్యావరణ కోణంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

గౌరీ నాయకత్వంలో కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్ గణనీయమైన వృద్ధిని సాధించింది.

'ఇది కుదరదు' అనుకునే చోట ప్రత్యామ్నాయాలు అన్వేషించి విజయం సాధించే నైపుణ్యం గౌరీలోఉంది.

'మేము ఇంజిన్ మాన్యుఫాక్చరింగ్‌లోకి వచ్చినప్పుడు గ్లోబల్ కంపెనీలతో టై అప్ అయ్యే అవకాశం లేదు. ఒకవేళ ఉంటే టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఇంజిన్‌లను స్థానికంగానే తయారు చేసుకునే పరిస్థితి ఉండేది. ఇలాంటి అవకాశం లేకపోవడంతో సొంతంగా మాన్యుఫాక్చరింగ్ మొదలుపెట్టాం. సొంతంగా ఏదైనా చేయడం మొదలుపెట్టినప్పుడు మనదైన ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ వృద్ధి చెందుతుంది' అంటుంది గౌరీ.

గౌరీ కంపెనీ బీ2బీ, బీ2సి, ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే మూడు ప్రధానమైన బిజినెస్ సెగ్మెంట్‌లపై దృష్టి పెట్టింది. బీ2బీ బిజినెస్ ఇంటర్నల్ కంబాషన్ ఇంజిన్స్‌పై, బీ2సి బిజినెస్ వాటర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్, వ్యవసాయ సంబంధిత వ్యాపారాలపై దృష్టి పెడుతుంది. ఇక 'అర్క' గ్రూప్ అనేది ఫైనాన్షియల్ సర్వీసెస్ సెగ్మెంట్.

స్థూలంగా చెప్పాలంటే...

ఉన్నత విద్యాలయాల్లో చదువుకున్న చదువు, ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు, వ్యూహాత్మక దృక్పథం వ్యాపార ప్రపంచంలో గౌరీని ఉన్నత స్థానంలో నిలిపాయి. మూలాలకు తిరిగి రావడం అనేది గణనీయమైన వ్యాపార విజయానికి ఎలా దారితీస్తుందో చెప్పడానికి గౌరీ కిర్లోస్కర్ పేరును ప్రముఖంగా ప్రస్తావించవచ్చు.

ఉత్సాహ బలం

వ్యాపార ప్రపంచానికి అవతలి విషయానికి వస్తే... గౌరీ కిర్లోస్కర్‌కు యోగా చేయడం, స్క్వాష్, డైవింగ్ అంటే ఇష్టం. ప్రకృతి ప్రేమికురాలైన గౌరీకి తన కుటుంబ సభ్యులతో కలిసి కొత్త ప్రదేశాలకు వెళ్లడం అంటే ఇష్టం. ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్‌ల గురించి తెలుసుకోవడానికి సోషల్ మీడియాపై కూడా ఆసక్తి ప్రదర్శిస్తుంది. ఒక పుస్తకం చదివినప్పుడో, ఉపన్యాసం విన్నప్పుడో తనకు నచ్చిన వాక్యాన్ని, మాటను నోట్ చేసుకోవడం గౌరీకి ఇష్టం. 'ఏ పని చేసినా ఉత్సాహంతో చేయాలి. ఉత్సాహమే అనంతమైన శక్తి' అంటుంది గౌరీ కిర్లోస్కర్.

బ్యూటిప్స్

పాలలో బ్రెడ్ ముక్కలు నానవేసి వాటిని మెత్తగా మెదిపి ముఖానికి రాసుకుని పది నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం మృదువుగా మిలమిలలాడుతుంది.

- కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్, నిమ్మరసం కలిపి ముఖానికి రాసుకుని పావు గంట తర్వాత కడిగేసుకోవాలి. తర్వాత శెనగపిండితో గానీ, నలుగుపిండితో గానీ రుద్ది ముఖాన్ని శుభ్రం చేసుకుంటే ముఖం మీద ముడతలు లేకుండా తాజాగా కనిపిస్తుంది.
- పులిపిర్లు రాలిపోయిన తర్వాత ఆ మచ్చలు పోవటానికి తేనె, నిమ్మరసం కలిపి ఆ మచ్చల మీద రాస్తూ ఉండాలి.
- తులసి ఆకులను మెత్తగా గ్రైండ్ చేసి ఆపేస్టును కాని రసాన్ని కానీ ముఖానికి రాసిఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. క్రమంతప్పకుండా రోజూ చేస్తుంటే మొటిమలు,వాటి మచ్చలు పూర్తిగా పోవడంతో పాటుచర్మం నునుపుదేలుతుంది.
- తేనెను గోరువెచ్చగా చేసి అందులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి ఆరినతర్వాత కడగాలి. తేనెను ఎప్పుడూ నేరుగామంట మీద వేడి చేయకూడదు. తేనె ఉన్నపాత్రను ఎండలో కాని, వేడి నీటి గిన్నెలోకాని పెట్టి వేడి చేయాలి.



పదహారో శతాబ్దంలోకి వెళ్లివద్దామా?!





రాజాంతఃపురాలను, కోటలను సినిమాలలో తప్ప స్వయంగా చూడటం సాధ్యం కాదేమో అని బెంగపడే వాళ్లకు ఆహ్వానం పలుకుతోందీ ప్యాలెస్. ఇది మహారాష్ట్రలోని సావంత్‌వాడి ప్యాలెస్. గోవాకు దగ్గరలో ఉంది. పదహారవ శతాబ్దంలో నిర్మించిన ఈ ప్యాలెస్‌లోకి అతిథులకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు సావంత్ రాజవంశీకులు. యువరాజు లఖమ్ సావంత్ భోంస్లే, యువరాణి శ్రద్ధా సావంత్ భోంస్లేలు తమ ప్యాలెస్‌ను పర్యాటకులకు హోమ్‌స్టేగా మార్చారు. ''మేము మా ప్యాలెస్‌తో వ్యాపారం చేయడం లేదు, మనదేశ చరిత్రను తెలియచేస్తున్నాం. స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాంధీజీ ఆధ్వర్యంలో ఉప్పు సత్యాగ్రహం ఇక్కడ జరిగింది. మరో సందర్భంలో నెహ్రూ కూడా బస చేశారు. ఈ ప్యాలెస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి మా కొంకణ సంప్రదాయ ఆహ్వానం, ఆత్మీయతలు, భోజనంతో పదహారవ శతాబ్దంలోకి వెళ్లిపోతారు'' అని చెబుతున్నారు ఈ ఇంటి వాళ్లు.







టైమ్ మెషీన్‌లో కాలంలో వెనక్కి వెళ్లడం సినిమాల్లో చూడడం కాదు ఇక్కడ స్వయంగా అనుభూతి చెందవచ్చు, అంతేకాదు... మొఘలులు పర్షియా నుంచి మన దేశానికి తీసుకువచ్చిన గంజిఫా ఆట ఆడడం వంటివి ఇక్కడివి వచ్చిన వాళ్లకు నేర్పిస్తామని చెబుతున్నారు. రాజసాన్ని చూపిస్తుంది. కళాత్మక లాలిత్యంతో కనువిందు చేస్తుంది. అమ్మ ఒడిలా ఆప్యాయతనిస్తుంది. అమ్మమ్మ చేతి స్పర్శలోని మృదుత్వాన్ని గుర్తు చేస్తుంది. పర్యటన రొటీన్‌కి భిన్నంగా ఉండాలని కోరుకునే వాళ్లకు చక్కటి వెకేషన్ అవుతుంది.









విశేషం

పడమటి చంద్రిక రాగం



అల్లరి అమ్మాయిగా పేరు తెచ్చుకున్న చంద్రికా రవి డ్యాన్సర్‌గా అంతకంటే ఎక్కువ పేరు తెచ్చుకుంది.

మోడలింగ్‌లోనూ మంచి మార్కులు కొట్టేసింది.

నటనలో 'వాహ్వా' అనిపించింది.

ఆస్ట్రేలియాలో పుట్టి పెరిగిన చంద్రికా రవి భారతీయ మూలాలను మాత్రం ఎప్పుడూ మరచిపోలేదు.

ఆమె మాట, పాట, నటన, నృత్యంలో భారతీయత ప్రతిఫలిస్తుంది.

తాజా విషయానికి వస్తే...

యూఎస్ రేడియో షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న తొలి భారతీయ నటిగా చంద్రికా రవి చరిత్ర సృష్టించింది. అమెరికన్ టాక్ షో 'ది చంద్రికా రవిషో'కు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పుట్టింది చంద్రికా రవి. మల్లిక, రవి శ్రీధరన్‌లు తల్లిదండ్రులు. మూడు సంవత్సరాల వయసులోనే డ్యాన్స్, యాక్టింగ్‌లలో చంద్రికకు శిక్షణ ఇప్పించారు తల్లిదండ్రులు.

చిన్న వయసులోనే సింగపూర్‌లో నృత్య ప్రదర్శన ఇచ్చింది.

కొత్తప్రాంతాలకు వెళ్లడం అంటే చంద్రికకు ఎంతో ఇష్టం. టీనేజ్‌లోనే ఎన్నో దేశాలు చుట్టేసి వచ్చింది.

ఆస్ట్రేలియా నుంచి లాస్ ఏంజెల్స్‌కు వెళ్లి యాక్టింగ్, మోడలింగ్‌లో కెరీర్ మొదలుపెట్టింది.

'సెయి' అనే తమిళ చిత్రంతో భారతీయ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది.

ఈ సినిమాలో భారతీయ, పాశ్చాత్య సంస్కృతులపై బాగా పరిచయం ఉన్న యువతి పాత్రలో నటించింది. నిజానికి నిజజీవితంలోనూ ఆమెకు రెండు సంస్కృతులపై గాఢమైన పరిచయం ఉంది.

'నా మూలాలు దక్షిణ భారతంలో ఉన్నాయి' అని తనను తాను గర్వంగా పరిచయం చేసుకుంటుంది చంద్రిక.

మోడలింగ్ చేసినప్పటికీ తన తొలి ప్రాధాన్యత మాత్రం నటనే.

'ఫిల్మ్ మేకింగ్, యాక్టింగ్‌లో యూఎస్‌లో శిక్షణ తీసుకున్నాను. విదేశాల్లో కొన్ని ఫీచర్ ఫిల్మ్‌లు చేశాను. నటన అంటే ఇష్టం అయినప్పటికీ ఒకేరకమైన పాత్రలు చేయడం ఇష్టం లేదు. వైవిధ్యం ఉన్న పాత్రలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తాను' అంటున్న చంద్రిక పాత్రల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తోంది.

> ఒత్తిడితో కూడుకున్నదైనప్పటికీ ఇదొక గొప్ప అనుభవం. నటిగా మాత్రమే పరిచయం అయిన నా గురించి పూర్తిగా తెలుసుకోవడానికి ఈ రేడియో షో ఉపయోగపడుతుంది.
> – చంద్రికా రవి

సిల్క్ స్మిత బయోపిక్‌లో లీడ్ రోల్‌లో నటించింది.

'అచ్చం స్మితలాగే ఉంది' అనిపించుకుంది.

రేడియో టాక్ షో విషయానికి వస్తే...

'ది చంద్రికా రవి షో'లో తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన రకరకాల అనుభవాలు, సవాళ్లు, పోరాటాలను పంచుకోనుంది. చంద్రిక పోరాట నేపథ్యం గురించి విన్న రూక్స్ అవెన్యూ రేడియో వ్యవస్థాపకుడు సామీ చంద్ ఆమెకు వ్యాఖ్యాతగా అరుదైన అవకాశం ఇచ్చాడు.

'ఒత్తిడితో కూడుకున్నదైనప్పటికీ ఇదొక గొప్ప అనుభవం. నటిగా మాత్రమే పరిచయం అయిన నా గురించి పూర్తిగా తెలుసుకోవడానికి ఈ షో ఉపయోగపడుతుంది' అంటుంది చంద్రిక. అమెరికాలోని అతి పెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటైన 'ఐహార్ట్' రేడియోలో ఈ షో ప్రసారం కానుంది. తన షోను ఆషామాషీగా తీసుకోవడం లేదు చంద్రిక. షో సక్సెస్ కోసం డిజైన్, ప్రొడక్షన్, ప్రమోషన్‌లకు సంబంధించి బాగా కష్టపడింది

యూఎస్‌లో రేడియో షోను హోస్ట్ చేస్తున్న మొదటి భారతీయ నటిగా ప్రత్యేకత సాధించిన చంద్రిక...

'నన్ను నేను వ్యక్తీకరించుకోవడానికి, ప్రపంచంతో నా వ్యక్తిగత అనుభవాలను పంచుకోవడానికి ఈ షో నాకు వరం లాంటిది' అంటుంది.

స్పోర్ట్స్



భారత్ తరఫున చివరిసారి బరిలోకి సునీల్ ఛెత్రి... నేడు కువైట్‌తో భారత్ పోరు

ప్రపంచకప్ 2026 ఫుట్‌బాల్ టోర్నీ రెండో రౌండ్ ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా నేడు కువైట్ జట్టుతో భారత జట్టు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే మూడో రౌండ్‌కు అర్హత పొందే అవకాశాలు మెరుగవుతాయి. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో రాత్రి 7 గంటల నుంచి జరగనున్న ఈ మ్యాచ్ భారత దిగ్గజం, కెప్టెన్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌లో చివరి మ్యాచ్ కానుంది. 2005లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ఆడిన 39 ఏళ్ల ఛెత్రి ఇప్పటి వరకు 150 మ్యాచ్‌లు పూర్తి చేసుకొని 94 గోల్స్ సాధించాడు. జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్స్ జాబితాలో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 206 మ్యాచ్‌ల్లో 128 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 149 మ్యాచ్‌ల్లో 109 గోల్స్); లయనెల్ మెస్సీ (అర్జెంటీనా; 180 మ్యాచ్‌ల్లో 106 గోల్స్) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఆసియా క్వాలిఫయర్స్ గ్రూప్ 'ఎ'లో ప్రస్తుతం ఖతర్ 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... భారత్, అఫ్గానిస్తాన్ జట్లు నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి.

ఆడుతూ పాడుతూ...

తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం

- 8 వికెట్లతో ఐర్లాండ్ చిత్తు
- రాణించిన బౌలర్లు, రోహిత్
- ఆదివారం పాకిస్తాన్‌తో 'ఢీ'

భారీ అంచనాలతో టి20 వరల్డ్ కప్ బరిలోకి దిగిన భారత్ తొలి పోరులో తమ స్థాయి ప్రదర్శనతో సత్తా చాటింది. సంచలనాల రికార్డు ఉన్న ఐర్లాండ్‌పై ఏమాత్రం ఉదాసీనత కనబర్చకుండా పూర్తిగా పైచేయి సాధించి భారీ విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించని పిచ్‌పై ప్రత్యర్థిని 96 పరుగులకే పరిమితం చేసిన టీమిండియా ఆ తర్వాత మరో 46 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యం చేరింది. మన బౌలర్లలో ఐదుగురు కనీసం ఒక్కో వికెట్‌తో తమ వంతు పాత్ర పోషించారు. అనంతరం రోహిత్, పంత్ చక్కటి బ్యాటింగ్ టీమిండియాను ఎలాంటి ఇబ్బంది లేకుండా గెలిపించాయి. ఇక ఆదివారం పాకిస్తాన్‌తో మ్యాచ్ రూపంలో తర్వాతి సవాల్‌కు భారత్ సిద్ధమైంది.



రోహిత్

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్‌లో రోహిత్ బృందం శుభారంభం చేసింది. బుధవారం నాసా కౌంటీ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 16 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. గారెన్ డెలానీ (14 బంతుల్లో 26; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)దే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (2/6), అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యాకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం భారత్ 12.2 ఓవర్లలో 2 వికెట్లకు 97 పరుగులు సాధించి గెలిచింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 52 రిటైర్డ్‌హర్ట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), రిషబ్ పంత్ (26 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 44 బంతుల్లో 54 పరుగులు జోడించారు.

టపటపా...

స్వింగ్‌కు అనుకూల వాతావరణం, అనూహ్య బౌన్స్, నెమ్మదైన అవుట్‌ఫీల్డ్... ఇలాంటి స్థితిలో బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ ఏ దశలోనూ భారత బౌలర్ల ముందు నిలవలేకపోయింది. మూడో ఓవర్లో కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (2), బల్బర్నీ (5)లను అవుట్ చేసి అర్ష్‌దీప్ ముందుగా దెబ్బ కొట్టడంతో మొదలైన ఐర్లాండ్ పతనం వేగంగా సాగింది. పవర్‌ప్లేలో 26 పరుగులు రాగా, వాటిలో 9 ఎక్స్‌ట్రాలే ఉన్నాయి. పాండ్యా తన తొలి రెండు ఓవర్లలో టకర్ (10), కాంఫర్ (12)లను వెనక్కి పంపించగా, టెక్టర్ (4)ను బుమ్రా అవుట్ చేశాడు. సిరాజ్ ఖాతాలో డాక్‌రెల్ (3) వికెట్ చేరడంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఐర్లాండ్ 49/6 వద్ద నిలిచింది. అక్షర్ పటేల్ కూడా తన తొలి ఓవర్లో మెక్‌కార్తీ (0) పని పట్టగా, బుమ్రా బౌలింగ్‌లో లిటిల్ (14) బౌల్డయ్యాడు. అయితే చివర్లో డెలానీ కొన్ని పరుగులు జోడించగలిగాడు. అర్ష్‌దీప్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను అదే ఓవర్ చివరి బంతికి రనౌట్ కావడంతో ఐర్లాండ్ ఆట ముగిసింది.

ఆకట్టుకున్న పంత్...

ఓపెనర్‌గా వచ్చిన విరాట్ కోహ్లి (1) ప్రభావం చూపలేకపోగా, మరోవైపు రోహిత్ ధాటిగా ఆడాడు. మూడో స్థానంలో బరిలోకి దిగిన పంత్ కూడా అదే తరహాలో వేగంగా బ్యాటింగ్ చేశాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 39 పరుగులకు చేరింది. లిటిల్ ఓవర్లో రెండు వరుస సిక్స్‌లతో జోరు పెంచిన రోహిత్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే అంతకుముందు లిటిల్ వేసిన ఓవర్లో బంతి భుజానికి బలంగా తగిలిన కారణంగా నొప్పితో మైదానం వీడాడు. 21 పరుగులు చేయాల్సిన స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చిన సూర్యకుమార్ (2) విఫలమైనా... మెక్‌కార్తీ బౌలింగ్‌లో రివర్స్ స్కూప్ సిక్సర్‌తో పంత్ మ్యాచ్ ముగించాడు. ఇటీవలే ఐపీఎల్‌లో ఆడిన పంత్‌కు ఏడాదిన్నర తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్.

600 రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో 600 సిక్సర్లు కొట్టిన తొలి ఆటగాడిగా నిలిచాడు. రోహిత్ టెస్టుల్లో 84, వన్డేల్లో 323, టి20ల్లో 193 సిక్స్‌లు బాదాడు.

4000 రోహిత్ అంతర్జాతీయ టి20ల్లో 4 వేల పరుగులు (4026) దాటాడు. కోహ్లి (4038), బాబర్ (4023) తర్వాత ఈ మైలురాయిని చేరిన మూడో ఆటగాడిగా నిలిచాడు.



స్కోరు వివరాలు

ఐర్లాండ్ ఇన్నింగ్స్: బల్బర్నీ (బి) అర్ష్‌దీప్ 5; స్టిర్లింగ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 2; టకర్ (బి) పాండ్యా 10; టెక్టర్ (సి) కోహ్లి (బి) బుమ్రా 4; కాంఫర్ (సి) పంత్ (బి) పాండ్యా 12; డాక్‌రెల్ (సి) బుమ్రా (బి) సిరాజ్ 3; డెలానీ (రనౌట్) 26; అడెయిర్ (సి) దూబే (బి) పాండ్యా 3; మెక్‌కార్తీ (సి అండ్ బి) అక్షర్ 0; లిటిల్ (బి) బుమ్రా 14; వైట్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (16 ఓవర్లలో ఆలౌట్)** 96. **వికెట్ల పతనం:** 1-7, 2-9, 3-28, 4-36, 5-44, 6-46, 7-49, 8-50, 9-77, 10-96. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-35-2, సిరాజ్ 3-0-13-1, బుమ్రా 3-1-6-2, పాండ్యా 4-1-27-3, అక్షర్ పటేల్ 1-0-3-1, జడేజా 1-0-7-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (రిటైర్డ్‌హర్ట్) 52; కోహ్లి (సి) వైట్ (బి) అడెయిర్ 1; పంత్ (నాటౌట్) 36; సూర్యకుమార్ (సి) డాక్‌రెల్ (బి) వైట్ 2; దూబే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (12.2 ఓవర్లలో 2 వికెట్లకు)** 97. **వికెట్ల పతనం:** 1-22, 2-91. **బౌలింగ్:** అడెయిర్ 4-0-27-1, లిటిల్ 4-0-42-0 మెక్‌కార్తీ 2.2-0-8-0, కాంఫర్ 1-0-4-0, వైట్ 1-0-6-1.

టి20 ప్రపంచకప్‌లో నేడు
పాపువా న్యూ గినీ X ఉగాండా
వేదిక: గయానా; ఉదయం గం. 5 నుంచి
ఆస్ట్రేలియా X ఒమన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; ఉదయం గం. 6 నుంచి
పాకిస్తాన్ X అమెరికా
వేదిక: వేదిక: డాలస్; రాత్రి గం. 9 నుంచి
నమీబియా X స్కాట్లాండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; అర్ధరాత్రి గం. 12:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సబలెంకాకు చుక్కెదురు

ప్రపంచ రెండో ర్యాంకర్‌పై రష్యా టీనేజర్ మిరా ఆండ్రీవా సంచలన విజయం



సబలెంకా



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్), నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. రష్యాకు చెందిన 17 ఏళ్ల మిరా ఆండ్రీవా 2 గంటల 29 నిమిషాల పోరులో 6-7 (5/7), 6-4, 6-4తో సబలెంకాను బోల్తా కొట్టించగా... ఇటలీకి చెందిన 12వ సీడ్ జాస్మిన్ పావొలిని 2 గంటల 3 నిమిషాల్లో 6-2, 4-6, 6-4తో రిబాకినాను ఓడించింది. ఆండ్రీవా, జాస్మిన్ తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

సెమీస్‌లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 7-6 (7/3), 5-7, 6-1తో సాండర్ గిలె–జొరాన్ ఫ్లీగెన్ (బెల్జియం) జంటను ఓడించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో మూడో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6-3, 7-6 (7/3), 6-4తో తొమ్మిదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్)పై గెలిచి రెండో ర్యాంకర్ యానిక్ సినెర్ (ఇటలీ)తో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

వైశాలి విజయం... హంపి, ప్రజ్ఞానంద పరాజయం



స్టావెంజర్: నార్వే చెస్ టోర్నీ మహిళల విభాగం ఎనిమిదో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు వైశాలి, కోనేరు హంపిలకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. వైశాలి 'అర్మగెడాన్' గేమ్‌లో తెల్ల పావులతో ఆడుతూ అనా ముజిచుక్ (ఉక్రెయిన్)పై 59 ఎత్తుల్లో నెగ్గింది. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 47 ఎత్తుల్లో 'డ్రా' కావడంతో విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించారు. టింగ్జీ లె (చైనా)తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో కోనేరు హంపి 66 ఎత్తుల్లో ఓడిపోయింది. ఎనిమిదో రౌండ్ తర్వాత వైశాలి 11.5 పాయింట్లతో మూడో స్థానంలో, హంపి 8 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 75 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. 'అర్మగెడాన్' గేమ్‌లో కార్ల్‌సన్ తెల్లపావులతో ఆడుతూ 67 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొందాడు.

తొలి రౌండ్‌లోనే సింధు ఓటమి

జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. బరిలో దిగిన భారత స్టార్ పీవీ సింధు, రైజింగ్ స్టార్ ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ 12వ ర్యాంకర్ సింధు 15-21, 21-15, 14-21తో ప్రపంచ 26వ ర్యాంకర్ వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో... ఆకర్షి కశ్యప్ 18-21, 6-21తో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయారు. వెన్ చి సుతో గతంలో ఆడిన మూడుసార్లూ నెగ్గిన సింధు నాలుగోసారి మాత్రం ఓటమి మూటగట్టుకుంది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణాయక మూడో గేమ్‌లో సింధు కీలకదశలో అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది.



మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా (భారత్) ద్వయం 21-15, 21-15తో జాకీ డెంట్–క్రిస్టల్ (కెనడా) జోడీపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. రుతపర్ణ–శ్వేతపర్ణ (భారత్) జంట 12-21, 9-21తో సో యోంగ్ కిమ్ –హీ యోంగ్ కాంగ్ (కొరియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

సినిమా



ప్రభాస్

ట్రైలర్ రెడీ

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 10న విడుదల చేస్తున్నట్లుగా వెల్లడించి, ఓ కొత్త పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు మేకర్స్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం : సంతోష్ నారాయణన్.

పాటలోనే కథ ఉంది - చేతన్ భరద్వాజ్



''హరోం హర' 1989లో జరిగే కథ. ఇప్పుడున్న యువతకు అప్పుడున్న ఓ జీవితాన్ని చూపిస్తున్నారు డైరెక్టర్ సాగర్. ఇందులో విజువల్స్ చాలా గ్రాండ్‌గా ఉంటాయి. విజువల్‌కి తగ్గట్టే మ్యూజిక్ చాలా గ్రాండియర్‌గా చేశాను. సౌండ్ డిజైన్ అద్భుతంగా ఉంటుంది'' అని సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ అన్నారు. సుధీర్ బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించిన చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్‌పై సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ– ''హరోం హర' 1989లో జరిగే కథ కాబట్టి ఆ రెట్రో కల్చర్‌ని మిళితం చేసి, ఈ సినిమా చేశాం. నాకు రెట్రో జానర్ ఇష్టం కావడంతో సవాల్‌గా తీసుకుని, చేశాను. 'హరోం హర'లో యాక్షన్‌తో పాటు బలమైన ఎమోషన్స్ ఉంటాయి. ఎమోషనల్ మ్యూజిక్ చేయడానికి కూడా స్కోప్ దొరికింది. ఇప్పటివరకు విడుదలైన ఈ చిత్రం పాటలకు మంచి స్పందన లభించింది. ఇంకో ఎమోషనల్ సాంగ్ ఉంది. సినిమా విడుదల తర్వాత పాటను లాంచ్ చేస్తాం. ఆ పాటలో సబ్జెక్ట్ ఉంది. సుధీర్‌బాబుగారి డైనమిక్ యాక్టింగ్, డైరెక్టర్ టేకింగ్... ఇలా అన్నీ బాగా కుదిరాయి. ప్రస్తుతం గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వం వహిస్తున్న 'విశ్వం' సినిమాకి సంగీతం అందిస్తున్నాను'' అన్నారు.



సమంత

పోటీని వ్యతిరేకంగా తీసుకోను

''పోటీని నేను వ్యతిరేకంగా తీసుకోను... ఓ ప్రేరణగా తీసుకుని నన్ను నేను మరింత మెరుగుపరచుకోవడానికి కష్టపడతాను'' అని అంటున్నారు సమంత. సినిమా ఇండస్ట్రీలో ఉండే పోటీని మీరు ఎలా తీసుకుంటారు? అనే ప్రశ్నకు సమాధానంగా సమంత స్పందించారు. ''మనుషులుగా మనమందరం పోటీ పడాలనుకుంటాం. అది సహజం కాబట్టి పోటీని నేను నెగటివ్‌గా తీసుకోను. చెప్పాలంటే నా తోటివారి విజయాల నుంచి కూడా స్ఫూర్తి పొందుతాను. విజయాలు సాధించిన వారిలా నేను మరింత కష్టపడి అద్భుత విజయాలను సాధించాలని ఆశపడతాను. నా ఆలోచనలన్నీ ఇలానే ఉంటాయి'' అని చెప్పుకొచ్చారు సమంత. ఇక సినిమాల విషయానికి వస్తే.. సమంత నటించాల్సిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' పై అప్‌డేట్ రావాల్సి ఉంది. అలాగే వరుణ్ ధావన్‌తో కలిసి సమంత నటించిన ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది.

ఎయిర్‌పోర్టులో ఫైట్!



కమల్ హాసన్

పాండిచ్చేరిలో ఫైట్ చేస్తున్నారు రంగరాయ శక్తివేల్ నాయకర్. మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న 'థగ్ లైఫ్' చిత్రంలో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్ర చేస్తున్నారు కమల్‌హాసన్. 1987లో వచ్చిన 'నాయగన్' సినిమా తర్వాత కమల్ హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. ఈ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో త్రిష, శింబు, అశోక్ సెల్వన్, ఐశ్వర్యాలక్ష్మి, జోజు జార్జ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం పాండిచ్చేరి ఎయిర్‌పోర్టులో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. కమల్‌హాసన్, శింబుతో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొంటుండగా యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట మణిరత్నం. ఈ ఫైట్ క్లైమాక్స్‌లో వస్తుందని సమాచారం.

పెళ్లయితే కెరీర్ మారాలా? - కాజల్ అగర్వాల్



''నన్ను టాలీవుడ్ చందమామ అని పిలుస్తుంటారు. 'సత్యభామ' విడుదల తర్వాత సత్యభామ అని పిలిచినా సంతోషిస్తాను. చందమామ అందమైన పేరు. సత్యభామ పవర్‌ఫుల్ నేమ్. ఈ రెండూ నాకు ఇష్టమే'' అని కాజల్ అగర్వాల్ అన్నారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. నవీన్ చంద్ర కీలక పాత్ర చేశారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్ ప్లే అందించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ సినిమా రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ పంచుకున్న విశేషాలు...


- 'సత్యభామ' కథని సుమన్ చెప్పిన వెంటనే ఒప్పుకున్నా. ఈ స్టోరీ అంత నచ్చింది. ఈ మూవీని నా వ్యక్తిగత జీవితంతో పోల్చుకోవచ్చు. సమాజంలో ఏదైనా ఘటన జరిగితే నిజ జీవితంలో నేనూ స్పందిస్తుంటా. బయటకు వచ్చి ర్యాలీలు చేయకున్నా ఆ ఘటన గురించి ఆలోచనలు వస్తుంటాయి.. డిస్టర్బ్ చేస్తుంటాయి. 'సత్యభామ' సినిమా లాంటి భావోద్వేగాలున్న చిత్రం చేయడం ఇదే తొలిసారి. ఈ మూవీలో నటిస్తున్నప్పుడు ఇప్పటిదాకా ఫీల్ కాని కొన్ని భావోద్వేగాలను అనుభూతి చెందాను.
- 'సత్యభామ'లో ఎమోషన్, యాక్షన్ ఉన్న పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తా. యాక్షన్ సీక్వెన్సుల కోసం ఎంతో కష్టపడ్డా. ఆ ఫైట్స్ సహజంగా ఉంటాయి. రామ్ చరణ్‌లా (మగధీర మూవీని ఉద్దేశించి) వంద మందిని నేను కొడితే ప్రేక్షకులు నమ్మరు.. నా ఇమేజ్‌కు ప్రేక్షకులు ఇష్టపడేలా స్టంట్స్ ఉంటాయి. ఈ మూవీలో యువత, బెట్టింగ్ అంశంతో పాటు ఓ మతం గురించిన కీ పాయింట్స్ ఉంటాయి.
- పెళ్లయ్యాక ఒక హీరోయిన్ కెరీర్ ఎందుకు మారాలో అర్థం కాదు. అందరికీ వ్యక్తిగత జీవితం ఉంది. అలాగే హీరోయిన్లకు కూడా. గతంలో పెళ్లయ్యాక కథానాయికలకి అవకాశాలు తగ్గాయేమో? కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెళ్లయ్యాక ఎంతోమంది హీరోయిన్లు అంతకుముందు కంటే బిజీగా సినిమాలు చేస్తున్నారు. నేను నా వ్యక్తిగత జీవితాన్ని, సినీ కెరీర్‌ను బ్యాలెన్స్ చేసుకుంటున్నాను. ఈ ప్రయాణంలో నా భర్త గౌతమ్ కిచ్లు, నా ఫ్యామిలీ సపోర్ట్ ఎంతో ఉంది. నా భర్తకు ఇష్టమైన కథానాయికల్లో నాతోపాటు సమంత, రష్మిక మందన్న, రాశీ ఖన్నా ఉన్నారు. 'భారతీయుడు 2' విడుదల కోసం ఎగ్జయిటెడ్‌గా ఎదురు చూస్తున్నాను. 'భారతీయుడు 3' లోనూ నా పాత్ర ఉంటుంది. ప్రస్తుతం రెండు కొత్త సినిమాలు ఒప్పుకున్నాను.

ఆర్‌ఆర్‌ఆర్ సీక్వెల్‌కి స్కోప్ ఉంది కానీ... - అవనీంద్ర



నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. అవనీంద్ర దర్శకత్వంలో నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో దర్శకుడు అవనీంద్ర మాట్లాడుతూ –''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. ఓ రిలేషన్‌లో ఒక జంట రెండేళ్లు హ్యాపీగా ఉన్న తర్వాత.. వారిద్దరి మధ్య మొదట్లో ఉన్నంత ప్రేమ ఎందుకు ఉండటం లేదు? ఎందుకు వారి రిలేషన్ బ్రేక్ అవుతుంది? అనే అంశాలను ఈ సినిమాలో చర్చించాం. ఈ సినిమాలో బోల్డ్ సాంగ్స్, లిప్‌లాక్స్ ఉన్నాయి. కానీ ఇవన్నీ కథకు అవసరమై పెట్టినవే. వైజాగ్‌లో ప్రివ్యూ వేస్తే మంచి స్పందన వచ్చింది. అమ్మాయిలు కూడా ఈ సినిమా చూశారు. చెప్పాలంటే వారికే ఈ సినిమా ఎక్కువగా కనెక్ట్ అవుతుంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''రాజమౌళిగారి 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు అసోసియేట్ రైటర్‌గా చేశాను. ఆ టైమ్‌లోనే 'లవ్ మౌళి' కథ రాశాను. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు సీక్వెల్ చేసే స్కోప్ ఉంది. అయితే చేస్తారా? లేదా అనేది రాజమౌళిగారి నిర్ణయం'' అన్నారు.

టామీ షెల్బీ రిటర్న్స్



టామీ షెల్బీగా సిలియన్ మర్ఫీ మళ్లీ రానున్నాడు. విశేష ఆదరణ పొందిన టెలివిజన్ సిరీస్ (2013 -2022) 'పీకీ బ్లైండర్స్'లో మర్ఫీ పోషించిన టామీ షెల్బీ ప్రేక్షకులను ఆకటుకుంది. ఈ బ్రిటిష్ పీరియాడికల్ క్రైమ్ సిరీస్‌ను స్టీవెన్ నైట్ క్రియేట్ చేశారు. ఓ యువకుల ముఠా చేసే దొంగతనాల నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. ఈ ముఠాలో కీలకమైన వాడే టామీ షెల్బీ. ఇప్పుడు ఈ సిరీస్‌ను సినిమాగా తీయనున్నారు స్టీవెన్. అయితే స్టీవెన్ నైట్ స్క్రిప్ట్ రాస్తారు. టామ్ హార్పర్ డైరెక్ట్ చేస్తారు. కాగా సిరీస్‌లో టామీ షెల్బీ పాత్రను చేసిన సిలియన్ మర్ఫీనే సినిమాలోనూ ఆ పాత్ర చేయనున్నారు. 'పీకీ బ్లైండర్స్' సిరీస్‌ను సినిమాగా నిర్మించనున్నట్లు, నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానున్నట్లు బుధవారం అధికారిక ప్రకటన వెల్లడైంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. ఈ ఏడాది మార్చిలో జరిగిన 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఓపెన్‌హైమర్' సినిమాకుగానూ సిలియన్ మర్ఫీ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే.

లక్ష్మి ఎవరయ్యా...



విజయ్ సేతుపతి

''నా పేరు మహారాజ సార్.. కేకే నగర్‌లో సెలూన్ షాప్ పెట్టుకున్నాను. ఇంట్లో ఉన్న లక్ష్మిని దొంగిలించారు. ఎఫ్ఐఆర్ ఫైల్ చేద్దామని వచ్చా'' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'మహారాజ' సినిమా ట్రైలర్. విజయ్ సేతుపతి హీరోగా నటించిన 50వ చిత్రం ఇది. నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఈ నెల 14న ఏపీ, తెలంగాణలో ఎన్‌వీఆర్ సినిమా విడుదల చేయనుంది. ''నీ కూతురు, భార్య, అక్కా చెల్లెలు కాదంటున్నావ్.. మరి.. లక్ష్మి అంటే ఎవరయ్యా' అనే డైలాగ్స్ విడుదలైన తెలుగు ట్రైలర్‌లో ఉన్నాయి.

సాక్షి బిజినెస్
గురువారం
6-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 2,303	74,382
నిఫ్టీ ▲ 736	22,620

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	17,122	▲ 265
డోజోన్స్	38,732	▲ 21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,247	▲ 15
డాక్స్	18,576	▲ 170
షాంఘై	3,065	▽ 26
నికాయ్	38,490	▽ 347

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,986 ▲	17
బంగారం (99.5 స్వచ్ఛత)	71,698 ▲	17
వెండి (కిలో)	88,530 ▽	307

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.05	84.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.47	108.03
€	యూరో	ఎస్‌బీఐ	89.72	92.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.19	54.37
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.68	56.62
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.75	63.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.82	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.37



మార్కెట్ యూటర్న్..

కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో మూడోసారి ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఖరారు కావడంతో నేలకొట్టిన బంతిలా దేశీ స్టాక్ మార్కెట్లు బౌన్స్‌బ్యాక్‌ను సాధించాయి. ఇన్వెస్టర్లు మూకుమ్మడిగా కొనుగోళ్లకు ఎగబడటంతో సెన్సెక్స్ ఇంట్రా డేలో 2,456 పాయింట్ల 'పోల్'వాల్ట్ చేసింది. నిఫ్టీ సైతం 786 పాయింట్లు జంప్‌చేసింది. దీంతో సెన్సెక్స్ తిరిగి 74,530 పాయింట్లను అధిగమించగా.. నిఫ్టీ 22,670ను దాటేసింది. వెరసి ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 13 లక్షల కోట్లకుపైగా బలపడింది!

- సెన్సెక్స్ 2,303 పాయింట్ల ర్యాలీ
- మళ్లీ 74,000 మైలురాయిపైకి..
- అన్ని రంగాలు లాభాల దూకుడు

ముంబై: సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున గత నాలుగేళ్లలోనే అత్యధిక స్థాయి పతనాన్ని చవిచూసిన స్టాక్ మార్కెట్లు మళ్లీ పుంజుకున్నాయి. బీజేపీ కూటమి మరోసారి అధికారాన్ని చేపట్టే వీలుండటంతో సెంటిమెంటు బలపడింది. ఒక్కసారిగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఉపక్రమించడంతో ఇండెక్సులు లాభాల పరుగు అందుకున్నాయి. సెన్సెక్స్ 2,303 పాయింట్లు జంప్‌చేసి 74,382 వద్ద నిలిచింది. నిఫ్టీ 736 పాయింట్లు పురోగమించి 22,620 వద్ద ముగిసింది. ఫలితంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు రూ. 13.22 లక్షల కోట్లు జమయ్యింది. మొత్తం విలువ రూ. 408 లక్షల కోట్ల(4.89 ట్రిలియన్ డాలర్ల)కు చేరింది!

ఎఫ్‌పీఐ అమ్మకాలు

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 4.4%, 3% చొప్పున ఎగశాయి. కాగా.. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) తాజాగా రూ. 5,656 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించగా.. దేశీ ఫండ్స్ రూ. 4,555 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. మంగళవారం ఎఫ్‌పీఐలు రూ. 12,436 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 3,319 కోట్లు చొప్పున పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. దీంతో బీఎస్‌ఈ మార్కెట్ విలువలో రూ. 31 లక్షల కోట్లకుపైగా తగ్గింది.

బ్లూ చిప్స్ దన్ను...

ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ 6-2 శాతం మధ్య ఎగశాయంటే కొనుగోళ్ల జోరును అర్థం చేసుకోవచ్చు! ప్రధానంగా మెటల్, ఆటో, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా, కన్జూమర్ డ్యూరబుల్స్ 4 శాతంపైగా బలపడ్డాయి. సెన్సెక్స్, నిఫ్టీ దిగ్గజాలలో దాదాపు అన్ని షేర్లూ లాభపడ్డాయి.

అదానీ షేర్లు అప్

మార్కెట్ల బౌన్స్‌బ్యాక్‌తో ఒక్క అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ మినహా (-2.6%) అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో అత్యధికం మళ్లీ లాభపడ్డాయి. దీంతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 15.57 లక్షల కోట్లను అధిగమించింది.

ఎన్‌ఎస్‌ఈ ప్రపంచ రికార్డ్



ఒకే రోజు 1,971 కోట్ల లావాదేవీలు

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ బుధవారం ప్రపంచ రికార్డును సాధించింది. ఒకే రోజు 1,971 కోట్ల లావాదేవీలకు వీలు కల్పించడం ద్వారా తాజా ఫీట్‌ను సాధించినట్లు ఎక్స్ఛేంజీ ఎండీ, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ వెల్లడించారు. జూన్ 5న నిర్వహించిన 6.15 గంటల ట్రేడింగ్‌లో ఎన్‌ఎస్‌ఈ 19.71 బిలియన్ ట్రాన్సాక్షన్లకు వేదికైనట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఈలో ట్రేడింగ్ ఉదయం 9.15కు ప్రారంభమై 3.30కు ముగుస్తుంది.

బీహెచ్‌ఈఎల్‌కు రూ.3,500 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీహెచ్‌ఈఎల్ తాజాగా అదానీ పవర్ నుంచి రూ.3,500 కోట్లకుపైగా విలువ చేసే భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ వద్ద అదానీ పవర్ కోసం సూపర్ క్రిటికల్ సాంకేతికతతో బొగ్గు ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్‌ను బీహెచ్‌ఈఎల్ నిర్మించనుంది. బాయిలర్, టర్బైన్ జనరేటర్ సరఫరాతోపాటు 800 మెగావాట్ల సామర్థ్యంగల రెండు యూనిట్ల ఏర్పాటు, పర్యవేక్షణకు ఒప్పందం కుదిరినట్లు బీహెచ్‌ఈఎల్ తెలిపింది.

మేలో 'సేవలు' పేలవం



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం మేనెల్లో ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఏప్రిల్ నెల్లో 60.8 వద్ద ఉన్న హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ మే లో 60.2కు తగ్గింది. కాగా, కొత్త ఎగుమతుల ఆర్డర్లు 10 సంవత్సరాల గరిష్టానికి చేరడం హర్షణీయ పరిణామం.

సంకీర్ణ ప్రభుత్వం..

తగ్గనున్న సంస్కరణల వేగం..

- మిత్రపక్షాలపై బీజేపీ ఆధారపడాల్సి రావడమే కారణం
- అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల అంచనాలు



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడం, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మిత్రపక్షాలపై ఆధారపడాల్సి వస్తుండటం వంటి పరిణామాలు భారత్‌పై అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో సందేహాలు రేకెత్తిస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వం కారణంగా సంస్కరణల వేగం తగ్గే అవకాశం ఉందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. దీనివల్ల భూ, కార్మిక సంస్కరణలకు క్లేశం పడవచ్చని, ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి విఘాతం కలగవచ్చని ఆందోళన వ్యక్తపర్చాయి. 2014 తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ మెజారిటీని కోల్పోవడానికి సంబంధించిన ప్రభావాలపై ఫిచ్ రేటింగ్స్, మూడీస్ రేటింగ్స్ వేర్వేరుగా నివేదికలు ఇచ్చాయి.




ఆర్థిక క్రమశిక్షణకు బ్రేక్..

పటిష్టమైన ఆర్థిక వృద్ధి సాధించే దిశగా మౌలిక సదుపాయాలపై వ్యయాలు పెంచడం, దేశీయంగా తయారీ రంగానికి తోడ్పాటునివ్వడం వంటి పాలసీపరమైన విధానాలు ఇకపైనా కొనసాగవచ్చని మూడీస్ అభిప్రాయపడింది. అయితే, బీజేపీకి మెజారిటీ తగ్గడం వల్ల కీలకమైన ఆర్థిక, ద్రవ్యపరమైన సంస్కరణల అమల్లో జాప్యం జరగొచ్చని, ఆర్థిక క్రమశిక్షణ పురోగతికి విఘాతం కలగవచ్చని పేర్కొంది. 2025-26లో జీ20 కూటమిలోని మిగతా దేశాలతో పోలిస్తే భారత్ అత్యధిక వృద్ధి సాధించగలదని భావిస్తున్నప్పటికీ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలకు రిస్కులు ఉన్నాయని తెలిపింది. 'వివిధ రంగాల్లో నిరుద్యోగ యువత సంఖ్య భారీ స్థాయిలో ఉండటం, వ్యవసాయ రంగంలో ఉత్పాదకత వృద్ధి బలహీనంగా ఉండటం వంటి అంశాలు ప్రతికూల ప్రభావాలు చూపడాన్ని కొనసాగించవచ్చు'అని మూడీస్ వివరించింది. ఇక ద్రవ్యలోటు విషయానికొస్తే 2024-25లో నిర్దేశించుకున్న విధంగా దీన్ని 5 శాతానికి తగ్గించుకోగలిగితే, 2025-26లో 4.5% స్థాయిని సాధించవచ్చని పేర్కొంది. కాగా, ద్రవ్య, రుణపరమైన కొలమానాల విషయంలో ఇండొనేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌ల్యాండ్‌తో పోలిస్తే భారత్ బలహీనంగానే ఉన్నట్లు పేర్కొంది.

ల్యాండ్, లేబర్ సంస్కరణల అమలు కష్టమే

'బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ తదుపరి ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ప్రధానిగా మోదీ మూడోసారి పగ్గాలు చేపట్టినప్పటికీ మెజారిటీ తగ్గిపోవడమనేది, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న సంస్కరణల అజెండాకు సవాలుగా పరిణమించవచ్చు' అని ఫిచ్ పేర్కొంది. పూర్తి మెజారిటీ రాకపోవడంతో మిత్రపక్షాలపై ఎక్కువగా ఆధారపడాల్సి రావడం వల్ల 'వివాదాస్పద సంస్కరణలను, ముఖ్యంగా ల్యాండ్, లేబర్ సంస్కరణలను అమలు చేయడం కష్టంగా మారొచ్చు. దేశీ తయారీ రంగ పోటీతత్వాన్ని పెంచేందుకు ఇవే తమకు అత్యంత ప్రాధాన్య అంశాలంటూ బీజేపీ ఇటీవలే పేర్కొంది' అని ఫిచ్ తెలిపింది. మరోవైపు, ప్రభుత్వం తమ జీవనోపాధిని మెరుగుపర్చాలని సూచించేలా ప్రజలు తీర్పునిచ్చిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం హిందుత్వ జాతీయవాదాన్ని పక్కన పెట్టి ప్రజాభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందని ఫిచ్ గ్రూప్‌లో భాగమైన బీఎంఐ పేర్కొంది. అయితే, మధ్యకాలికంగా చూస్తే భారత్‌పై సానుకూల అంచనాలు పటిష్టంగానే ఉన్నాయని, ఈ దశాబ్దం ఆఖరు నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఎకానమీగా ఆవిర్భవించగలదని బీఎంఐ ఏషియా హెడ్ (కంట్రీ రిస్క్) డారెన్ టే తెలిపారు. బీజేపీ ఎక్కడెక్కడైతే హిందుత్వ జాతీయవాదంపై గట్టిగా ప్రచారం చేసిందో ఆయా రాష్ట్రాలన్నీ దానికి ప్రతికూల ఫలితాలు ఇచ్చాయని, ఉత్తర్ ప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు ఇందుకు నిదర్శనమని చెప్పారు.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

పెరూలో యూపీఐ చెల్లింపులు



న్యూఢిల్లీ: ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ తాజాగా సెంట్రల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ పెరూ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వంటి రియల్ టైమ్ చెల్లింపుల వ్యవస్థను పెరూలో అందుబాటులోకి తేనున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే దక్షిణ అమెరికాలో దీన్ని ప్రవేశపెట్టిన తొలి దేశంగా పెరూ స్థానం సంపాదించనుంది. రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌ను ఆ దేశంలో స్థాపించడంతోపాటు వ్యక్తులు, వ్యాపార సంస్థల మధ్య తక్షణ చెల్లింపులను అందించేందుకు సెంట్రల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ పెరూకు ఈ భాగస్వామ్యం దోహదం చేస్తుంది.

హైదరాబాద్, తిరుపతి షోరూమ్‌లలో

భీమా జ్యువెల్స్ ఫెస్టివల్



హైదరాబాద్: భీమా జ్యువెల్స్ హైదరాబాద్, తిరుపతిల్లోని తన షోరూమ్‌లలో స్టడ్స్ అండ్ డ్రాప్స్ జ్యువెలరీ ఫెస్టివల్‌ను ప్రారంభించింది. ఈ నెల 16వ తేదీ వరకూ ఈ జ్యువెలరీ ఉత్సవాలు కొనసాగుతాయని ఒక ప్రకటన పేర్కొంది. ఈ సందర్భంగా తమ కస్టమర్లకు 5000కుపైగా అద్భుతమైన డిజైన్‌లు, ఆకర్షణీయమైన ఆఫర్లు అందుబాటులో ఉంటాయని చైర్మన్ బీ బిందు మాధవ్ ప్రకటనలో పేర్కొన్నారు.

రియల్‌మీ నుంచి నార్జో ఎన్63



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తాజాగా నార్జో ఎన్63 ఫోన్‌ను ఆవిష్కరించింది. దీని ఫస్ట్ సేల్ జూన్ 10 నుంచి 14 వరకు రియల్‌మిడాట్‌కామ్, అమెజాన్ వెబ్‌సైట్లలో ఉంటుంది. ఇందులో రెండు స్టోరేజ్ వేరియంట్స్ ఉంటాయి. 4జీబీ ప్లస్ 64 జీబీ ధర రూ. 8,499గా, 4జీబీ ప్లస్ 128 జీబీ ఫోన్ ధర రూ. 8,999గా ఉంటుంది. సేల్ సందర్భంగా రెండు వేరియంట్స్‌పై కొనుగోలుదారులు రూ. 500 విలువ చేసే కూపన్లను పొందవచ్చు. ఈ ఫోన్లలో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ఏఐ కెమెరా, 45వా సూపర్‌వూక్ చార్జ్, ఎయిర్ జెస్చర్స్, మినీ క్యాప్సూల్, 2.0 తదితర ఫీచర్స్ ఉంటాయి.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్-2024

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్ట్ విధానంలో బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్, బీ డిజైన్, బీప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్:** 510 సీట్లు.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
» **బీడిజైన్ అండ్ బీప్లానింగ్ ప్రోగ్రామ్:** 80 సీట్లు.
» **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీతో 10+2ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్,కౌన్సిలింగ్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.
» **పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, కడప, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 12.06.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 15.06.2024.
» **వెబ్‌సైట్:** http://www.anucet.in

ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్శిటీలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్శిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్,అనుబంధ పాలిటెక్నిక్ కాలేజీలలో నాలుగు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** ప్రభుత్వ-688, అనుబంధ -2530.

కోర్సులు, సీట్ల వివరాలు

» **డిప్లొమా ఇన్ అగ్రికల్చర్(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-578, అనుబంధ కళాశాలలు-1900.
» **డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-25, అనుబంధ కళాశాలలు-260.
» **డి ప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్(రెండేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-25, అనుబంధ కళాశాలలు-40.
» **డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్(మూడేళ్లు):** సీట్లు: ప్రభుత్వ కళాశాలలు-60, అనుబంధ కళాశాలలు-330.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.08.2024 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 01.06.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 20.06.2024.
» **వెబ్‌సైట్:** https://angrau.ac.in

ఐఐఎస్‌టీ తిరువనంతపురంలో యూజీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 140

కోర్సుల వివరాలు

» **బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(బీటెక్):** 120 సీట్లు. విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఏవియానిక్స్)
» **డ్యూయల్ డిగ్రీ(బీటెక్+మాస్టర్ ఆఫ్ సైన్స్/మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ):** 20 సీట్లు. **విభాగాలు:** ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఎర్త్ సిస్టమ్ సైన్స్, ఆప్టికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** కనీసం 75 శాతం మార్కులతో 12వ తరగతి ఉత్తీర్ణతతో పాటు జేఈఈ (అడ్వాన్స్‌డ్) 2024 స్కోరు సాధించి ఉండాలి.
» **వయసు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులు 01.10.1999న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 01.10.1994న లేదా ఆ తర్వాత జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 స్కోర్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 03.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.06.2024.
» **ఐఐఎస్‌టీ అడ్మిషన్ ర్యాంక్ జాబితా వెల్లడి:** 15.06.2024.
» **బ్రాంచ్ ప్రాధాన్యాల సవరణల నమోదుకు చివరి తేది:** 16.06.2024.
» **సీట్ల కేటాయింపు:** 17.06.2024 నుంచి 08.07.2024 వరకు
» **ఐఐఎస్‌టీలో ప్రవేశాల ప్రారంభం:** 22.07.2024
» **వెబ్‌సైట్:** https://www.iist.ac.in

అడ్వాన్స్‌డ్ కటాఫ్ 80!

ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశాలకు మే 26న జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది హాజరైనట్లు అంచనా! తెలుగు రాష్ట్రాల నుంచి 45 వేల మందికిపైగా ఈ పరీక్ష రాసినట్లు సమాచారం!! మరోవైపు ఐఐటీలు, నిట్‌లు తదితర 121 ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాల కౌన్సెలింగ్ కోసం జోసా (జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) వెబ్‌సైట్ తాజాగా అందుబాటులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్ విశ్లేషణతోపాటు కటాఫ్ అంచనా, కౌన్సెలింగ్ విధానం, టాపర్లు ఆసక్తి చూపుతున్న బ్రాంచ్‌లు, ఇన్‌స్టిట్యూట్స్ తదితర వివరాలు..

» పరీక్ష కఠినంగానే ఉందంటున్న విద్యార్థులు
» కటాఫ్ 80 మార్కులుగా ఉంటుందని అంచనా
» జూన్ 9న వెలువడనున్న ఫలితాలు
» 10 నుంచి జోసా కౌన్సెలింగ్‌కు అవకాశం!



జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహించారు. ఒక్కో పేపర్‌లో 51 ప్రశ్నలు అడిగారు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 17 ప్రశ్నలు చొప్పున వచ్చాయి. ఒక్కో పేపర్‌కు 180 మార్కులు చొప్పున రెండు పేపర్లను కలిపి 360 మార్కులకు పరీక్ష జరిగింది.

పేపర్-1 మోస్తరు క్లిష్టత

జేఈఈ అడ్వాన్స్‌డ్ పేపర్-1 ఓ మోస్తరు క్లిష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ముఖ్యంగా మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కొంత కఠినంగా ఉన్నాయని విద్యార్థులు అంటున్నారు. ఫిజిక్స్ విభాగం కూడా క్లిష్టంగానే ఉందని పేర్కొంటున్నారు. జేఈఈ-మెయిన్స్ సిలబస్‌లో లేని అంశాలు అడ్వాన్స్‌డ్‌లో ఉండడం వల్లనే విద్యార్థులు ప్రశ్నలు కఠినంగా ఉన్నట్లు భావిస్తున్నారని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు.

పేపర్-2.. క్లిష్టంగా

పేపర్-1 కంటే పేపర్-2 బాగా కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ విభాగాల ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని అంటున్నారు. ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలకు సమాన వెయిటేజీ కల్పించే ప్రశ్నలు అడిగారని చెబుతున్నారు. ఫిజిక్స్‌లోనూ ఓ మోస్తరు క్లిష్టతతో ప్రశ్నలు ఎదురయ్యాయని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొన్నారు. ఈ విభాగంలో ప్రశ్నలు కొంత సుదీర్ఘంగా, క్యాలిక్యులేషన్స్‌కు ఎక్కువ సమయం పట్టే విధంగా ఉండడంతో సమయాభావ సమస్య ఎదురైందని చెబుతున్నారు.

మ్యాథమెటిక్స్

రెండు పేపర్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ప్రశ్నలు కఠినంగా ఉన్నాయి. వీటికి అంచెలవారీగా సమాధానాలు రాబట్టే క్రమంలో సమయాభావానికి గురైనట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, హార్మోనిక్ ప్రోగ్రెషన్స్, వెక్టార్స్, ప్రాబబిలిటీ, ఎలిప్స్, మ్యాట్రిసెస్, ఫంక్షన్స్ నుంచి అడిగిన ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నాయి. 3-డి జామెట్రీ, కానిక్ సెక్షన్స్ విభాగం ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేపర్-2లో కో-ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది.

ఫిజిక్స్.. కఠినంగానే

ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో కాన్సెప్ట్ ఆధారితంగా అడిగారు. ఎలక్ట్రిసిటీ, రొటేషనల్ మోషన్, కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, థర్మోడైనమిక్స్, సర్ఫేస్ టెన్షన్‌ల నుంచి అడిగిన ప్రశ్నలు రెండు, మూడు కాన్సెప్ట్‌ల సమ్మిళితంగా సుదీర్ఘంగా ఉన్నాయి. వీటిని అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఎక్కువ సమయం పట్టిందని నిపుణులు పేర్కొంటున్నారు.

కెమిస్ట్రీ.. కొంత ఊరట

మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాల్లో కఠినమైన ప్రశ్నలతో ఇబ్బంది పడిన విద్యార్థులకు కెమిస్ట్రీ విభాగం కొంత ఊరటనిచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నట్లుగా చెబుతున్నారు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి మోల్ కాన్సెప్ట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, సర్ఫేస్ కెమిస్ట్రీ, థర్మో డైనమిక్స్, కెమికల్ కైనటిక్స్ విభాగాల నుంచి ప్రశ్నలు అడిగారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో.. కాన్సెప్ట్ బేస్డ్ ప్రశ్నలు, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ బేస్డ్ ప్రశ్నలు ఎదురయ్యాయి.

కటాఫ్ 80!

రెండు పేపర్లుగా మొత్తం 360 మార్కులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌లో కటాఫ్ 80గా ఉంటుందని అంచనా. ఇది 60 మార్కులకు పరిమితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే పరీక్ష క్లిష్టంగా ఉన్నప్పటికీ.. అభ్యర్థుల సంఖ్య పెరగడం కటాఫ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందంటున్నారు.

మొత్తం 17,385 సీట్లు

అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా 23 ఐఐటీల్లో ప్రవేశాలు లభిస్తాయి. వీటిల్లో 17,385 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఎంతో క్రేజీగా భావించే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌తోపాటు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటితో పాటు బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్, బయోటెక్ అండ్ బయో కెమ్ ఇంజనీరింగ్, బయో ఇంజనీరింగ్ వంటి వైద్య అనుబంధ బ్రాంచ్‌లు ఉండడం విశేషం. అంతేకాకుండా ఇటీవల మార్కెట్ ట్రెండ్‌కు అనుగుణంగా డేటాసైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ-ఎంఎల్ వంటి బ్రాంచ్‌లను ప్రవేశపెట్టారు. వీటితోపాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో.. డేటాసైన్స్ మేజర్‌గా కొత్త ప్రోగ్రామ్ అందుబాటులోకి వచ్చింది. అదే విధంగా.. అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ (బీటెక్+ఎంటెక్) కోర్సులను కూడా ప్రవేశపెట్టారు.

సీఎస్‌ఈకే తొలి ప్రాధాన్యం

అడ్వాన్స్‌డ్ టాప్ ర్యాంకర్ల తొలి ప్రాధాన్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్‌ఈ) బ్రాంచ్ నిలుస్తోంది. గతేడాది ఐఐటీ-ముంబైలో సీఎస్‌ఈ క్లోజింగ్ ర్యాంకు 67గా నమోదవగా.. ఐఐటీ-ఢిల్లీలో 118గా, ఐఐటీ-చెన్నైలో 148గా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 279, ఐఐటీ-రూర్కీలో 412, ఐఐటీ-హైదరాబాద్‌లో 674గా నమోదయ్యాయి. మిగతా ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో 2000లోపు ర్యాంకుతోనే సీఎస్‌ఈ సీట్లు భర్తీ అవడం ఈ బ్రాంచ్‌కున్న క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు.

సీఎస్‌ఈ కాకుంటే

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది సీఎస్‌ఈ రాకపోతేనే ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌ల వైపు చూస్తున్నారు. గత ఏడాది ఆరు రౌండ్లలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో.. విద్యార్థుల ఆప్షన్లను పరిశీలిస్తే ఈ నాలుగు బ్రాంచ్‌లే ముందంజలో నిలిచాయని స్పష్టమవుతోంది. వీటిలో ఓపెన్ కేటగిరీలో చివరి రౌండ్‌లో తొమ్మిది వేలలోపు ర్యాంకు క్లోజింగ్ ర్యాంకుగా నమోదైంది.

ఏఐ-ఎంఎల్ కోర్సులకూ క్రేజ్

జాబ్ మార్కెట్ అవసరాలు, మారుతున్న టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని పలు ఐఐటీలు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి అనుబంధ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించాయి. వీటివైపు కూడా ర్యాంకర్లు మొగ్గు చూపుతున్నారు. వీటిలోనూ క్లోజింగ్ ర్యాంకు గరిష్టంగా రెండు వేల లోపుగా నమోదవడం గమనార్హం.

జోసాతో సీట్ల కేటాయింపు

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ ఆధ్వర్యంలో 23 ఐఐటీలతోపాటు 31 నిట్‌లు, 26 ట్రిపుల్ ఐటీలు, ఐఐఈఎస్‌టీ షిబ్‌పూర్, 3 ఎస్‌పీఏలు, 37 ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం ఇప్పటికే జోసా(జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ) వెబ్‌సైట్‌ను ఐఐటీ మద్రాస్ అందుబాటులోకి తెచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్ ఉత్తీర్ణులు జోసా కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొని సీటు పొందొచ్చు. ఇందుకోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియలో ఇన్‌స్టిట్యూట్స్, ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాలి. తదుపరి దశలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలతో సహా నిట్‌లు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రాథమ్యాలుగా ఎంచుకునే అవకాశం లభిస్తుంది.

ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మొత్తం ఆరు రౌండ్లలో జరుగనుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం-జోసా-2024 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 10 నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వొచ్చు.

పోలీస్ కస్టడీకి సినీ నటి హేమ




బనశంకరి: బెంగళూరు రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్నారనే కేసులో అరెస్టు అయిన సినీ నటి హేమను సీసీబీ పోలీసులు బుధవారం నగర శివార్లలోని ఆనేకల్ నాలుగవ అదనపు సివిల్ జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరుపరిచారు. మరింత విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాలని సీసీబీ న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఇరువర్గాల వాదనలను విన్న న్యాయమూర్తి 24 గంటలపాటు సీసీబీ కస్టడీకి అనుమతించారు. కాగా, పోలీస్ వాహనంలో ఆనేకల్ కోర్టుకు రాగానే హేమ 'నేను హత్య చేశానా? అర్ధరాత్రి తీసుకెళ్లి అడవిలో సంతకం చేయించుకున్నారు. నేను ఏమి చేశానని అర్ధరాత్రి పూట తీసుకెళ్తున్నారు?' అని మీడియా ముందు వాపోయారు.

ఇండో–ఫ్రాన్స్ కలయికతో 'త్రిష్ణా'

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్న ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), సెంటర్ నేషనల్ ఎట్యుడస్ స్పాటైలెస్ (సీఎన్ఈఎస్) అనే అంతరిక్ష సంస్థలు సంయుక్తంగా త్రిష్ణా (థర్మల్ ఇన్‌ఫ్రా–రెడ్ ఇమేజింగ్ శాటిలైట్ ఫర్ హై రిజల్యూషన్ నేచురల్ రిసోర్స్ అసెస్‌మెంట్) అనే భూ పరిశీలన ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు భారత్–ఫ్రాన్స్‌లు ఒప్పందం చేసుకున్నాయి. ఈ విషయాన్ని బుధవారం ఇస్రో అధికారులు తెలిపారు. భూమి ఉపరితలంపై ఉష్ణోగ్రతలు, ఉద్గారత, బయో ఫిజికల్, రేడియేషన్, అధిక టెంపోరల్ రిజల్యూషన్ పర్యవేక్షణ కోసం ఇరు దేశాలు సంయుక్తంగా ఈ ఉపగ్రహాన్ని రూపొందిస్తున్నాయి. ఈ ఉపగ్రహంలో రెండు పెద్ద పేలోడ్స్‌ను అమర్చి పంపబోతున్నట్లు ఇస్రో తెలిపింది. త్రిష్ణా ఉపగ్రహం రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీలో గణనీయమైన పురోగతిని సూచిస్తుందని, క్లిష్టమైన నీరు, ఆహారభద్రత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుందని, ఇప్పటిదాకా ప్రయోగించిన రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలు ఒక ఎత్తయితే త్రిష్ణా శాటిలైట్ మరో ఎత్తు అని ఇస్రో పేర్కొంది. ఈ ప్రయోగాన్ని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనుంది.



త్రిష్ణా ఉపగ్రహం నమూనా

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.